
'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 289

మంగళవారం 9-1-2024



ఇషా డబుల్ ధమాకా

ఆసియా క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నీలో రెండు స్వర్ణాలు. - 12లో



సెన్సెక్స్ 671 పాయింట్లు క్రాష్

నిఫ్టీకి 198 పాయింట్ల నష్టం. ప్రపంచ ప్రతికూల సంకేతాల ప్రభావం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నిషిద్ధ కాంతి చిక్కింది..

కంటికి కనబడని విశ్వపు సుదూరాల్లోని నిషిద్ధ కాంతిని హబుల్ టెలిస్కోప్ తాజాగా తన కెమెరాలో బంధించింది.

- వివరాలు 6లో



చంద్రుడిపై అమెరికా కన్ను..

అమెరికా పెరిగ్రీన్ ల్యాండర్‌ను యునైటెడ్ లాంచ్ అలయన్స్ వల్కన్ రాకెట్ ద్వారా నింగిలోకి విజయవంతంగా పంపింది.

- వివరాలు 6లో



'అవామీ'కి 223 స్థానాలు..

బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో 299 స్థానాలకు గాను అధికార అవామీ లీగ్ 223 స్థానాల్లో గెలిచింది.

- వివరాలు 6లో



పేదల ప్రగతితో బలమైన భారత్

పేదలు, రైతులు, మహిళలు, యువత సాధికారత సాధిస్తే దేశం శక్తివంతంగా మారుతుందని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

'ఈఎంసీ'లకు 340 కోట్ల కేంద్ర సాయం



రాష్ట్రంలో రెండు ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లలో కామన్ ఫెసిలిటీల ఏర్పాటుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే క్లస్టర్‌కయ్యే వ్యయంలో రూ.75 కోట్లను గ్రాంటుగా ఇవ్వనున్నట్లు చెప్పింది.

- వివరాలు 3లో

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న బీజేపీ



లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత కోసం బీజేపీ రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలకు 'పొలిటికల్ ఇన్‌చార్జ్'లను నియమించింది. పార్టీకి ఉన్న 8 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీని ఆయా ఎంపీ సీట్లకు ఇన్‌చార్జులుగా నియమించింది.

- వివరాలు 2లో

బహుళజాతి కంపెనీల 'డిగ్రీ' రూట్



బహుళజాతి కంపెనీలు కూడా డిగ్రీ కాలేజీల్లో క్యాంపస్ నియామకాలకు ఆసక్తి చూపుతున్నాయి. ఇంజనీరింగ్ కాలేజీల తరహాలోనే ఇక్కడా నిపుణులైన వారికి మంచి ఆఫర్లు ఇస్తున్నాయి.

- వివరాలు 14లో

గురివింద.. గుంజీలు

- విజయవాడ ఈనాడు కార్యాలయాన్ని ఖాళీ చేసిన రామోజీ..
- అసలు యజమాని వల్లూరి రామకృష్ణ చేతికి స్థలం
- 40 ఏళ్లుగా పత్రిక పేరుతో నామమాత్రపు లీజుకే మూడెకరాలు
- లీజు ముగిసి పదేళ్లు దాటినా ఖాళీ చేయకుండా గురివింద తిష్ట
- ఎట్టకేలకు న్యాయస్థానం తీర్పుతో యజమానికి భూమి అప్పగించి పలాయనం.. విశాఖలోనూ ఇదే తరహాలో 'భూమోజీ' భూ అక్రమాలు

10లో



అర్హుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

హామీల అమలు, విధివిధానాలకు డిప్యూటీ సీఎం అధ్యక్షతన సబ్ కమిటీ

- ఈనెల 30లోగా డేటా ఎంట్రీ పూర్తి చేస్తాం
- గత ప్రభుత్వ వైఫల్యాలన్నీ ఆధారాలతో బయటపెడతాం
- ప్రతి అర్హుడికి లబ్ధి చేకూరాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- అన్నీ చేస్తాం.. వందరోజులు ఓపిక పట్టండి
- దుష్ప్రచారం చేస్తే మాజీ మంత్రులైనా వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవు
- మీడియా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఆరు గ్యారంటీల అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించడానికి ఇంటింటి సర్వే నిర్వహిస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఇచ్చిన మాటకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని, ఆరు గ్యారంటీలను వందరోజుల్లో తప్పకుండా అమలు చేస్తామని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. ప్రజాపాలన దరఖాస్తులు..తదుపరి కార్యాచరణపై చర్చించారు. ఆ సమావేశ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సచివాలయ మీడియా సెంటర్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కోటి ఐదు లక్షల దరఖాస్తులు ఆరు గ్యారంటీలకు రాగా, మరో 20 లక్షల దరఖాస్తులు రేషన్‌కార్డులు, ఉద్యోగాలు, భూసమస్యలపైనా వచ్చాయన్నారు. 30వేల మందికిపైగా ఆపరేటర్లతో యుద్ధప్రాతిపదికన డేటాఎంట్రీ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే 13 నుంచి 14 శాతం వరకు ఎంట్రీ పూర్తయ్యిందని, మొత్తం పూర్తిచేసేందుకు ఈనెల 25 నుంచి 30వతేదీ వరకు సమయం పడుతుందని, ఆలోపు పూర్తి సమాచారం కంప్యూటరీకరిస్తామన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులను లింకప్ చేసి నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ హామీలన్నీ అందిస్తామని చెప్పారు. డేటాఎంట్రీ పూర్తయిన తర్వాత అర్హులందరి లిస్ట్ గ్రామాల వారీగా

మిగతా 2వ పేజీలో ▶

కమిటీలో ఎవరంటే..

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనకు కేబినెట్ సబ్‌కమిటీని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అధ్యక్షతన ఏర్పాటు చేసినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సబ్‌కమిటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు తాను సభ్యుడిగా ఉన్నానని పొంగులేటి చెప్పారు. ఈ కమిటీ ఆరు గ్యారంటీల అమలుపై చర్చించి ఒక నిర్ణయానికి వస్తుందని తెలిపారు. రేషన్‌కార్డులపైనా త్వరలోనే స్పష్టత ఇస్తామన్నారు. ప్రస్తుతం 89 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయని, కార్డులు లేనివారి నుంచి ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకున్నామని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఈనెల 6వ తేదీ నుంచి అధికారులంతా ఓటర్‌లిస్ట్ ప్రక్రియలో ఉన్నారని, అయినా ఆరు గ్యారంటీల అమలు ప్రక్రియలో భాగంగా డేటాఎంట్రీ కొనసాగుతుందన్నారు. సంక్రాంతి తర్వాత మీడియా సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన భూములకు సంబంధించిన జీఓలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటాం

సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో హెచ్‌సీసీబీ ప్రతినిధుల వెల్లడి

నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు

ఈ నెల 26 తర్వాత సీఎం రేవంత్ జిల్లాల పర్యటన

- వివరాలు 2లో

'బిల్కిస్' దోషులకు... శిక్ష తగ్గింపు చెల్లదు

సుప్రీంకోర్టు సంచలన తీర్పు..

- గుజరాత్ ప్రభుత్వ 'రెమిషన్' కొట్టివేత
- మతి లేని నిర్ణయమంటూ మండిపాటు
- దోషులతో గుజరాత్ సర్కారు కుమ్మక్కైంది
- తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడింది
- దోషులు సుప్రీంనే ఏమార్చారు.. వారిని 2 వారాల్లోగా జైలుకు పంపండి: ధర్మాసనం



న్యాయం గెలిచిందన్న బిల్కిస్ బానో

న్యూఢిల్లీ/దాహోద్: బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు సోమవారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ఆమెపై అత్యాచారం, కుటుంబీకుల హత్య కేసులో 11 మంది దోషులకు శిక్షా కాలం తగ్గిస్తూ గతేడాది గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టేసింది. వారు రెండు వారాల్లోగా కోర్టులో లొంగిపోవాల్సిందిగా ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం ఈ మేరకు 251 పేజీల తీర్పు వెలువరించింది. ఓ మహిళపై ఇంతటి క్రూర నేరాలకు పాల్పడ్డ కేసుల్లో శిక్ష తగ్గింపునకు అసలు ఆస్కారమెలా ఉంటుందని గుజరాత్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఇలాంటి విషయాల్లో నిర్ణయాలు తీసుకునేటప్పుడు బాధితురాలి జాతి, మత విశ్వాసాలతో నిమిత్తం ఉండకూడదని స్పష్టం చేసింది. ''శిక్ష తగ్గింపు (రెమిషన్) గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న మతిలేని నిర్ణయం. ఈ విషయంలో దోషులతో ప్రభుత్వం పూర్తిగా కుమ్మక్కైంది. వారి విడుదల కోసం అన్నివిధాలా తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడింది'' అంటూ కడిగి పారేసింది. ''సుప్రీంకోర్టులో రెమిషన్ పిటిషన్ సందర్భంగా దోషులు ఈ కేసులో వాస్తవాలను దాచారు. తద్వారా అత్యున్నత న్యాయస్థానాన్నే ఏమార్చారు. తద్వారా రెమిషన్‌పై పరిశీలనకు ఆదేశాలు పొందారు'' అంటూ ఆక్షేపించింది. ఆ తీర్పు కూడా చెల్లుబాటు కాబోదని ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పును బాధితురాలితో పాటు ప్రధాన రాజకీయ పక్షాలన్నీ స్వాగతించాయి. బానో స్వస్థలంలో ఆమె బంధుమిత్రులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. జైలుకు వెళ్లిన అనంతరం రెమిషన్ కోసం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని

మిగతా 3వ పేజీలో ▶



బీఆర్‌ఎస్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, పోచారం, కేకే, వేముల ప్రశాంత్‌రెడ్డి, కవిత, జీవన్‌రెడ్డి

పథకాల రద్దుకు కాంగ్రెస్ కుట్ర

- అప్పులు, శ్వేతపత్రాల పేరుతో తప్పించుకునే డ్రామాలు: కేటీఆర్
- కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ పనితీరులో మార్పులు
- తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడేది బీఆర్‌ఎస్ మాత్రమే
- నిజామాబాద్ లోక్‌సభ సన్నాహక సమావేశంలో ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల కోసం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేస్తే ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ విధానాలను ఎండగడతామన్నారు. తెలంగాణభవన్‌లో సోమవారం జరిగిన నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీబంధు, గొర్రెల పంపిణీ వంటి కార్యక్రమాల రద్దు దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే ఎంపికైన దళితబంధు, గృహలక్ష్మి, గొర్రెల పంపిణీ పథకం లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలతో నష్టపోతున్న దళితులు, బీసీలకు తాము అండగా నిలుస్తామని చెప్పారు.

శ్వేతపత్రాల పేరిట డ్రామా

ఎన్నికల్లో గెలిచేందుకు ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రస్తుతం అప్పులు, శ్వేతపత్రాల పేరిట డ్రామాలు ఆడుతోందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో వేశామంటూ కాంగ్రెస్ మభ్యపెడుతోందన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రజలను ఇబ్బంది పెట్టేలా లైన్లలో నిలబెట్టే దుస్థితికి కాంగ్రెస్ తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ అస్తవ్యస్త పనితీరు, పరిపాలన లోపాలను ఎండగట్టేలా పార్టీ శ్రేణులు

మిగతా 3వ పేజీలో ▶



మరింత ముదిరిన లక్షద్వీప్-మాల్దీవుల వివాదం..

- లక్షద్వీప్‌లో ప్రధాని మోదీ పర్యటన, లక్షద్వీప్ అపరిశుభ్రమంటూ ముగ్గురు మాల్దీవుల మంత్రుల అక్కసుతో మొదలైన వివాదం మరింత ముదిరింది. భారత పర్యాటక రంగంపై విదేశీ మంత్రుల వివాదాస్పద వ్యాఖ్యలపై మొదలైన 'బాయ్‌కాట్ మాల్దీవులు' ట్రెండ్‌కు అన్ని వర్గాల నుంచి మద్దతు పెరిగింది. లక్షద్వీప్‌ను భారత్ శుభ్రంగా ఉంచలేదంటూ చేసిన వ్యాఖ్యలపై ఢిల్లీలో మాల్దీవుల దౌత్యవేత్త ఇబ్రహీం షాహీబ్‌ను భారత విదేశాంగ శాఖ సోమవారం తన కార్యాలయానికి పిలిపించింది. ఈ నేపథ్యంలో ఆ దేశ దౌత్యవేత్త అలీ నజీర్ మొహమ్మద్‌తో భారత హైకమిషనర్ మును ముహావర్ సమావేశమై మిత్రదేశం పట్ల, ప్రధాని మోదీ పట్ల మాల్దీవుల మంత్రుల వైఖరిని ఎండగట్టారు. కాగా, లక్షద్వీప్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చింగ్ అనూహ్యంగా పెరిగింది.

- వివరాలు 6లో

ఎఫ్‌సీఐకి బియ్యం పంపిణీని వేగవంతం చేయండి..

కస్టమ్ మిల్లింగ్‌పై దృష్టి పెట్టండి.. ఈ నెల 31వ తేదీలోగా లక్ష్యం పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో.. మంత్రి ఉత్తమ్, సీఎస్ వీడియో కాన్ఫరెన్స్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు ఇవ్వాల్సిన బియ్యం పంపిణీని వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కస్టమ్ మిల్లింగ్‌పై దృష్టి సారించాలని, రైస్ మిల్లర్ల ద్వారా బియ్యం ఎఫ్‌సీఐకి అందజేయాలని స్పష్టం చేశారు. తాను ఇటీవల ఢిల్లీ పర్యటించినప్పుడు కేంద్ర అధికారులు పెద్ద మొత్తంలో బియ్యం కేటాయింపులు అడిగారని, ఆశించిన స్థాయిలో బియ్యం నిల్వలు రావడం లేదని వారు ఫిర్యాదు చేశారని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో జనవరి 31వ తేదీలోపు బియ్యం పంపిణీని వేగవంతం చేయాలని స్పష్టం చేశారు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ ఇతర అధికారులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి కలెక్టర్లు, పౌర సరఫరాల సంస్థ, ఎఫ్‌సీఐ అధికారులతో మంత్రి ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

42 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం డెలివరీ చేయాలి..

ఈనెలాఖరు నాటికి 7.83 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, యాసంగి సీజన్‌కు 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరాలో ఆలస్యం జరగకూడదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. మిల్లర్లంతా రాబోయే రోజులలో దాదాపు 42 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని డెలివరీ చేయాల్సి ఉంటుందన్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి మిల్లర్లకు అందించేందుకు పౌరసరఫరాల సంస్థ రుణాలు తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ పెట్టుబడిని తిరిగి పొందడం అనేది మిల్లర్లు ఎఫ్‌సీఐకి బియ్యం పంపిణీ చేయడంపైనే ఆధారపడి ఉంటుందని, జాప్యం జరిగితే కార్పొరేషన్‌కు పెద్ద ఎత్తున నష్టం కలుగుతుందన్నారు. గత పదేళ్లలో రూ.58,000 కోట్ల అప్పులు, రూ. 11,000 కోట్ల నష్టాల వల్ల పౌరసరఫరాలపై భారం పడిందని ఉత్తమ్ ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు

మిగతా 5వ పేజీలో ▶

ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్



- ఈ నినాదంతోనే ప్రజల్లోకి వెళతాం: జి.కిషన్‌రెడ్డి
- ఎంపీ సీట్లలో పోటీ బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యనే...
- తెలంగాణకు కేసీఆర్ కుటుంబం అవసరం లేదు.. బీఆర్‌ఎస్ ఇప్పుడు అప్రస్తుత పార్టీనే
- లోక్‌సభ మేనిఫెస్టోపై ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటాం

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ (మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటు) అనే నినాదంతో ప్రజల్లోకి వెళతామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికలను పూర్తి శక్తియుక్తులతో ఎదుర్కోవాలని పార్టీ నిర్ణయించిందని తెలిపారు. తెలంగాణలో ఎంపీ సీట్లలో పోటీ బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే ఉంటుందని చెప్పారు. ఇప్పుడు తెలంగాణకు కేసీఆర్ కుటుంబ అవసరం లేదని, బీఆర్‌ఎస్ ఇప్పుడు అప్రస్తుత, అప్రాధాన్య పార్టీగా మారిందన్నారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహక భేటీలు, ముఖ్యనేతల సమావేశానంతరం సోమవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ మెజారిటీ ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని, లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించడానికి ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన నవయువ ఓటర్లను కలుస్తామని, వారిలో 90 శాతం మంది మోదీకి అండగా నిలుస్తారనే విశ్వాసం తమకుందన్నారు. చేరికలపైనా తాము దృష్టి పెట్టినట్టు తెలిపారు. పార్టీలో చిన్నచిన్న సమస్యలున్నా, వాటిని అధిగమించి మోదీని ప్రధానిని చేసేందుకు, అత్యధిక ఎంపీలతో బీజేపీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నామని,

మిగతా 2వ పేజీలో ▶



కృష్ణా బోర్డు నియంత్రణలోకి నాగార్జునసాగర్

రెండు గేట్లతో ఏపీకి నీటిని విడుదల చేసిన బోర్డు అధికారులు

తొలిసారిగా కృష్ణా బోర్డు ఆధ్వర్యంలో సాగర్ నిర్వహణ.. నేడు సాగర్‌పై కృష్ణా బోర్డు భేటీ

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ డ్యామ్‌ను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) తాత్కాలికంగా తన అధీనంలోకి తీసుకుంది. సోమవారం బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రఘునాథ్, శివశంకరయ్య కలిసి సాగర్‌లోని గేట్లు 5,7వ నంబర్ గేట్లను ఎత్తి.. ఏపీకి నీటిని విడుదల చేశారు. సోమవారం రాత్రంతా 1000 క్యూసెక్కులు, మంగళవారం ఉదయం నుంచి రోజుకు 4-5 వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 3.03 టీఎంసీలను సాగర్ కుడి కాలువ ద్వారా ఏపీ తాగు నీటి అవసరాల కోసం విడుదల చేయనున్నారు. 3.03 టీఎంసీల నీళ్ల విడుదల పూర్తి కాగానే మళ్లీ గేట్లను కృష్ణా బోర్డు యంత్రాంగమే మూసి వేయనుంది.

తెలంగాణ అభ్యంతరాల నేపథ్యంలో..

ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత శ్రీశైలం డ్యాం నిర్వహణ ఏపీ, సాగర్ డ్యామ్ నిర్వహణను తెలంగాణ చూసింది. గత నవంబర్ 29వ తేదీన భారీ బలగాలతో సాగర్ డ్యామ్‌లో ఏపీ వైపు ఉన్న గేట్లను, డ్యామ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఈ వివాదంపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లాతో పాటు కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి పలు దఫాలుగా సమావేశమయ్యారు. నవంబర్ 29వ తేదీకి ముందున్న పరిస్థితిని నెలకొల్పాలని తెలంగాణ కోరుతూ వస్తోంది. అయితే ఏపీ మాత్రం

మిగతా 5వ పేజీలో ▶

'ఒరిజినల్ ఆధార్' తప్పనిసరి..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే ఏ గుర్తింపుకార్డు అయినా ఓకే
- పాన్‌కార్డు ప్రామాణికంగా తీసుకోవడం సాధ్యం కాదు
- ఎక్స్ వేదికగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పోస్ట్

సాక్షి హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతిని మహిళలు వినియోగించుకోవాలంటే ఒరిజినల్ ఆధార్‌కార్డు తప్పనిసరి అని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. గుర్తింపు కార్డులో ప్రయాణికురాలి ఫొటో, అడ్రస్ స్పష్టంగా కనిపించాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే ఏ ఒరిజినల్ కార్డు అయినా సరే ఈ పథకానికి వర్తిస్తుందని ఆయన 'ఎక్స్'వేదికగా సోమవారం పోస్టు చేశారు. అయితే పాన్‌కార్డు మాత్రం చెల్లుబాటు కాదని పేర్కొన్నారు. పాన్‌కార్డుపై అడ్రస్ ఉండదని,

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

విచారణను అడ్డుకునేందుకే బీఆర్‌ఎస్, బీజేపీ ఏకం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అవినీతిపై న్యాయ విచారణను అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ ఏకమవుతున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీబీఐ విచారణ కంటే న్యాయ విచారణ గొప్పదన్నారు. సీబీఐ కేంద్రం కింద పని చేస్తే.. న్యాయ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందని చెప్పారు. పారదర్శకంగా విచారణ జరిపేందుకే జ్యుడీషియల్ ఎంక్వైరీ వేస్తున్నామని తెలిపారు. కవిత లిక్కర్ కేసును ఈడీ మరుగున పెట్టిందని, అలాగే కేసీఆర్ అవినీతిని కూడా కనుమరుగు చేసేందుకే సీబీఐ విచారణ కోరుతున్నారని జీవన్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం అవినీతిలో అధికారుల పాత్ర కూడా ఉందని, ఈఎన్సీ మురళీధర్‌రావును తొలగిస్తేనే నిజాలు బయటకు వస్తాయన్నారు. 'కేసీఆర్ పాలనలో లక్ష కోట్ల అవినీతి జరిగింది. అందులో కాళేశ్వరం ఒక భాగం మాత్రమే. కాళేశ్వరం, యాదాద్రి, మిషన్ భగీరథలో రూ.50 వేల కోట్లకు మించి అవినీతి జరిగింది' అని వెల్లడించారు. తెలంగాణ పదాన్ని చెరిపేయాలని కాంగ్రెస్ కుట్ర చేస్తోందని కేటీఆర్ అనడం ఆశ్చర్యకరమన్నారు. తెలంగాణ పదాన్ని చెరిపేసిందే కేసీఆర్ అని మండిపడ్డారు.

ఆ కుంభకోణాలపై సీబీఐ విచారణ జరిపించాలి

17 ఎంపీ స్థానాల్లో పోటీ: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



నాగర్‌కర్నూల్ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, అక్రమాలు, టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణాలపై సీబీఐ విచారణ జరిపించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమీక్ష సమావేశానికి హాజరై విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడంలో రూ.వేల కోట్లకు టెండర్లు దక్కించుకుని, నాసిరకమైన పనులు చేసిన కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. మిషన్ భగీరథలో జరిగిన కుంభకోణంపై దర్యాప్తు జరిపించాలని, టీఎస్‌పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేసి జాబ్ కేలండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ రద్దు చేస్తామన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. బలవంతంగా 35 వేల ఎకరాల పేదల అసైన్డ్ భూములను లాక్కొన్నారని, తిరిగి వాటిని పేదలకు ఇవ్వాలని ప్రవీణ్‌కుమార్ కోరారు. పెండింగ్‌లో ఉన్న హాస్టల్, మెస్ చార్జీలు విడుదల చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ స్థానాల్లో బీఎస్పీ పోటీ చేస్తుందని, పొత్తులపై పార్టీ అధినేత్రి మాయావతి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

శాస్త్రీయ దృక్పథంతో నిర్ణయం తీసుకుంటామన్నారు

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్



సాక్షి, హైదరాబాద్: జిల్లాల మార్పుపై సీఎం శాస్త్రీయ దృక్పథంతో నిర్ణయం తీసుకుంటామన్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ అన్నారు. సోమవారం ఇక్కడి గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 33 జిల్లాల్లో ఒక సారూప్యత ఉండేలా చూస్తామని సీఎం చెప్పారని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ కొంతమంది సిట్టింగ్‌లను మార్చితే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయేవాళ్లమే కాదని అంటున్నారని, అదే జనం మాత్రం కేసీఆర్ కుటుంబాన్ని అధికారం నుంచి దించాలని అనుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పార్టీకి సంబంధించిన సమీక్షలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. 'మాది జాతీయ పార్టీ అయినా మాకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అని ఉంటుంది, బీఆర్‌ఎస్‌లో మాత్రం తెలంగాణ అనే పదమే లేదు' అని నిరంజన్ అన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోండి

పార్టీ కార్యకర్త హత్య కేసుపై డీజీపీకి విన్నవించిన బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక హత్యారాజకీయాలు, తమ పార్టీ నాయకులపై దాడులు పెరిగాయని బీఆర్‌ఎస్ పార్టీ ఆరోపించింది. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మల్లేశ్ మృతిపై ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, మల్లయ్యయాదవ్‌తోపాటు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డీజీపీ రవిగుప్తాకు సోమవారం డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. మల్లేశ్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఈ హత్య వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీకి వినతిపత్రం ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీజీపీ హామీ ఇచ్చినట్టు తెలిపారు.

బిల్ట్ పునరుద్ధరణకు ప్రభుత్వం కృషి

ఫిన్ క్వెస్ట్, ఐటీసీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం



సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైన ఐటీసీ పేపర్ బోర్డు సీఈవో వాదిరాజ్ కులకర్ణి

సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లా కమలాపూర్‌లోని బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ను పునరుద్ధరించే అంశంపై పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు, ఫిన్‌క్వెస్ట్ సంస్థ ఎండీ హార్దిక్ పటేల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. బిల్ట్ ఆస్తులు ప్రస్తుతం ఫిన్‌క్వెస్ట్ సంస్థ ఆధీనంలో ఉన్న నేపథ్యంలో ఆ సంస్థ ఎండీతో, బిల్ట్ ఆస్తులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్న ఐటీసీ పేపర్ బోర్డ్స్ డివిజన్ సీఈవో వాదిరాజ్ కులకర్ణితోనూ చర్చలు జరిపారు. 2014లో ఆ మిల్లు మూతపడడం వల్ల దాదాపు 750 కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని వారికి ఉపాధి కల్పించడంతోపాటు, స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారిని కోరారు. ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారాలు ఉంటాయని సీఎం హామీ ఇచ్చారు. ఫిన్ క్వెస్ట్ కంపెనీ ఐటీసీతో చర్చల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఐటీసీ చేపట్టిన ప్రాజెక్టులు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపైనా ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. సీఎంతో పాటు మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి, కార్యదర్శి, సీఎంఓ అధికారులు, ములుగు కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు. గత ప్రభుత్వం 2015, 2018లో ప్రోత్సాహకాలను పొడిగించి, మూతపడ్డ ఈ యూనిట్‌ను పునరుద్ధరించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటాం

సీఎం రేవంత్‌తో హెచ్‌సీసీబీ ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు హిందుస్తాన్‌కోకో కోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ) కంపెనీ ముందుకొచ్చింది. కంపెనీ ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సంప్రదింపులు జరిపింది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఈ కంపెనీ దాదాపు రూ. 3 వేల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టింది. సిద్దిపేట జిల్లాలోని బండ తిమ్మాపూర్‌లో కంపెనీ చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్ నిర్మాణంలో ఉంది. తెలంగాణలో పెట్టుబడులు, సామాజిక అభివృద్ధిలో తమ కంపెనీ భాగస్వామ్యమవుతుందని కంపెనీ ప్రతినిధి బృందం సీఎంతో జరిగిన చర్చల్లో తెలిపింది. కంపెనీల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం అమల్లో ఉంటుందని సీఎం వారికి భరోసా ఇచ్చారు. హెచ్‌సీసీబీ పబ్లిక్ అఫైర్స్ చీఫ్ హిమాన్షు తదితరులు సీఎంను కలిసినవారిలో ఉన్నారు.

నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

అవిశ్వాసానికి అనుకూలంగా 41 మంది ఓటు

వ్యతిరేకించిన ఐదుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



నల్లగొండ టూటౌన్: నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్ సైదిరెడ్డిపై అవిశ్వాసం పెట్టాలని గత నెల 8వ తేదీన కాంగ్రెస్ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా.. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 50 మంది సభ్యులున్న కౌన్సిల్‌లో అవిశ్వాస సమావేశానికి 47 మంది హాజరయ్యారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డితో పాటు బీజేపీ కౌన్సిలర్ బండారు ప్రసాద్ సమావేశానికి రాలేదు. 41 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి అనుకూలంగా చేతులు పైకి ఎత్తారు. వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు చేతులు ఎత్తారు. కాగా, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచి సస్పెన్షన్‌కు గురైన పిల్లి రామరాజుయాదవ్ తటస్థంగా ఉన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు 35 మందితో పాటు బీజేపీ కౌన్సిలర్లు నలుగురు, గత ఎన్నికలకు ముందు బీజేపీ, ఎంఐఎం నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఇద్దరు కౌన్సిలర్లు కూడా అవిశ్వాసానికి అనుకూలంగా చేతులు ఎత్తడంతో 41 మంది మద్దతు లభించింది.

ప్రభుత్వానికి నివేదిక

నల్లగొండ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డిపై అవిశ్వాసం నెగ్గిన నేపథ్యంలో దీనికి సంబంధించిన వివరాలతో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఎన్నికల సంఘం నుంచి తదుపరి ఆదేశాలు రాగానే చైర్మన్ ఎన్నిక కోసం 50 మంది సభ్యులకు నోటీసులు అందించనున్నారు. ఆ తరువాత సమావేశం నిర్వహించి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

'పట్నం' చైర్‌పర్సన్‌పై కూడా..

అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసులు అందజేసిన కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాసం పెట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు సోమవారం కౌన్సిలర్లు నోటీసులిచ్చారు. గతేడాది కూడా మెజారిటీ కౌన్సిలర్లు నోటీసులు అందజేశారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ చైర్మన్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ఇబ్బందులు తలెత్తుతాయని అప్పటి ప్రభుత్వం అవిశ్వాసాల ప్రక్రియకు సహకరించలేదు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీజేపీకి 2, కాంగ్రెస్‌కు 6, బీఆర్‌ఎస్‌కు 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన స్రవంతిని చైర్‌పర్సన్‌గాఎన్నుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు గులాబీ గూటికి చేరగా, చైర్‌పర్సన్‌తోపాటు ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా 17మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసులిచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు

ఈ నెల 26 తర్వాత సీఎం రేవంత్ జిల్లాల పర్యటన

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు చొప్పున ఎమ్మెల్యేలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఐదు జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రేవంత్ సమావేశమయ్యారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలతోపాటు హైదరాబాద్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి బాధ్యతలు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అప్పగిస్తున్నట్టు రేవంత్ ప్రకటించారు. సంక్షేమం..అభివృద్ధిలో అందరూ భాగస్వాములేనని, తాను గత సీఎం తరహా కాదని తేల్చి చెప్పారు. జనవరి 26 తర్వాత వారానికి మూడురోజులు సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు సచివాలయంలో అందుబాటులో ఉంటానని చెప్పారు.

ఈ నెల 26 తర్వాత జిల్లాల పర్యటన

ఈ నెల 26 తర్వాత సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ఉంటుంది. తొలిసభ ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహిస్తారు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసభ ఇంద్రవెల్లిలో నిర్వహించగా, సీఎం హోదాలోనూ అక్కడ జరిగే తొలిసభలో రేవంత్ పాల్గొంటారు. ఇంద్రవెల్లిలో అమరుల స్మారక స్మృతివనానికి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ నేతలకు రేవంత్ సూచించారు. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను గుర్తించి ఆదుకుంటామన్నారు.

రెట్టింపు ఉత్సాహంతో పనిచేయండి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని, రెట్టి ఉత్సాహంతో పనిచేయాలని పార్టీ నేతలకు రేవంత్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సాధించిన ఓట్ల కంటే ఎక్కువ వచ్చేలా కృషి చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకుగాను 12 స్థానాలకు తగ్గకుండా గెలిపించుకోవాలన్నారు.

బీఆర్‌ఎస్ నేతలు బదనాం చేస్తున్నారు

నియోజకవర్గ సమస్యలతోపాటు పార్టీ బలోపేతానికి సీఎం పలు సూచనలు చేశారని మంత్రి సీతక్క వెల్లడించారు. ప్రభుత్వ పథకాల విధివిధానాలు తయారుకాక మునుపే బీఆర్‌ఎస్ నేతలు తమను బదనాం చేస్తున్నారన్నారు. అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేక ప్రభుత్వాన్ని కూల్చుతామని మాట్లాడుతున్నారని, ఐదేళ్ల వరకు ఎన్నికలు రావని బీఆర్‌ఎస్ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. ఓటమి పాలైన పార్టీ అభ్యర్థులకు ధైర్యం ఇచ్చేందుకే సీఎం సమావేశం ఏర్పాటు చేశారని మంత్రి కొండా సురేఖ అన్నారు. బీఆర్‌ఎస్ పాలన తట్టుకోలేక తమకు అధికారం ఇచ్చారని, వచ్చే టర్మ్‌లోనూ తామే అధికారంలోకి వస్తామని చెప్పారు.

సీఎంగా రేవంత్‌కు వంద మార్కులు : జగ్గారెడ్డి

సీఎంతో జరిగిన భేటీలో ఆరు గ్యారంటీల అమలుపై చర్చ జరిగిందని, నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల చొప్పున సీఎం ఇస్తారని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. మెదక్ పరిధిలోని రెండు స్థానాలు గెలుచుకోవాలని తమకు దిశానిర్దేశం చేశారన్నారు. అభ్యర్థుల ఎంపికపై చర్చ జరగలేదన్నారు. ఓటమి పాలైనా తాము పార్టీ తరపున ఎమ్మెల్యేలమని, సీఎంగా రేవంత్‌కు వంద మార్కులు వేస్తానన్నారు. సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు అంశం చర్చకు వచ్చిందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ తెలిపారు.

ఆరు గ్యారంటీలకు నిధులెలా తెస్తారు?

బీఆర్‌ఎస్ చేసిన 6 లక్షల కోట్ల అప్పులు ఎలా తీరుస్తారు: బండి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన రూ. 6 లక్షల కోట్ల అప్పును ఎలా తీరుస్తారో, ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎలా అమలు చేస్తారో, నిధులు ఎక్కడి నుంచి తెస్తారో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్రం అప్పుల పాలైందని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రచారం చేసిందని, ఎన్నికల్లో లబ్ధి కోసమే ఆరు గ్యారంటీలు ఇచ్చిందన్నారు. రాష్ట్రం అప్పుల పాలైందని తెలిసీ ఆరు గ్యారంటీలు ఎలా ఇచ్చారు? ఆ అప్పులు ఎలా తీరుస్తారో ప్రజలకు కాంగ్రెస్ వివరించి భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సంజయ్ మీడియాతో మాట్లాడుతూ, గతంలోని డ్రగ్స్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం వెలికి తీయాలని డిమాండ్ చేశారు. నయీం అక్రమ ఆస్తులు, వాటి డాక్యుమెంట్లు ఎక్కడ ఉన్నాయో కనిపెట్టాలని, ఈ కేసును తవ్వితే అన్ని పార్టీల నాయకుల బండారం బయటపడుతుందన్నారు. ఇందులో బీఆర్‌ఎస్ నేతల ప్రమేయమే ఎక్కువగా ఉందని ఆరోపించారు. గ్లోబరీనా సంస్థ తప్పిదాల వల్ల ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమా కాదా చెప్పాలన్నారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది బీజేపీ ఎంపీలు గెలిస్తే ఎక్కువ నిధులు వస్తాయని, తెలంగాణ సమాజం ఆలోచించి బీజేపీని గెలిపించాలని కోరారు. కాగా, తనకు ఈటలతో ఎలాంటి విభేదాలు లేవని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

అర్హుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడిస్తామన్నారు. ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికి అధికారులు వెళ్లి వివరాలు మరోసారి పరిశీలిస్తారని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అయితే, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత 40 రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని గతంలో తామెప్పుడూ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు సైతం ఎక్కడా ఆ తరహా వ్యాఖ్యలు చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చి మంగళవారానికి నెలరోజులు అవుతుందని, ఈలోపే ప్రతిపక్షాలు విమర్శలకు దిగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలరోజులు కూడా కాకముందే ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు నవ్వు తెప్పిస్తున్నాయన్నారు. విమర్శలు చేసే ముందు గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు గుర్తు తెచ్చుకోవాలన్నారు. గత ప్రభుత్వ తప్పులను ఆధారాలతో సహా ప్రజల ముందు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రతిపక్షాలు, మీడియా సైతం ఓపిక పట్టాలని కోరారు. డేటాఎంట్రీ పూర్తయిన తర్వాత మంత్రివర్గ ఉపసంఘంలో విధివిధానాలపై చర్చిస్తామన్నారు. వీటన్నింటిపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేయని అర్హులైనవారు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజాపాలన వెబ్‌సైట్ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

స్వేద పత్రాలు కాదు.. సౌధ పత్రాలు విడుదల చేయండి

రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేస్తే..బీఆర్ఎస్ నేతలు స్వేదపత్రాలతోపాటు తమ బంగళాలు, ఫామ్‌హౌస్‌ల వివరాలతో సౌధ పత్రాలు విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన బీఆర్‌ఎస్ నేతలు..ఉన్న వాస్తవం చెబితే ఉలికిపడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అద్దె వాహనాలకు సైతం డబ్బులు చెల్లించలేదని, ఇలా అనేక ప్రభుత్వ విభాగాల్లో కోట్ల రూపాయల అప్పులు ఉంచి రాష్ట్ర గౌరవాన్ని మంటగలిపారని చెప్పారు. ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు అప్పుడే విమర్శలకు దిగడంపై ప్రజల నుంచి సైతం వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. బీఆర్‌ఎస్ నేతలు నైతిక విలువలు వదిలేసి దుష్ప్రచారం చేసే స్థాయికి దిగజారారని విమర్శించారు. 32 మెడికల్ కాలేజీలకు బదులు 32 వాట్సాప్ యూనివర్సిటీలు పెట్టుకోవాల్సిందన్న మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం స్పందించారు. డిసెంబర్ 31 తమకు రాఖీ కట్టిన కరీంనగర్ సోదరిపై వాట్సాప్ యూనివర్సిటీలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకేనా వాట్సాప్ యూనివర్సిటీలు పెట్టాలనుకున్నది అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. చట్టాలకు లోబడి వ్యవహరించకపోతే కఠినచర్యలు తప్పవని, అసత్య ప్రచారాలు చేస్తే మాజీ మంత్రులు అని కూడా చూడకుండా చర్యలు తీసుకుంటామని పొన్నం హెచ్చరించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తే.. అసూయతోనే బీఆర్‌ఎస్ నాయకులు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు ఇంకా అధికార మైకం పోలేదని విమర్శించారు. ప్రగతిభవన్ ఇంకా తమదే అన్న భ్రమల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. సామాన్యులు సైతం ప్రగతిభవన్ లోపలకు వస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారన్నారు.

ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారు

కాంగ్రెస్‌పై ఎమ్మెల్యే పల్లా ధ్వజం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నేతలు అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేస్తుండగా, ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిన అభ్యర్థులు ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, తన కుటుంబ సభ్యులపై తీన్మార్ మల్లన్న అసత్య ప్రచారం చేస్తున్నారని, ఆయనపై పరువు నష్టం దావా వేస్తామని అన్నారు. తమ విద్యా సంస్థలకు వచ్చి తీన్మార్ మల్లన్న సోదరుడు, ఇంటెలిజెన్స్ అధికారులు బెదిరిస్తుండగా, జనగామలో తనపై ఓడిన అభ్యర్థి కూడా అదే రీతిలో వ్యవహరిస్తున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ నేతల బుద్ధి మారడం లేదు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీ నేతలు ప్రతిపక్షంలో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. శాసనమండలిని ఇరానీ కేఫ్ అని, ఎమ్మెల్సీలను రియల్ ఎస్టేట్ వ్యాపారులని సీఎం అగౌరవపరుస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యేలకు గన్‌మెన్‌లను తీసివేయడంతో పాటు సమయం ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యేల క్వార్టర్స్‌ను ఖాళీ చేయించారన్నారు. ఇంటెలిజెన్స్ అధికారులు తమ ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని, గోదావరి పరీవాహక ప్రాంత నేతలకు ప్రాణహాని ఉందని అన్నారు. తుంగతుర్తిలో బీఆర్‌ఎస్ కార్యకర్త సురేశ్ దంపతులపై దాడి, కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్త హత్య కాంగ్రెస్ అరాచకాలకు పరాకాష్టగా మారిందని మండిపడ్డారు.

'బిల్కిస్' కేసులో సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బిల్కిస్ బానో కేసులో సుప్రీం కోర్టు తీర్పును బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్వాగతించారు. ఆ తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారాన్ని దుర్వినియోగం చేసిన వారితో పాటు గుజరాత్ ప్రభుత్వంపై కఠిన చర్యలు ఉంటాయనే ఆశాభావాన్ని కేటీఆర్ వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చిన పార్టీలు.. తమ రాజకీయ అవసరాల కోసం అధికారాన్ని వినియోగించకూడదనే విషయాన్ని సుప్రీం తీర్పు గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత కూడా బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నట్లు 'ఎక్స్' ద్వారా స్పందించారు. మహిళల పట్ల నిబద్ధత విషయంలో సుప్రీంకోర్టు తీర్పు బలమైన సందేశాన్ని ఇస్తోందని, ఇలాంటి ప్రతి తీర్పు మహిళలకు అండగా నిలుస్తుందని తెలిపారు. బిల్కిస్ బానో దోషులను ముందస్తు విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు సరికాదని తాను గతంలో పేర్కొన్న విషయాన్ని కవిత గుర్తుచేశారు. ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ గతేడాది మేలో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తాను లేఖ రాసినట్లు కవిత వెల్లడించారు.

కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై నన్ను ఓడించాయి

- కేలండర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కాంగ్రెస్, బీజేపీ కలిసి తనను ఓడించాయని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. పదేళ్లు కష్టపడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే 10 రోజుల్లో వచ్చిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎలా గెలిచారో ప్రజలు ఆలోచించాలన్నారు. తనను ఓడించి గౌడ జాతి గొంతు నొక్కే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గీత, నేత, కులవృత్తుల కోసం తాను నిరంతరం పోరాటం చేస్తానన్నారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్‌తో కలసి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. వేల కోట్ల విలువైన భూములు కబ్జా చేశారని సామాజిక మాధ్యమాల్లో తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థలం, నిధులు కేటాయించిందని, ఆగస్టులో వచ్చే పాపన్నగౌడ్ జయంతి వరకు ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వంద రోజుల్లో పూర్తి చేయాలని, లేని పక్షంలో పోరాటంతోనే సాధించుకుంటామన్నారు. అంబాల నారాయణగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గౌడన్న సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్

▶ మొదటి పేజీ తరువాయి

పోలింగ్ బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకోవడంపై చర్చించినట్టు తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలను పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లుగా పెట్టామని, మరో రెండురోజుల్లో పార్లమెంట్ కన్వీనర్లను కూడా నియమిస్తామన్నారు. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా ఎన్‌టీపీసీ 800 మెగావాట్ల ప్లాంట్ ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపీగా ఉండగా రేవంత్ రెడ్డి సీబీఐ ఎంక్వైరీ కోసం ఎందుకు లేఖ రాశారు.. ఇప్పుడు సీఎం అయ్యాక ఎందుకు సీబీఐ విచారణకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. తాము సూటిగా లేవనెత్తిన ప్రశ్నలకు కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పలేక.. బీజేపీ–బీఆర్‌ఎస్ ఒకటేనని దుష్ప్రచారం చేస్తూ, వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. బీజేపీ దాడికి తట్టుకోలేక రాహుల్‌గాంధీ పారిపోయారన్నారు. అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14 నుంచి 22వ తేదీవరకు దేవాలయాల్లో స్వచ్ఛఅభియాన్ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రతి హిందువు పాల్గొనాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని 150 దేశాల్లో లైవ్‌గా చూపబోతున్నట్టు తెలిపారు. ఈ నెల 22న ప్రతీఇంటా రామజ్యోతులు వెలిగించాలని, రామాలయ ప్రారంభోత్సవంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల రాష్ట్రస్థాయి సమావేశంలో జాతీయ ప్రధానకార్యదర్శులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్, బండి సంజయ్, కార్యదర్శి అర్వింద్ మీనన్, పార్టీనేతలు డా.కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎంపీ అర్వింద్ ధర్మపురి, 8 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, మాజీ ఎంపీలు ఏపీ జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూరనర్సయ్యగౌడ్, చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్.రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శృతి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, కాసం వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

బీజేఎల్పీ నేత ఎంపికపై అభిప్రాయసేకరణ

బీజేపీ శాసనసభ పక్షనేత ఎంపికపై ఎమ్మెల్యేల అభిప్రాయాలను కిషన్‌రెడ్డి జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్‌చుగ్ తెలుసుకున్నారు. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వైపు మొగ్గు చూపినట్టు తెలిసింది. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని చేస్తే ఎలా ఉంటుందని తరుణ్ చుగ్ ప్రశ్నించగా పలువురు ఎమ్మెల్యేలు అందుకు సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. బీసీ నేతగా తనకు అవకాశం ఇవ్వాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరినట్టు సమాచారం. జాతీయఅధ్యక్షుడు జేపీ నడ్డాతో చర్చించాక శాసన సభా పక్షనేతను ప్రకటిస్తామని తరుణ్‌చుగ్ స్పష్టం చేసినట్టు తెలిసింది.

బీజేపీలో చేరికలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సినీస్టార్ అభినవ్ కేతావత్‌తోపాటు ఆయన అనుచరులు, హైదరాబాద్‌కు చెందిన ఆప్‌నేత డా.హరిచరణ్, ఇతర నాయకులు పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'దేశంలో బీజేపీకి సానుకూలమైన వాతావరణం ఉంది. మోదీకి పోటీ లేదు. మరోసారి మోదీ ప్రభుత్వం రావడం ఖాయం. దేశ ప్రజలంతా ఆయన మరోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్నారు. మోదీ నేతృత్వంలోనే దేశ అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు. గత పదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం మౌలిక వసతులు కల్పన అద్భుతంగా జరిగింది. మోదీ నూతన భారతాన్ని నిర్మించారు. దీంతో ప్రపంచంలో దేశఖ్యాతి పెరిగింది. ఉగ్రవాదాన్ని కట్టడి చేశారు. పేదలకు ఉచిత బియ్యం అందిస్తున్న ఘనత మోదీ ప్రభుత్వానిదే. కరోనాను కట్టడి చేసే వ్యాక్సిన్‌ను ప్రపంచానికి అందించారు. పొదుపు సంఘాలకు 20 లక్షలు రుణాలు అందించిన ఘనత మోదీ ప్రభుత్వానిదే'నని కిషన్‌రెడ్డి చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న బీజేపీ

17 ఎంపీ స్థానాలకు పొలిటికల్ ఇన్‌చార్జిల నియామకం



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడంలో భాగంగా...బీజేపీ రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలకు 'పొలిటికల్ ఇన్‌చార్జి'లను నియమించింది. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ ఉండగా వారందరినీ ఆయా ఎంపీ సీట్లకు ఇన్‌చార్జులుగా నియమించింది. యూపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్‌ను, ఇంకా మిగతా స్థానాలకు సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఒక మాజీ ఎంపీకి ఇన్‌చార్జిగా అవకాశం కల్పించింది. సోమవారం ఈ మేరకు కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియామకాలు చేసినట్టు రాష్ట్ర పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

ఎంపీ స్థానం	పొలిటికల్ ఇన్‌చార్జి
ఆదిలాబాద్	పాయల్ శంకర్
పెద్దపల్లి	రామారావు పవార్
కరీంనగర్	ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా
నిజామాబాద్	ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
జహీరాబాద్	కాటిపల్లి వెంకటరమణారెడ్డి
మెదక్	డా. పాల్వాయి హరీశ్‌బాబు
మల్కాజిగిరి	పైడి రాకేశ్‌రెడ్డి
సికింద్రాబాద్	డాక్టర్ కె.లక్ష్మణ్
హైదరాబాద్	టి.రాజాసింగ్
చేవెళ్ల	ఎ.వెంకటనారాయణరెడ్డి
మహబూబ్‌నగర్	ఎన్.రామచంద్రరావు
నాగర్‌కర్నూల్	మారం రంగారెడ్డి
నల్లగొండ	చింతల రామచంద్రారెడ్డి
భువనగిరి	ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్
వరంగల్	మర్రి శశిధర్‌రెడ్డి
మహబూబాబాద్	గరికపాటి మోహన్‌రావు
ఖమ్మం	పొంగులేటి సుధాకర్‌రెడ్డి

క్లుప్తంగా...



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

40 వేల టీచర్ పోస్టులు భర్తీచేయాలి: ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్ (హైదరాబాద్): మెగా డీఎస్సీలో 40 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ నిరు ద్యోగ సంఘం అధ్యక్షుడు నీల వెంకటేశ్, రాజేం దర్‌ల అధ్యక్షతన నిరుద్యోగుల సమావేశం జరి గింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై న కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆదేశాలిస్తుంటే కొందరు విద్యాశాఖ అధికారు లు 10 వేలు, 12 వేల ఖాళీలంటూ సాగదీస్తు న్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో 25 వేల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పీఆర్సీ కమి టీ రిపోర్టులో పేర్కొందని, మాజీ సీఎం కేసీ ఆర్ 13 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. 10 వేల మంది సెకండరీ టీచర్లకు ప్రమోషన్లు ఇస్తే ఆ పోస్టులు ఖాళీ అవుతాయన్నారు. 25 ఏళ్లుగా ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయట్లేదని కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమం లో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌వో పీడీగా లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్‌ఏ)లో సీఎంఆర్‌వో ప్రాజెక్టు డైరెక్టర్‌గా వి.లచ్చిరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. డిప్యూటీ కలెక్టర్ ర్యాంక్ అధికారి అయిన లచ్చిరెడ్డి ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్నారు. ఇప్పటివరకు సీఎంఆర్‌వో పీడీగా పనిచేసిన డి.శ్రీనివాస్‌రెడ్డిని రెవెన్యూ శాఖలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీచేశారు.

'తదుపరి ఆదేశాలిచ్చే వరకు మంచిరెడ్డి అరెస్టు వద్దు'

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఆదేశాల వరకు కిషన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలను అరెస్టు చేయవద్దని.. కానీ విచారణను కొనసాగించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణకు కిషన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి సహకరించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది. కులం పేరుతో దూషిస్తూ తనను మానసికంగా వేధించారని ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అమోయ్‌కుమార్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన కుమారుడు ప్రశాంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ మాజీ కమిషనర్ ఎండీ యూసుఫ్‌లపై గత నెలలో ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో తనను అరెస్టు చేయకుండా పోలీసులను ఆదేశించాలంటూ కిషన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఫిబ్రవరి 2 వరకు వారిని అరెస్టు చేయవద్దని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేశారు.

'ఈఎంసీ'లకు
రూ. 340 కోట్ల కేంద్ర సాయం

కామన్ ఫెసిలిటీల ఏర్పాటు కోసం గ్రాంటు ఇచ్చేందుకు అంగీకారం

- దివిటిపల్లి ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌లో రూ. 264.6 కోట్లు, టీవర్క్స్ క్లస్టర్‌కు రూ. 75 కోట్లకు ఓకే
- సమాచార హక్కు చట్టం కింద కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండు ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ల (ఈఎంసీ)లో కామన్ ఫెసిలిటీల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీవర్క్స్‌లో ఏర్పాటు చేసే క్లస్టర్‌కయ్యే వ్యయం రూ. 104.63 కోట్లుకాగా అందులో రూ. 75 కోట్లను గ్రాంట్-ఇన్-ఎయిడ్‌గా అందించనున్నట్లు వెల్లడించింది. ఈ క్లస్టర్‌కు ఈ నెల 4న కేంద్రం అనుమతి మంజూరు చేసింది. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి వద్ద ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కూడా కేంద్రం త్వరలో అనుమతిస్తుందని... క్లస్టర్ మంజూరు చేయాలని తాము సిఫారసు చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ప్రధాన సమాచార ప్రతినిధి స్పష్టం చేశారు. ఐటీఐఆర్, ఎలక్ట్రానిక్ క్లస్టర్ల ఏర్పాటుకు సంబంధించి సామాజిక కార్యకర్త ఇనగంటి రవికుమార్ ఆర్టీఐ కింద కోరిన సమాచారానికి స్పందనగా కేంద్రం ఈ వివరాలు ఇచ్చింది. దివిటిపల్లిలో రూ. 568.9 కోట్లతో ప్రతిపాదించిన ఈఎంసీకి రూ. 264.6 కోట్లను గ్రాంటుగా ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ రెండింటిని ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ 2.0 కింద మంజూరు చేసినట్లు పేర్కొంది.

ఐటీఐఆర్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తదుపరి ప్రతిపాదనలు పంపలేదు..

ఏపీ విభజన హామీగా తెలంగాణకు 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్)' ఏర్పాటు హామీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేసింది. అయితే ఐటీఐఆర్‌పై 2016లో సమావేశం జరిగిందని... ఆ తరువాత తెలంగాణ ప్రభుత్వం మరిన్ని వివరాలు ఇవ్వలేదని ఆర్టీఐ కింద ఇచ్చిన సమాచారంలో కేంద్రం స్పష్టం చేసింది. 2013 నవంబర్ 13న ఐటీఐఆర్ క్లస్టర్‌ను నోటిఫై చేశారని, ఈ క్లస్టర్‌లో రైల్వే, ఉపరితల రవాణా, కేంద్ర పట్టణ మంత్రిత్వ శాఖ చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి సవివర నివేదిక ఇవ్వాల్సి ఉందని, కానీ తదుపరి డీపీఆర్‌లు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఐటీఐఆర్‌పై 2016లో ఒకసారి, 2017లో మరోసారి సమావేశం జరిగినా తెలంగాణ ప్రభుత్వం నుంచి తదుపరి ఎలాంటి ప్రతిపాదనలు రాకపోవడంతో తాము ఆమోదించలేకపోయామని ఆ సమాధానంలో కేంద్రం స్పష్టం చేసింది. 2017లో ఐటీఐఆర్ పాలసీ, కేంద్ర పారిశ్రామిక అభివృద్ధి పాలసీపై సమీక్షించగా ఐటీఐఆర్‌లో ఉన్నవే కేంద్ర పారిశ్రామిక అభివృద్ధిలో ఉన్నందున ఐటీఐఆర్‌లను పక్కనపెట్టినట్లు కేంద్రం తెలిపింది. ఐటీఐఆర్ ఇవ్వకపోయినా దానికి ప్రత్యామ్నాయంగా ఇవ్వాలని కోరుతూ అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి నుంచి 2021 జనవరి 7న లేఖ అందిందని, అప్పటికే హైదరాబాద్, మహేశ్వరంలో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లకు అనుమతిచ్చామని తెలియజేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల శాఖ పేర్కొంది. ఐటీఐఆర్‌తో సంబంధం లేకుండా ఈఎంసీ 2.0 కింద తాజాగా రెండు క్లస్టర్లను మంజూరు చేశామని ఆర్టీఐ కింద కోరిన సమాచారానికి స్పందిస్తూ బదులిచ్చింది.

18లోగా బకాయిలు చెల్లించకపోతే కరెంట్ కట్

రాష్ట్రానికి ఎన్టీపీసీ అల్టిమేటం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం చెల్లించాల్సిన రూ.930 కోట్ల బకాయిలను ఈనెల 18 లోగా చెల్లించని పక్షంలో రాష్ట్రానికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ అల్టిమేటం జారీ చేసింది. ఈ నేపథ్యంలో గడువులోగా బకాయిలు చెల్లించేందుకు తెలంగాణ ట్రాన్స్ కో యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. బకాయిలు చెల్లించడంలో విఫలమైతే ఎన్టీపీసీ నుంచి రాష్ట్రానికి వస్తున్న విద్యుత్ సరఫరా ఈ నెల 18వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి నిలుపుదల కానుంది. ఉత్పత్తి కంపెనీల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కి సంబంధించిన బిల్లులను నిర్దేశిత గడువులోగా చెల్లించడంలో విఫలమైతే ఆయా రాష్ట్రాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయాలని రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం లేట్ పేమెంట్ సర్‌చార్జ్ రూల్స్‌ను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారమే రాష్ట్రానికి విద్యుత్ ఆపేస్తామని ఎన్టీపీసీ హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు తీవ్ర ఆర్థిక నష్టాల్లో ఉండడంతో విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు సకాలంలో బిల్లులు చెల్లించలేక చేతులెత్తేస్తున్నాయి.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ (సీడీవీఎల్) ద్వారా నిర్వహించే డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను కోరుతున్నారు. దరఖాస్తులను సమర్పించడానికి ఫిబ్రవరి 29 చివరి తేదీ. ఒక ఏడాది కాల పరిమితితో కూడిన కోర్సుల కోసం దరఖాస్తులను కోరుతున్నారు. ఈ కోర్సులకు యూజీసీ, ఏఐసీటీఈ, డీఈసీ జాయింట్ కమిటీతో ఆమోదించబడినవని అధికారులు పేర్కొన్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సైబర్ లాస్, ఫోరెన్సిక్ సైన్స్, లైబ్రేరీ ఆటోమేషన్ నెట్‌వర్కింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్, కమ్యూనిటీ ఐ హెల్త్, ఇతర నైపుణ్యాలతో గ్రాడ్యుయేట్‌ల ప్రయోజనం కోసం ఈ కోర్సులలో ఒక ఏడాది కాలపరిమితితో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఎన్ఐఆర్‌డీతో సంయుక్తంగా అప్‌గ్రేడేషన్ ప్రోగ్రామ్‌లు, ఐసీఏఆర్-ఎన్ఏఏఆర్ఎం, బీఎస్ఎన్ఎల్-ఆర్‌టీటీసీ, ట్రుత్‌ల్యాబ్స్, ఐఎఫ్‌సీఏఐ, ఎల్‌వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, టీమ్ లీజ్ ఎడ్‌టెక్ వంటి వాటితో కలిసి ఈ కోర్సులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పూర్తి సమయం కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా ఏకకాలంలో ఈ ప్రోగ్రామ్‌లలో చేరవచ్చు. ప్రవేశం పొందిన విద్యార్థులకు చక్కగా తయారుచేసిన స్టడీ మెటీరియల్ సాఫ్ట్ కాపీ ఇవ్వబడుతుంది. విద్యార్థికి వీడియో లెక్చర్‌లు, స్టడీ మెటీరియల్‌ని యాక్సెస్ చేయడానికి ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఉంటుంది. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. ప్రాస్పెక్టస్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 పూర్తి చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫీజు రసీదుతోపాటు హెచ్‌సీయూ గోల్డెన్ థ్రెషోల్డ్ భవనంలో నిర్వహించే సీడీవీఎల్ కార్యాలయం సెక్షన్ ఆఫీసర్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్‌కి పంపవచ్చు. మరిన్ని వివరాలకు 040-24600264, 040- 24600265, 91776 18205లో సంప్రదించాలి.

'గోదావరి-కావేరి' డీపీఆర్ ఫైనల్

నదుల అనుసంధానానికి ఛత్తీస్‌గఢ్ గ్రీన్‌సిగ్నల్

సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరి నదుల అనుసంధానంలో తాము వాడుకోని 148 టీఎంసీల నీటిని తరలించడానికి ఛత్తీస్‌గఢ్ అంగీకారం వ్యక్తం చేసింది. దీంతో గోదావరి- కావేరి అనుసంధానంలో కీలక అడుగులు పడినట్టు అయ్యింది. ఈ ప్రక్రియలో మరో పరిణామం కూడా చోటుచేసుకుంది. ఈ ప్రాజెక్టు ముసాయిదా డీపీఆర్‌ను ఫైనల్ చేస్తూ ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయం తీసుకుంది. ఇటీవలే ఈ డీపీఆర్‌ను హైదరాబాద్ విభాగం కేంద్రానికి పంపించగా, దానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ఎన్‌డబ్ల్యూడీఏ సమాచారం ఇచ్చింది. దీంతో త్వరలోనే ఆ డీపీఆర్‌ను రాష్ట్రాలకు పంపించనున్నారు. ఇక గోదావరి-కావేరి అనుసంధానంపై ఫిబ్రవరిలో సీఎంలతో సమావేశం పెట్టాలని ఎన్‌డబ్ల్యూడీఏ లాంఛనంగా నిర్ణయం తీసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఆధ్వర్యంలో సీఎంల సమావేశం ఉంటుందని జాతీయ నీటి అభివృద్ధి సంస్థ రాష్ట్రాలకు ఇదివరకే సమాచారం ఇచ్చిన విషయం విదితమే. ప్రాజెక్టు డీపీఆర్‌తోపాటు ఎంఓయూలను రాష్ట్రాలకు పంపించి, నెలాఖరులోగా ప్రభావిత రాష్ట్రాల నీటి/జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో జాతీయ నీటిఅభివృద్ధి సంస్థ సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలోనే ఆయా రాష్ట్రాల కార్యదర్శులు ఎంఓయూలపై సంతకాలు చేయకపోతే, ఫిబ్రవరిలో జరిగే సీఎంల సమావేశంలో సీఎంలకు పథకాన్ని వివరించి, వారి సంతకాలు తీసుకోనుంది. ఎంఓయూలపై సంతకాలు కాగానే, టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.74,326 కోట్లు. దీనిని ఐదేళ్లలోపు పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రూ.9,821.49 కోట్ల ఆదాయం ఏటా సమకూరనుందని లెక్కకట్టారు. ప్రాజెక్టులో భాగంగా ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపడతారు. మేడిగడ్డకు దిగువన ఇచ్చంపల్లి ప్రాజెక్టు ఉంది. బ్యారేజీ నిర్మాణానికి రూ.3,881 కోట్లు అవుతుందని లెక్క కట్టారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలుతో పాటు కల్లుగీత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని తాళ్లు ఎక్కే క్రమంలో ప్రమాదాలు జరిగి వందలాది మంది కాళ్లు, చేతులు, నడుము విరిగిపోయి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పథకాల రద్దుకు కాంగ్రెస్ కుట్ర

▶ మొదటి పేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో పనిచేయాలని చెప్పారు. కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ పనితీరులో మార్పులుచేర్పులు చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సరళి మేరకు బీఆర్ఎస్ మొదటి స్థానంలో ఉందన్నారు.

కార్యకర్తలను కలవకుండా అడ్డుపడ్డారు : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

అధిష్టానంతో కార్యకర్తలు కలవకుండా కొందరు నేతలు అడ్డుపడ్డారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ తాజా, మాజీ ఎమ్మెల్యేలను ఉద్దేశించి కవిత ఈ వ్యాఖ్యలు చేశారు. తాను స్వయంగా కార్యకర్తలను కలిసేందుకు వస్తే రకరకాల అడ్డంకులు సృష్టించారన్నారు. తెలంగాణ ఉద్యమంలో పార్టీ పనితీరు, ఓటమికి కారణాలపై నేతలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ సీటు గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు.

కాంగ్రెస్ గెలుపు కాదు.. బీఆర్ఎస్ ఓటమి : వేముల ప్రశాంత్‌రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని మరిచిపోయి పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెడదామని కార్యకర్తలు తమకు భరోసా ఇచ్చారని మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్‌ది గెలుపు కాదని, బీఆర్ఎస్ ఓటమి మాత్రమేనన్నారు. నిజామాబాద్ లోక్‌సభ సన్నాహక సమావేశం అనంతరం తెలంగాణభవన్‌లో ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రజాదర్బార్ ప్రహసనంగా మారిందని, సీఎం రేవంత్ నెలలో ఒక్కసారే పాల్గొన్నారన్నారు. ప్రజాదర్బార్ ద్వారా పరిష్కరించిన సమస్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 15 వేల చొప్పున ఇవ్వాలని ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై అక్కసుతో జిల్లాల సంఖ్య తగ్గించాలని రేవంత్ అనుకుంటున్నారన్నారు.

'బిల్కిస్' దోషులకు... శిక్ష తగ్గింపు చెల్లదు

▶ మొదటి పేజీ తరువాయి

ఆశ్రయించే అవకాశం దోషులకు ఉంది.

గుజరాత్ ప్రభుత్వానికి అధికారం లేదు

గుజరాత్‌లో 2002లో గోధ్రా రైలు దహనకాండ అనంతరం మత ఘర్షణలు చెలరేగడం తెలిసిందే. ఆ సందర్భంగా బిల్కిస్ బానో ఉదంతం చోటుచేసుకుంది. ఐదు నెలల గర్భిణి అయిన 21 ఏళ్ల బిల్కిస్‌పై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె మూడేళ్ల కూతురుతో పాటు కుటుంబానికి చెందిన ఏడుగురిని హత్య చేశారు. ఈ కేసులో 11 మందిని దోషులుగా సీబీఐ ప్రత్యేక కోర్టు ఖరారు చేసింది. వారికి జీవిత ఖైదు విధిస్తూ 2008లో తీర్పు వెలువరించింది. దీన్ని బాంబే హైకోర్టు కూడా సమర్థించింది. 15 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించాక తమను విడుదల చేయాలంటూ వారిలో ఒకరు 2022 మేలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీన్ని పరిశీలించాలన్న కోర్టు ఆదేశం మేరకు గుజరాత్ ప్రభుత్వం ఒక కమిటీ వేసింది. దాని సిఫార్సు ఆధారంగా మొత్తం 11 మందికీ రెమిషన్ మంజూరు చేయడంతో 2022 ఆగస్టు 15న వారంతా విడుదలయ్యారు. దీనిపై బిల్కిస్ తీవ్ర ఆవేదన వెలిబుచ్చింది. రాజకీయ పార్టీలతో పాటు అన్ని వర్గాలూ వారి విడుదలను తీవ్రంగా తప్పుబట్టాయి. గుజరాత్ ప్రభుత్వ చర్యపై దేశమంతటా నిరసనలు వ్యక్తమయ్యాయి. వారి విడుదలను సుప్రీంకోర్టులో బిల్కిస్‌తో పాటు పలువురు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. 11 రోజుల వాదనల అనంతరం 2023 అక్టోబర్ 12న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. రెమిషన్‌ను కొట్టేస్తూ తాజాగా తీర్పు వెలువరించింది. ఈ కేసులో విచారణ జరిగి దోషులకు శిక్ష పడింది మహారాష్ట్రలో గనుక వారికి రెమిషన్ ప్రసాదించే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. లేని అధికారాన్ని చేతుల్లోకి తీసుకుని శిక్ష తగ్గించిందంటూ తప్పుబట్టింది. రెమిషన్ నిర్ణయాన్ని కొట్టేసేందుకు ఈ ఒక్క ప్రాతిపదికే చాలని పేర్కొంది. ''2022లో సుప్రీంకోర్టుకు వెళ్లిన నిందితులు కేసులో వాస్తవాలను దాచి ధర్మాసనాన్ని తప్పుదోవ పట్టించి పునఃసమీక్షకు తీర్పును పొందారు. ఈ విషయంలో గుజరాత్ ప్రభుత్వం కూడా వారితో కుమ్మక్కైంది'' అంటూ ఆక్షేపించింది. ''రెమిషన్ కోసం దోషుల్లో ఒకరు 2019లోనే గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా మహారాష్ట్ర ప్రభుత్వం వద్దకు వెళ్లాల్సిందిగా సూచించింది. 2020లోనూ మరో పిటిషన్ పెట్టుకున్నా కొట్టేసింది. దాంతో దోషి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించినా లాభం లేకపోయింది. రెమిషన్ ఇవ్వొద్దంటూ సీబీఐతో పాటు సీబీఐ ప్రత్యేక జడ్జి కూడా సిఫార్సు చేశారు. ఈ వాస్తవాన్ని సుప్రీంకోర్టు ముందు దాచిపెట్టారు'' అంటూ మండిపడింది. రెమిషన్ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలంటూ బానో నేరుగా సుప్రీంకోర్టులో పిల్ వేయడం ఆర్టికల్ 32 ప్రకారం సబబేనని ధర్మాసనం స్పష్టం చేసింది. ''శిక్ష విధించాల్సింది ప్రతీకార దృష్టితో కాదు. నేరం పునరావృతం కాకుండా చూసేందుకు. దాంతోపాటు దోషుల్లో మార్పు తెచ్చేందుకు'' అన్న గ్రీకు తత్వవేత్త ప్లేటో సూక్తిని జస్టిస్ నాగరత్న ప్రస్తావించారు. శిక్ష తగ్గింపు నిర్ణయానికి కూడా దీన్ని వర్తింపజేయాల్సి ఉంటుందన్నారు. దోషుల హక్కులతో పాటు బాధితుల హక్కులనూ పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకోవడం తప్పనిసరని స్పష్టం చేశారు.

న్యాయం నెగ్గింది

''ఈ రోజే నాకు నిజమైన న్యూ ఇయర్. దోషులందరినీ మళ్లీ జైలుకు పంపడం ద్వారా సుప్రీంకోర్టు నాకు న్యాయం చేసింది. రెమిషన్‌పై వాళ్లు బయట గడిపిన ఈ ఏడాదిన్నర నాకు నరకంగా గడిచింది. కోర్టు తీర్పుతో కొండంత భారం తొలగినట్టుగా ఉంది. ఆనందంతో నా పిల్లలను హత్తుకున్నా. దేశంలో న్యాయం అందరికీ సమానమేనని మళ్లీ నిరూపించిన సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు. ఈ పోరాటంలో నా భర్త, పిల్లలు, మిత్రులతోపాటు దేశవ్యాప్తంగా వేలాది మంది సామాన్యులు, మహిళలు నాకు తోడుగా నిలిచారు. నాపై కోరలు సాచిన విద్వేషాన్ని తమ ప్రేమానురాగాలతో మరిపించారు. లాయర్ శోభా గుప్తా నాకోసం 20 ఏళ్లపాటు పట్టు వదలకుండా పోరాడింది. నాకు న్యాయం దక్కేలా చేసింది. వాళ్లందరికీ నా ధన్యవాదాలు''

– సుప్రీంకోర్టు తీర్పుపై బిల్కిస్ బానో



ముంబైలోని ఇంట్లో రోజువారీ పనుల్లో బిల్కిస్. దీనికి సంబంధించిన వీడియోను ఆమె కుటుంబ సభ్యుడొకరు సోమవారం విడుదల చేశారు.

తీర్పుపై స్పందనలు...

''బానో అవిశ్రాంత పోరాటం ఎట్టకేలకు ఫలించింది. అన్యాయంపై, బీజేపీ సర్కారు అహంకారంపై ఆమె సాధించిన విజయమిది. ఎన్నికల లబ్ధి కోసం నేరగాళ్లకు ఆశ్రయమిస్తున్నదెవరో, న్యాయానికి పాతరేస్తున్నదెవరో సుప్రీంకోర్టు తీర్పుతో మరోసారి తేటతెల్లమైంది''
– కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

''ఇది సాహసోపేతమైన తీర్పు. ఇందుకు సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు''
– తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ

''బానోకు కేంద్రం తక్షణం క్షమాపణలు చెప్పాలి''
– మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ

''మహిళలపై జరిగే అన్యాయాలను జాతి సహించబోదని ఈ తీర్పు నిరూపించింది''
– బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత



> నేను ఇవ్వాళ వ్యాకులతను తప్పించుకున్నాను.
> కాదు... దాన్ని పరిహరించాను. ఎందుకంటే అది నాలోనే ఉంది,
> నా భావనలో ఉంది – బయట కాదు!
>
> – మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 9 జనవరి 2024

అనుచిత వ్యాఖ్యల చిచ్చు

బాధ్యతా రహితమైన వ్యాఖ్యలు చేస్తే, ఫలితం భారంగానే ఉంటుంది. మాల్దీవులకు చెందిన ఒక ఎంపీ, ముగ్గురు మంత్రులకు బహుశా అది ఇప్పుడు అనుభవంలోకి వచ్చి ఉంటుంది. మాల్దీవుల ప్రభుత్వంలోని ముగ్గురు డిప్యూటీ మంత్రులు మరియమ్ షివునా, మల్షా షరీఫ్, మహజూమ్ మజీద్... భారత్‌కూ, భారత ప్రధానికీ వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్యలు చేసి, పదవి నుంచి సస్పెండయ్యారు. రెండు దేశాల మధ్య దౌత్య వివాదానికి దారి తీసిన ఆ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో బోలెడంత రచ్చ జరుగుతోంది. మాలే మంత్రుల వ్యాఖ్యలపై భారత ప్రముఖులు గట్టిగానే స్పందించారు. మాల్దీవ్స్ బహిష్కరణ నుంచి మన సొంత ద్వీపాల పర్యాటకాభివృద్ధి దాకా నినాదాలు జోరందుకున్నాయి. వ్యవహారం లక్షద్వీప్ వర్సెస్ మాల్దీవ్స్‌గా మారింది.

జరిగిన కథ గమనిస్తే – 'మీలోని సాహసికుడికి సరైన గమ్యస్థానం లక్షద్వీప్' అంటూ, అక్కడి సముద్రతీరంలోని తన ఫోటో జోడించి జనవరి 5న భారత ప్రధాని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ మీద మాల్దీవుల మంత్రులు, ఎంపీల అనుచిత వ్యాఖ్యలు ఇంత దూరం తెచ్చాయి. మంత్రి అబ్దుల్లా మాజిద్ ఇదంతా మాల్దీవుల నుంచి దృష్టి మరల్చి, లక్షద్వీప్‌ను మరో పర్యాటక కేంద్రంగా ప్రోత్సహించడానికేనని విమర్శించడంతో రాజకీయ వివాదం రేగింది. ఆయనలా అంటే, మరో మంత్రి మరియమ్ షియునా 'ఎక్స్'లో ఇజ్రాయెల్‌తో భారత సంబంధాలను ప్రస్తావించారు. ఆమెతో మరో మహిళా సహచర మంత్రి మాల్షా స్వరం కలిపారు. భారత పర్యాటక ప్రాంతాలు, గదులు దుర్వాసన వేస్తుంటాయన్న నోటి తీట మాటలూ వచ్చాయి. ఇవన్నీ చిచ్చు రేపేసరికి, చైనా పర్యటనలోని మాల్దీవుల అధ్యక్షుడు దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. మంత్రుల సస్పెన్షన్, వారి వ్యక్తిగత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని ప్రభుత్వ వివరణ చకచకా జరిగాయి.

భారత్‌లోని పర్యాటక ప్రాంతాల గురించి, ప్రధాని గురించి నోటికొచ్చినట్టు మాట్లాడడం మన వారికి కోపం తెప్పించింది. సెలవులకు మాల్దీవులకు వెళదామనుకున్న వేలాది భారతీయులు టికెట్లను రద్దు చేసుకుంటూ, సదరు స్క్రీన్‌షాట్లను 'ఎక్స్' వేదికగా పంచుకుంటున్నారు. అలాగే, దేశంలోనే ఉన్న అందమైన సముద్ర తీరాలు, ఆహ్లాదకరమైన దీవుల గురించి అన్వేషణ ఆరంభమైంది. ఈ వివాదం పుణ్యమా అని ఇంటర్నెట్‌లో లక్షద్వీప్ గురించి అన్వేషణ గత 20 ఏళ్ళలో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరింది. అయితే, గత ఏడాది లక్షద్వీప్‌కు 10 వేల మంది లోపే వెళితే, మాల్దీవులకు వెళ్ళిన పర్యాటకుల సంఖ్య లక్షల్లో ఉందని గమనించాలి. ఈ పరిస్థితుల్లో సెంటిమెంట్లు రేపి, ప్రస్తుత వివాదాన్ని ఆత్మాభిమాన, ఆత్మనిర్భర అంశంగా, లక్షద్వీప్ వర్సెస్ మాల్దీవ్స్‌గా చేస్తే అది వట్టి హ్రస్వదృష్టి. ఎర్ర సముద్రంలో నౌకలపై దాడులు నిత్యం సాగుతున్న వేళ, మాల్దీవ్స్‌తో మన దీర్ఘకాలిక బంధం దెబ్బతినకుండా చూడడం ముఖ్యం.

హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్‌కు కీలక పొరుగుదేశం మాల్దీవులు. 'ప్రాంతీయ భద్రత, పురోగతి' (సాగర్) లాంటి ప్రయత్నాల్లో ఆ దేశానిది ప్రధాన పాత్ర. అలాగే, 'పొరుగుకు పెద్ద పీట' లాంటి భారత ప్రభుత్వ ప్రాధాన్యాలకు మాల్దీవులు ఓ ప్రధాన కేంద్రం. అలాంటి మాల్దీవులతో ఇటీవల పొరపొచ్చాలు వచ్చాయి. భారత వ్యతిరేక అజెండాతో గెలిచి, గత 2023 నవంబర్‌లో మహమ్మద్ మొయిజు మాల్దీవ్స్‌కు అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ వెంటనే మాల్దీవుల ద్వీపబృందం నుంచి భారత సైన్యాన్ని ఉపసంహరించాల్సిందిగా కోరారు. భారత్ మాత్రం హిందూ మహాసముద్రంలోని సుదూర ద్వీపాలకు వైద్యసాయానికై తమ సైనికులు అక్కడున్నారంది.

తాజా వివాదాల వేళ మరో పొరుగు దేశం చైనా వైఖరి పక్క ఇల్లు తగలబడుతుంటే, చలి కాచుకుంటున్నట్టుంది. భారత్, మాల్దీవుల మధ్య రచ్చను అది ఆస్వాదిస్తోంది. మాల్దీవుల విదేశాంగ విధానం బాగుందనీ, ఆ దేశాధ్యక్షుడు భారత్‌తో సరైన రీతిలో వ్యవహరిస్తున్నారనీ చైనా మీడియా ప్రశంసిస్తోంది. అసలీ అంశంలో ఢిల్లీయే విశాల దృక్పథంతో ఉండాలంటూ బీజింగ్ సుద్దులు చెబుతోంది. ఇప్పటికే భారత్‌కు దక్షిణాన, పశ్చిమాన వివిధ దేశాల్లో చైనా పాగా వేసింది. హిందూ మహాసముద్రంలో కీలకమైన మాల్దీవుల్ని కూడా తన బుట్టలో వేసుకొనే పనిలో ఉంది. ఢిల్లీతో దీర్ఘకాలిక దౌత్యబంధమున్న మాలే సైతం క్రమంగా చైనా వైపు మొగ్గుతున్నట్టు కనిపిస్తోంది.

మరోపక్క మాలేలో పెరుగుతున్న ఇస్లామిక్ తీవ్రవాదం ఆందోళన రేపే అంశం. అత్యధికులు ముస్లిమ్‌లైన మాల్దీవుల నుంచి 600 – 700 మంది ఇస్లామిక్ తీవ్రవాద 'ఐసిస్'లో చేరారని లెక్క. ఈ పరిస్థితుల్లో మాల్దీవులు కేంద్రంగా వ్యూహాత్మక ప్రయోజనాలెన్నో ఉన్న భారత్ ఆచితూచి వ్యవహరించాలి. నెటిజన్ల 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' లాంటి వ్యాఖ్యలు వినడానికి బాగున్నా, భౌగోళిక అనివార్యతల రీత్యా కుదిరేపని కాదు. సంచలన ప్రకటనల కన్నా సవ్యమైన కార్యాచరణే మన పర్యాటకాభివృద్ధికి కీలకం. ఇందులో మన పాలకులు చేసింది తక్కువ, చేయాల్సిందే ఎక్కువ.

లక్షద్వీప్‌కు ప్రాముఖ్యం కల్పించాలని మోదీ సర్కార్ భావిస్తే తప్పు లేదు కానీ, ఆ చిరు కేంద్రపాలిత ప్రాంతంలో భారీ నిర్మాణాలతో జీవ్యావరణాన్ని దెబ్బ తీసే యత్నాలు మానాలి. మాల్దీవ్స్ ప్రజాస్వామ్యం బాట పట్టి అంతా కలిపి దశాబ్దిన్నరే అయింది. కొద్ది నెలల క్రితమే వచ్చిన కొత్త ప్రభుత్వం ఇంకా కుదురుకోనే లేదు. ఈ పరిస్థితుల్లో చేతి నిండా పని ఉన్న మాల్దీవ్స్ మంత్రులు భారత్ గురించి, భారత్‌లో భాగమైన లక్షద్వీప్ గురించి మాట్లాడాల్సిన పని లేదు. అది వారి పరిధి కూడా కాదు. తాగునీటి కొరత నుంచి ఇటీవలి కోవిడ్ నియంత్రణ దాకా పలు సందర్భాల్లో మానవతతో అండగా నిలిచిన భారతే తాము నమ్మదగిన, చిరకాల మిత్రుడని గ్రహించాలి.

కృత్రిమ మేధతో నవ ప్రపంచం?

విశ్లేషణ



ప్రభు రామ్

స్మార్ట్ ఫోన్ల రాకతోనే జనం వాస్తవ ప్రపంచానికి దూరమయ్యారని ఒక విమర్శ. అలాంటిది జనరేటివ్ ఏఐ మనదాకా వస్తే? అప్పుడు వర్చువల్ ప్రపంచంలో మరింత కూరుకుపోతామా? మన చాలా పనులను ఏఐ చేయడం మొదలుపెడితే, మన చేతికి బోలెడు సమయం చిక్కుతుంది. అప్పుడు మనం తోటలో తిరుగుతూనో, వ్యాయామం చేస్తూనో గడపవచ్చు. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గిపోతుంది. పిల్లల శక్తిసామర్థ్యాలకు తగ్గట్టుగా రోబోలు చదువులు చెబుతాయి. కానీ ఎప్పుడో మొదలైన డిజిటల్ విప్లవ ఫలాలు ఇప్పటికీ అందరికీ చేరనేలేదు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ వంటి అత్యాధునిక టెక్నాలజీ కేవలం కొందరికి మాత్రమే ప్రయోజనం కలిగించేదిగా మారుతుందా అన్నది ప్రశ్న!

ఒక సగటు భారతీయుడు ఏడాదికి 2,300 గంటల సమయం స్మార్ట్ ఫోన్ మీద గడిపేస్తున్నాడని ఒక అంచనా. 580 గంటలు ఓటీటీ(ఓవర్ ద టాప్) ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్‌ను వెతుక్కుని వాటిని చూసేందుకు ఉపయోగిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ దాదాపు ఇదే రకమైన ధోరణి కనిపిస్తోంది. సైబర్ మీడియా రీసెర్చ్ ద్వారా మేము జరిపిన అధ్యయనంలో ఈ పోకడలు వెల్లడయ్యాయి. కొన్నేళ్లుగా డిజిటల్ వినియోగదారుల తీరుతెన్నులను పరిశీలించేందుకు మేము ఈ సర్వేల్లాంటివి చేస్తున్నాం. స్మార్ట్ ఫోన్లు, టెక్నాలజీలతో మన జీవితాలు ఎంతగా పెనవేసుకుపోయాయో సూచిస్తాయి ఈ సర్వే విశేషాలు.

చేతిలో కావాల్సినంత సమయం

2024 అంటే ఈ ఏడాది ఇప్పటివరకూ చెప్పుకున్న అంశాలన్నింటిలోనూ విప్లవాత్మక మార్పులు వస్తే? జరగబోయేది ఇదే. అంతా జనరేటివ్ ఏఐ పుణ్యం! 2023లో కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్– ఏఐ), మరీ ముఖ్యంగా జనరేటివ్ ఏఐ అనేది ప్రపంచం మొత్తాన్ని ఒక్క కుదుపు కుదిపేసింది. అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేసింది. టెక్నాలజీ ధోరణులను నిత్యం పరిశీలించే విశ్లేషకుడిగా 2024లో ఈ ఏఐ విషయంలో ఏం జరగబోతోందన్నది నాకెంతో ఉత్సుకత రేకెత్తించే అంశం. అయితే ఒక్కటైతే నిజం. ఈ ఏడాది కృత్రిమ మేధ విస్తృత స్థాయికి చేరుతుందన్నది నా నమ్మకం.

జనరేటివ్ ఏఐ అనేది మన చిన్న చిన్న పనులను ఇట్టే చేసేస్తుంది. టెక్స్ట్ జనరేట్ చేయడం, చిత్రాలు, మోడల్స్‌ను సిద్ధం చేయడం వంటి చాలా పనులను ఆటోమేట్ చేయనుంది. భవిష్యత్తులో ఏం జరుగుతుందన్నది ఒకసారి చూస్తే... ఏఐ, జనరేటివ్ ఏఐ నైపుణ్యాలు కలిగిన వారు మిగిలిన వారికంటే మెరుగైన స్థితిలో ఉంటారు. దీనివల్ల 2024 లోనే కాదు... ఆపై కూడా మన చేతుల్లో బోలెడంత సమయం మిగిలిపోనుంది. ఈ మార్పు పుణ్యమా అని ఉత్పాదకత పెరుగుతుంది. కాసేపు ప్రకృతి ఒడిలో సేద తీరడం మొదలుకొని మన ఫిట్‌నెస్ గోల్స్‌ను సాధించుకునేందుకు ప్రయత్నించడం, లేదా తోటపని చేసుకోగలగడం ఎంత గొప్ప అనుభూతిని ఇస్తుందో ఆలోచించండి.



విద్యార్థుల నేస్తం

మనుషులు సర్వవ్యాప్తమైన ఏఐ, జనరేటివ్ ఏఐలతో కలిసి జీవించడం అలవాటు అవుతున్న తరుణంలో జనరేషన్ ఆల్ఫా పరిస్థితి ఏమిటి? 2010, ఆటుపై పుట్టినవాళ్లను జనరేషన్ ఆల్ఫా అంటున్నాం. వీరు కృత్రిమ మేధకు స్థానికుల కింద లెక్క. వీరికి ఏఐ అనేది మునుపటి తరానికి స్మార్ట్ ఫోన్‌మాదిరిగా మారి ఉంటుంది. మనతో మాట్లాడగలిగే ఆటబొమ్మలు ఇప్పుడు బోలెడు అందుబాటులోకి వచ్చేశాయి. భావోద్వేగాలను పలికించగల, ఏఐ భాగస్వామి అని పిలుస్తున్న తెలివైన రోబోలు పిల్లలకు వారి శక్తిసామర్థ్యాలకు తగ్గట్టు చదువులు చెప్పేందుకు సిద్ధమవుతున్నాయి. వారితోపాటు తాము ఎదిగేందుకు రోబోలు ప్రయత్నిస్తున్నాయి.

పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు జనరేటివ్ ఏఐ ఓ కొత్త ప్రపంచాన్ని వారి కళ్లముందు ఆవిష్కరించనుంది. భవిష్యత్తులో పిల్లల భుజాలపై పుస్తకాల సంచి బరువు ఉండకపోవచ్చు. ఇంటరాక్టివ్ సిములేషన్స్, అడాప్టివ్ టెక్స్ట్ బుక్స్, ఏఐ మెంటర్స్... విద్యార్థుల అవసరాలు, ఆశయాలకు అనుగుణంగా బోధించడం మొదలవుతుంది. ఇప్పటిమాదిరిగా బట్టీపట్టే విషయం గత చరిత్ర కానుంది. పిల్లలు గొలుసులన్నీ తెంచుకుని, పిచ్చి పోటీని వదిలించుకుని తమకు నచ్చిన అంశాన్ని చదవుకునే వీలు ఏర్పడుతుంది. ప్రతి దశలోనూ కృత్రిమ మేధ వారికి తోడుగా నిలుస్తుంది. కృత్రిమ మేధ ప్రపంచంలో ఉపాధ్యాయుల పాత్ర కూడా గణనీయంగా మారనుంది. సృజనాత్మకత, ఇష్టాయిష్టాలకు అనుగుణంగా విద్యార్థులు చేసే ప్రయత్నాలకు సహాయం అందించే వారిగా వీళ్ల మారిపోతారు. ఇలాంటి వాతావరణంలో పెరిగి పెద్దయిన పిల్లలు ఏఐ ఆధారిత టూల్స్, లాంగ్వేజ్ మోడళ్ల సాయంతో భాషా భేదాలను అధిగమిస్తారు.

అంతరాలు తగ్గేనా?

కృత్రిమ మేధ కచ్చితంగా ఓ అందమైన, సానుకూల భవిష్యత్తును చూపుతున్నప్పటికీ దీనికి ఇంకో కోణమూ ఉంది. ఇప్పటికే ఉన్న డిజిటల్ అంతరం మరింత పెరుగుతుందా? ఫలితంగా ఏఐ లాంటి అత్యాధునిక టెక్నాలజీ ఫలాలు కేవలం కొందరికి మాత్రమే పరిమితమవుతాయా అన్నది ఇంకో ప్రశ్న. ఎప్పుడో దశాబ్దాల క్రితం మొదలైన డిజిటల్ విప్లవ ఫలాలు ఇప్పటికీ అందరికీ చేరనేలేదు. డిజిటల్ డివైడ్ అని పిలుస్తున్న ఈ అంతరమే పూర్తిగా పూడని నేపథ్యంలో కృత్రిమ మేధ వంటి అత్యాధునిక టెక్నాలజీ కేవలం కొందరికి మాత్రమే ప్రయోజనం కలిగించేదిగా మారితే ఎలా అన్నది ఆందోళన కలిగించే అంశం.

ఇక మనుషుల మధ్య సంపర్కం ఇంతకుముందులానే ఉంటుందా? మానవ సంబంధాలు మునుపటి మాదిరిగానే కొనసాగుతాయా? ఈ నేపథ్యంలో కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా వాడుకోవడం చాలా అవసరమవుతుంది. ప్రైవసీ, వివక్ష, విశ్వసనీయత వంటి విషయాల్లోనూ ప్రశ్నలు మిగిలే ఉంటాయి. ఒక్కటైతే వాస్తవం. ప్రపంచగతిని మార్చేసే శక్తి ఏఐ సొంతం. సమర్థత అనేది అన్ని రంగాల్లోనూ పెరిగిపోయేందుకు ఇది కారణమవుతుంది. ఈ తరం పిల్లలు ఏఐ నేతృత్వంలోని ప్రపంచంలో ఎదుగుతారు. తమ చుట్టూ ఉన్న ప్రపంచంతో మరింత సృజనాత్మకంగా మసలుకునేందుకు వీరికి అవకాశాలు ఎక్కువ.

వ్యాసకర్త సైబర్ మీడియా రీసెర్చ్(సీఎంఆర్)లో ఇండస్ట్రీ ఇంటెలిజెన్స్ గ్రూప్ విభాగాధిపతి ('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

రెండూ కావాలంటే...



నియమబద్ధంగా ఉండే మనుషులు అరుదుగా కార్యసాధకులుగా ఉంటారు. కార్యసాధకులైనవాళ్లు అరుదుగా నియమబద్ధంగా ఉంటారు.

– నసీమ్ నికోలస్ తలెబ్, గణాంక శాస్త్రజ్ఞుడు

పాడు చేయడంలో...



నిజానికి మాల్దీవుల్లో గందరగోళం సృష్టించడానికి ఉన్న ఉత్తమ మార్గం, మరింత ఎక్కువ మంది భారతీయ యాత్రికులను అక్కడికి పంపడమే. చూడండి, మనం కలంగుట్, బాగా పట్టణాలకు ఏం చేశామో! (రెండూ గోవా తీర పట్టణాలు.)

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

మతలబేమిటి?



సిరియాలో ఐదు లక్షల మందిని చంపారు– నిశ్శబ్దం. యెమెన్‌లో 3,77,000 మందిని చంపారు– నిశ్శబ్దం. కాంగోలో 54 లక్షల మందిని చంపారు– నిశ్శబ్దం. సూడాన్‌లో ఐదు లక్షల మందిని చంపారు– నిశ్శబ్దం. ఇరాక్‌లో మూడు లక్షల మందిని చంపారు– నిశ్శబ్దం. గాజాలో 20,000 మందిని చంపారు– తీవ్ర నిరసనలు. ఎందుకలా?

– లుయీ అహ్మద్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

మద్దతు పార్టీకా? ప్రదేశానికా?



మఢ్ ఐలండ్ (మహారాష్ట్ర)లో దిగిన తమ హనీమూన్ ఫొటోలను పోస్ట్ చేసే నటుడికి తర్వాతి జాతీయ అవార్డు పక్కా. (మాల్దీవులకు వ్యతిరేకంగా, లక్షద్వీప్‌కు మద్దతుగా సెలబ్రిటీల పోస్టుల నేపథ్యంలో).

– వీర్ దాస్, కమెడియన్

దెబ్బ పడింది!



రాజస్థాన్‌లోని శ్రీకరణ్‌పూర్ ఉప ఎన్నికలో ఇప్పటికే మంత్రి వర్గంలో చేర్చుకున్న బీజేపీ అభ్యర్థి (సురేంద్ర సింగ్) మీద కాంగ్రెస్ అభ్యర్థి (రుపీందర్ సింగ్ కున్నర్) గెలవడం అనేది రానున్న మార్పులకు సంకేతం. తమ అభిప్రాయానికి విలువ ఇవ్వకపోతే ఓటర్లకు నచ్చదు. కానీ అహంకార అధికార పక్షానికి ఇది అర్థమవుతుందా?

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

మొదట్లోనే ఇలా ఉంటే...



లక్షద్వీప్‌లో దిగిన ఫొటోలను ప్రధాన మంత్రి మోదీ పోస్ట్ చేస్తారు... మాల్దీవుల పేరే ఆయన ఎత్తరు... ఇంటర్నెట్‌లో దాని రిఫరెన్స్ వస్తుంది... మాల్దీవుల మంత్రులు తమ విచక్షణ కోల్పోయి వ్యాఖ్యలు చేస్తారు... మూడు రోజుల ట్విట్టర్ యుద్ధం అనంతరం, ఆ ముగ్గురు మంత్రులు సస్పెండ్ అవుతారు. చాలామంది భారతీయులు మాల్దీవులకు చేసుకున్న ప్రయాణాలను రద్దు చేసుకుంటారు. 2024 సంతృప్త దశ మరీ త్వరగా వచ్చేసినట్టుంది.

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

సమయం లేదు టీచర్



ఉత్సాహకర క్షణం. చాలా ఏళ్ల కింద, వైజాగ్‌లో జరిగిన ఒక ఉపాధ్యాయ సదస్సు కోసం ఎన్ని పత్ర సమర్పణలను అంగీకరించారంటే – కేవలం సారాంశం చెప్పి వెళ్లిపోవాలని వక్తలను మళ్లీ మళ్లీ కోరుతూనే ఉన్నాడు ఛైర్మన్. కొంత సేపటికి ఇది కూడా పనిచేయకపోవడంతో, దయచేసి మీ సారాంశాన్ని క్లుప్తంగా చెప్పి పోవాలని కోరాడు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

సారాంశం

సరికొండ చలపతి

ఆశ.. నిరాశ... ఊగిసలాట...



డిసెంబర్ 31, 2023.
అర్ధరాత్రి 11. 55 నిమిషాలు.
ఎప్పటిలాగే నడుచుకుంటూ వెళుతున్నాడు.. ఆ మలుపు తిరిగితే ఇల్లు.

ఆ మూలనే ఓ గుడి. కొద్ది సేపట్లో కొత్త సంవత్సరం. ప్రతి సంవత్సరం లాగే గుడి ముందు ఆగి ..''వచ్చే సంవత్సరమైనా బాగా కలిసొచ్చేలా చూడు స్వామీ..'' అని మనసులో అనుకుంటూ గుడివైపు ఓ లుక్కేసుకుంటూ వెళుతున్నాడు. మనసులో ఓ మూల డౌటనుమానమే.. ప్రతిసారీ డిసెంబర్ నైట్ తనిలా దేవుణ్ణి రిక్వెస్ట్ చేయడం.. అది అలా మూలన పడిపోవడం.. ప్రతి సంవత్సరం ఎప్పటిలాగా మామూలుగా నడవడం... అదే ఇల్లు, అదే ఉద్యోగం, అదే జీతం.. అదే జీవితం..'' ఈ సారైనా రిక్వెస్ట్‌ను దేవుడు ఖాతరు చేస్తాడా..'' ..''ఏమో! కొత్త గవర్నమెంట్ ఇలా గ్యారంటీలు ఆఫర్ చేస్తే అలా కోటికిపైగా దరఖాస్తులు వచ్చాయట.. ఈ లెక్కన దేవుడి దగ్గర ఎన్ని అర్జీలుండాలి..'' తన ఆలోచనకు తనకే నవ్వొచ్చింది.. వెంటనే నిరాశ వచ్చింది.

అప్పుడు సమయం.. సరిగ్గా 12 గంటలు.. కొత్త సంవత్సరంలోకి ఎంట్రీ... మరోసారి గాట్టిగా నిట్టూర్చి... గుడి దాటుతుండగా ఓ సాధువు ఎదురొచ్చాడు.
''ఏం నాయనా.. ఏదో నిరాశ కనిపిస్తోంది?''
''ప్రతి సంవత్సరం ఇలాగే ఉంది స్వామీ... ఏం మార్పూలేదు.''
వెంటనే ఆ సాధువు జాలిపడి తన చూపుడువేలు పక్కనే ఉన్న రాయికేసి చూపాడు.
ఆ రాయి బంగారంగా మారిపోయింది.
'' సంతోషమే కదా .. అది తీసుకెళ్లు..''
అవాక్కయిన మిడిల్‌క్లాస్ ఫెలో.. చటుక్కున తేరుకుని
''అదొక రాయేకదా...'' – అన్నాడు. మన వాడి తత్వం అంచనా వేసిన వాడి మళ్లీ పక్కనే ఉన్న చెట్టును చూపుడు వేలుతో బంగారు చెట్టుగా మార్చి ''ఓకేనా..''– అని అడిగాడు.
''కేవలం చెట్టే కదా...''
ఆ పక్కనే ఉన్న మనవాడి ఇల్లువైపు చూపుడు వేలును నిలిపాడు
అది బంగారు ఇల్లుగా మారిపోయింది.
''ఇది చాలా...'' సాధువు అడిగాడు.
''అది ఇల్లే కదా...'' అని మనవాడు నసిగాడు.
''ఈ కొత్త సంవత్సరమైనా నిన్ను సంతోష పెడదామనుకున్నా... నీకు ఇంకేం కావాలి నాయనా?''
''నీ చూపుడు వేలు స్వామి..''– మన మిడిల్ క్లాస్ మనిషి రిక్వెస్ట్.
''దేవుడు మీ రిక్వెస్ట్‌లను ఎందుకు రిసీవ్ చేసుకోవడంలేదో అర్థం అయ్యింది నాయనా...'' అంటూ భయంతో సాధువు చటుక్కున మాయమయ్యాడు.
.. ఇదో కొత్త సంవత్సరపు సరదా కథ.

....

అయితే.. 2023, 2024 లాంటివి కాల గమనంలో అంకెలే అని తెలిసినా ఎలా ఆశలు పెట్టుకుంటారు.. తమ బతుకు ఎలా మారాలని ఆశిస్తారనేది ఆసక్తికరమే. పైన సరదాగా చెప్పుకున్నంత 'హెవీ'గా కాకపోయినా సాధారణ మనిషికి కొత్త సంవత్సరం 2024 ఏమైనా ఇవ్వకపోతుందా అని ఆశ.. ఏం ఇస్తుందిలే అనే నిరాశా ఉన్నాయట... మార్కెట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ సేవల సంస్థ ఇప్సోస్ తాజాగా నిర్వహించిన అధ్యయనం ఈ సంగతి తేల్చింది.
34 దేశాల్లో విస్తృతస్థాయిలో ఈ అధ్యయనం చేసినట్టు ఇప్సోస్ తెలిపింది.

2024.. ఓ ఆశ

సర్వేలో పాల్గొన్నవారిలో 70 శాతం మంది 2023 కన్నా 2024 ఎంతో బాగుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఏడాది చేసిన సర్వే (65%) కంటే ఇది ఐదుశాతం ఎక్కువ. ఇటీవలి వరకు ఆర్థిక సంక్షోభం దిశగా పయనించిన యూరోపియన్ దేశాల్లో ఈ 'ఆశ' మరింత ఎక్కువగా కనిపించింది.

- 2024లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని సగటున 50 శాతం మంది పేర్కొంటే.. ఇండియా, చైనా, ఇండోనేషియా వంటి దేశాల వారిలో 80 శాతం మందికిపైగా సానుకూలంగా స్పందించారు.

2023.. ఓ నిరాశ

సర్వేలో పాల్గొన్నవారిలో 2023పై నిరాశే కనిపించింది. గత ఏడాది తమకు అంతగా ఏమీ కలసి రాలేదని 53 శాతం మంది, తమ దేశానికీ ఏమీ లాభం లేదని 70 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు.

'ఆశ'ల దేశాలు..

- 2023తో పోలిస్తే 2024 ఏడాది బాగుంటుందని ప్రపంచవ్యాప్తంగా సగటున 70 శాతం మంది ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆసియా, దక్షిణ అమెరికా ఖండాల్లోని అభివృద్ధి చెందుతున్న దేశాల వారు ఎక్కువ సానుకూలంగా ఉంటే.. అభివృద్ధి చెందిన దేశాల వారిలో నిరాశ ఎక్కువగా కనిపించింది.
- భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందన్న నమ్మకం ఎక్కువగా కనిపించింది ఇండోనేషియా వారిలోనే. ఆ దేశానికి చెందినవారిలో 91 శాతం ఆశాభావంతో ఉన్నారు.
- ఇండియా, మెక్సికో, చైనాలలో 87 శాతం మంది మంచి భవిష్యత్తుపై నమ్మకం పెట్టుకున్నారు. ఫిలిప్పీన్స్ (86%), పెరూ (83%), చిలీ, దక్షిణాఫ్రికా, కొలంబియా (79%), బ్రెజిల్ (78%), థాయిలాండ్ (77%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- వచ్చే ఏడాదిపై పెద్దగా ఆశలు లేని దేశం జపాన్. అక్కడి వారిలో 39 శాతం మంది మాత్రమే భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్నారు. మిగతా 61 శాతం మంది నిరాశగానే స్పందించారు. ఫ్రాన్స్ (54%), బెల్జియం (48%), దక్షిణ కొరియా (53%), జర్మనీ (57%), టర్కీ, ఇటలీ (59%) తక్కువ ఆశాభావమున్న లిస్టులో ఉన్నాయి.

కొలువుల కలవరం

సర్వే చేసిన అన్ని దేశాల్లోనూ వచ్చే ఏడాది ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగాలు, వాతావరణం వంటి అంశాలపై పెద్దగా ఆశలేమీ పెట్టుకోని పరిస్థితి కనిపించింది.

- 2023తో పోలిస్తే 2024లో తమ దేశంలో ప్రజల ఆదాయం కంటే ధరలు ఎక్కువగా పెరగవచ్చని 79 శాతం అభిప్రాయపడ్డారు. రుణాలపై వడ్డీ రేట్లు పెరగొచ్చని 70 శాతం, నిరుద్యోగం పెరగవచ్చని 68 శాతం పేర్కొన్నారు.
- 2024లో కృత్రిమ మేధ (ఏఐ) వల్ల అదనంగా వచ్చే ఉద్యోగాల కంటే.. దానివల్ల మరింత ఎక్కువ ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని 64 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు.

ఇండియా, చైనా వంటి దేశాలు ఏఐతో ప్రయోజనం ఉంటుందంటే.. అమెరికా, యూకే వంటి చోట నష్టమేనని అభిప్రాయపడ్డారు.

- సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గిస్తామని 41 శాతం మంది చెప్పారు.

యుద్ధం.. మహమ్మారి

- కరోనా తరహాలో 2024లో మరో కొత్త మహమ్మారి వచ్చే ప్రమాదం ఉందని 48 శాతం, ఆ చాన్సే లేదని 34 శాతం, ఏమీ చెప్పలేమని 18 శాతం మంది పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధం ఈ ఏడాది ముగియకపోవచ్చని 47 శాతం మంది చెప్పారు.

వాతావ'రణం'!

- 2023తో పోలిస్తే వచ్చే ఏడాది పర్యావరణ మార్పులు మరింత పెరగవచ్చని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు.
- ప్రకృతి విపత్తులు మరింత పెరుగుతాయని 71 శాతం, ఉష్ణోగ్రతలు మండిపోతాయని 81 శాతం మంది చెప్పారు. పెట్రోల్, డీజిల్ వాహనాలపై నియంత్రణ పెరగవచ్చని 55 శాతం మంది అంచనా వేశారు.

అ'సహనం'

మీ దేశంలో ఒకరి పట్ల మరొకరు సహనంతో వ్యవహరించే అవకాశం పెరుగుతుందా? అని సర్వేలో ప్రశ్నించగా.. 56 శాతం మంది 'సహనం పెరిగే చాన్సే లేదు' అని అభిప్రాయపడ్డారు. ఏమో చెప్పలేమని 9 శాతం మంది పేర్కొంటే.. సహనం పెరుగుతుందన్నవారు 35 శాతమే.

....

పేదవాడు ఎవరంటే...

ఉన్నంతలో తృప్తిగా బతికేవారు బహు తక్కువ. మరీ ముఖ్యంగా రాజులైతే రాజ్య విస్తరణ చేసుకుంటూ పోయి సామ్రాజ్యాధిపతులు కావాలని కోరుకుంటారు. ఈ క్రమంలో లక్షలాది జనం, సైనికులూ యుద్ధంలో మరణించడమో, ఇక్కట్ల పాలు కావడమో జరుగుతుంది. అటువంటి వారికి జ్ఞానోదయం కలిగించిన కథ ఇది.

విక్రమ వర్మ అనే రాజు ఎప్పుడూ ఏదో ఒక దేశం మీద దాడి చేయడం, వారిని లొంగ దీసుకోవడం పనిగా పెట్టుకున్నాడు. ఎప్పటిలాగే అతను పొరుగు రాజ్యం మీద దండయాత్రకు బయలుదేరాడు. అడవిలో ఓ మునివర్యుని చూశాడు. ఎముకలు కొరికే చలిలో కేవలం నడుముకు పంచె మాత్రమే చుట్టుకుని ధ్యానం చేస్తున్నాడు. 'అయ్యో ఈ ముని చలినెలా తట్టుకుంటాడో' అని తన దగ్గరున్న శాలువ కప్పాడు రాజు.



జ్యోతిర్మయం

దాంతో కళ్ళు తెరచిన ముని 'ఎవరు నువ్వు?' అని ప్రశ్నించాడు. 'స్వామీ, నేను ఈ రాజ్యాన్ని పాలించే రాజుని. పొరుగు దేశంపై దండయాత్రకు బయలుదేరాను. విజయం సాధించడానికి మీ దగ్గర ఆశీస్సులు పొందుదామని మీ చెంత నిల్చున్నాను' అన్నాడు. 'సరే, నాకు కప్పిన ఈ శాలువను తీసుకుపో. నేను ఇప్పటికే ధనికుడిని. నాకున్న ఆస్తితోపాటు ఈ శాలువ భారాన్ని మోయడానికి సిద్ధంగా లేను' అన్నాడు ముని.

అంతట రాజు, 'స్వామీ, మీరలా అనకండి. మీరు మునులు. మీకన్నీ తెలుసు. నా దగ్గర అనేక శాలువలు ఉన్నాయి. వాటిలో ఒకటే నేను మీకిచ్చాను. ఇది స్వీకరించడానికి మీరెందుకు తిరస్కరిస్తున్నారు? మీరు అడగలేదు. నా అంతట నేనే మీకిది కప్పాను' అన్నాడు రాజు.

రాజు మాటలన్నీ విన్న ముని, 'పుత్రా, నీ దగ్గర ఇప్పటికే ఓ దేశం ఉంది. అది చాలదంటూ మరొక దేశంపై యుద్ధానికి పోతున్నావు. అలాగే నీ దగ్గర అనేక శాలువలు ఉన్నప్పటికీ నీకు మరో శాలువ అవసరం ఉంది. అవసరాలున్నవాడే పేదవాడు నా దృష్టిలో. అతనికే అనేక వస్తువులు కావాల్సి ఉంటుం' దన్నాడు.

ముని మాట రాజుకి చెంప దెబ్బలా అనిపించింది. దాంతో మనసు మార్చుకున్న రాజు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.8.46 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.8.04 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** తె.3.52 నుండి 5.22 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.35 వరకు, తదుపరి రా.10.51 నుండి 11.39 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.07 నుండి 12.43 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.37, **సూర్యాస్తమయం:** 5.37.

క్లుప్తంగా...

టీఎస్ఎంసీ నూతన కార్యవర్గం ప్రమాణం



సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) నూతన కార్యవర్గం కొలువుదీరింది. తెలంగాణ వైద్య విద్యా సంచాలకురాలు త్రివేణి, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.నాగేందర్, టీఎస్ఎంసీ సభ్యుడు సిద్దిపేట రమేశ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో ప్రస్తుత చైర్మన్ రాజలింగం ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడేళ్లుగా వైద్యుల సమ స్యల పరిష్కారం కోసం పోరాడిన హెచ్ ఆర్‌డీఏ ప్యానెల్ సభ్యులందరినీ గెలిపించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మహేశ్‌కుమార్, ప్రతిభాలక్ష్మి, రాజ్‌కుమార్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, ఆనంద్, రవికుమార్, నరేశ్‌కుమార్, శ్రీకాంత్, సన్ని, విష్ణు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

'సివిల్ సూట్ దాఖలు చేసుకోండి'

సాక్షి, న్యూఢిల్లీ: శంషాబాద్‌లోని వివాదాస్పద భూములకు సంబంధించి సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సుప్రీంకోర్టు పిటిషనర్‌కు స్పష్టం చేసింది. శంషాబాద్‌లో 181 ఎకరాల వివాదాస్పద భూములు హెచ్ఎండీఏకే చెందుతాయని ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ వట్టేపల్లికి చెందిన యహియా ఖురేషి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, హెచ్ఎండీఏ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రాలు వాదనలు వినిపించారు. కాగా, హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోబోమని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో పిటిషనర్‌కు సివిల్ సూట్ దాఖలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని రోహత్గి కోరారు. ఈ మేరకు స్పందించిన ధర్మాసనం పిటిషనర్ తగిన ఉపశమనం కోసం సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది.

రాష్ట్రంలో 4.67 మెట్రిక్ టన్నుల యూరియా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 4.67 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. 81 వేల మెట్రిక్ టన్నులకు పైగా డీఏపీ అందుబాటులో ఉందన్నారు. ఈ మేరకు సోమవారం ఇక్కడ మంత్రి యూరియా నిల్వలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కమిషనర్ గోపి తదితరులు పాల్గొన్నారు. మొత్తం అన్నిరకాల ఎరువులు కలిపి తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. వచ్చే సీజన్లో కూడా ఎటువంటి కొరత లేకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

'బీఆర్ఎస్ హయాంలో వ్యవస్థలు నిర్వీర్యం'

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు నేరెళ్ల శారద ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆమె మాట్లాడుతూ అధికారంలో ఉన్న పదేళ్లలో తెలంగాణ ప్రజలకి ఏం చేశారని ఇప్పుడు తెలంగాణవాదం గుర్తుకొచ్చింది అని ప్రశ్నించారు.

'పాలమూరు-రంగారెడ్డి'కి కేంద్రం మెలిక

రెండో దశ పర్యావరణ అనుమతికి ప్రత్యేక కమిటీ

సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులపై కేంద్రం మెలికపెట్టింది. ప్రాజెక్టుకు రెండో దశ పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని గతంలోనే కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ పరిధిలోని నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) సిఫారసు చేసింది. అయితే ఈ అనుమతి రావాలంటే మరిన్ని ప్రతిబంధకాలు దాటాల్సిన పరిస్థితి. గతంలో ప్రాజెక్టుపై ఎన్‌జీటీ విధించిన జరిమానాకు సంబంధించిన నిధుల వినియోగానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తూ, ఆ కమిటీ నివేదిక అనంతరమే రెండోదశ పర్యావరణ అనుమతి ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇక ఈ ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల కేంద్రమంత్రిని కోరగా.. డీపీఆర్‌కు సీడబ్ల్యూసీ ఆమోదం తెలిపితే జాతీయ హోదాను పరిశీలిస్తామని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఇక గత ఆగస్టు10వ తేదీన ఈఏసీ రెండోదశ పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సిఫారసు చేయగా, కేంద్రం వద్దే ఫైలు పెండింగ్‌లో ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టు పనులు చేపడుతూ పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పలువురు ఎన్‌జీటీని ఆశ్రయించగా, ఏడుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఆ బృందం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న పలు రిజర్వాయర్లను సందర్శించి పర్యావరణ ఉల్లంఘనల వల్ల మొత్తంగా రూ.3.7కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని ఆ కమిటీ అంచనా వేసింది. అయితే పర్యావరణానికి వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసేందుకు ఎన్‌జీటీ మరో ఏక సభ్య కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇప్పటి వరకూ తన నివేదికను సమర్పించలేదు. ఈ క్రమంలో డిండి ఎత్తిపోతలకు రూ.320 కోట్లు, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.600 కోట్లు కలిపి రూ.920కోట్ల జరిమానా విధించింది. ఎన్‌జీటీ విధించిన జరిమానా నిధుల వినియోగానికి సంబంధించి కేంద్రం ప్రత్యేక కమిటీని నియమించింది. ప్రాజెక్టు వల్ల ఎక్కడెక్కడ నష్టం వాటిల్లింది..? జరిమానా నిధులను ఎక్కడెక్కడ ఎంత ఖర్చు చేయాలనే దానిపై నివేదించాలని ఆ కమిటీ మార్గదర్శకాలను జారీ చేసినట్టు సమాచారం. ఆ నివేదిక అనంతరమే రెండో దశ పర్యావరణ అనుమతి పాలమూరు–రంగారెడ్డికి వస్తాయి. అంతే కాకుండా పర్యావరణ ఉల్లంఘనలకు బాధ్యులు ఎవరు? ఎవరిపై ఏం చర్యలు తీసుకున్నారు అనే దానిపై కాలుష్య నియంత్రణ మండలిని కూడా నిలదీస్తూ కేంద్రం లేఖ రాసింది. దీంతో రెండోదశ పర్యావరణ అనుమతుల ప్రక్రియ మరింత జటిలమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కృష్ణా బోర్డు నియంత్రణలోకి నాగార్జునసాగర్

▶ మొదటి పేజీ తరువాయి


అందుకు ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు సాగర్ డ్యామ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఆర్పీఎఫ్‌కు అప్పగించారు. సాగర్ కుడి కాలువ నుంచి 5 టీఎంసీల నీటిని ఏపీకి విడుదల చేయడానికి అనుమతిస్తూ ఈనెల 5న కృష్ణాబోర్డు వాటర్ రిలీజ్ ఆర్డర్ ఇచ్చింది. ఇప్పటికే ఏపీ 1.07 టీఎంసీలను సొంతంగా తరలించుకుంది. మిగిలిన నీళ్లను సైతం ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ విడుదల చేసుకునేందుకు ప్రయత్నించగా, సాగర్ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్న సీఆర్పీఎఫ్ బలగాలు అడ్డుకున్నట్టు సమాచారం.

కృష్ణాబోర్డు చైర్మన్‌కు తెలంగాణ ఫిర్యాదు

మరోవైపు ఏపీ ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ సోమవారం తెలంగాణ ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్, నాగార్జునసాగర్ చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్‌లిద్దరూ కృష్ణాబోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ కలిసి ఫిర్యాదు చేశారు. పునర్విభజన చట్ట ప్రకారం నీటిని విడుదల చేసే అధికారం తమకే ఉందని, ఒకవేళ కుదరకపోతే కృష్ణాబోర్డు మాత్రమే నీటిని విడుదల చేయాలని మురళీధర్ స్పష్టం చేశారు. ఏపీ నీటిని విడుదల చేస్తే... ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. దాంతో హుటాహుటిన కృష్ణాబోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్..బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రఘునాథ్, శివశంకరయ్యలను సాగర్‌కు పంపించారు. ఇండెంట్ ప్రకారం ఏపీకి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు.

నేడు ప్రత్యేక సమావేశం

నాగార్జునసాగర్ డ్యామ్ పరిస్థితిపై చర్చించడానికి వీలుగా ఈనెల 9వ (మంగళవారం) తేదీన కృష్ణాబోర్డు తెలుగు రాష్ట్రాల అధికారులతో సమావేశం కానుంది. వివాదాల్లేకుండా బోర్డు చేతుల్లోకి సాగర్, శ్రీశైలం డ్యామ్‌లు అందించాలని బోర్డు కోరే అవకాశం ఉంది. నీటి వాటాలు తేలకుండా ఏ విధంగా ప్రాజెక్టులు అప్పగిస్తామని తెలంగాణ వాదించే వీలుంది.



నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి విడుదలవుతున్న నీరు

5వేల క్యూసెక్కుల నీటి విడుదల

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువ వద్ద సోమవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ మురళీధర్‌రెడ్డి, కృష్ణానది యాజమాన్య బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్ గుప్తా పూజలు నిర్వహించి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు తాగునీటి అవసరాల నిమిత్తం 5టీఎంసీల నీటిని విడుదల చేస్తామని, రోజుకు 5వేల క్యూసెక్కుల చొప్పున 11 రోజుల పాటు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు సీఈ మురళీధర్‌రెడ్డి చెప్పారు. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 522.80 అడుగులు ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.5050 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 154.4310 టీఎంసీల నీరు ఉంది.

ఎఫ్‌సీఐకి బియ్యం పంపిణీని వేగవంతం చేయండి..

▶ మొదటి పేజీ తరువాయి

రూ.3,000 కోట్ల వార్షిక వడ్డీ భారం పడుతోందన్నారు.

బియ్యం సరఫరాలో జాప్యంతో రాష్ట్ర కేటాయింపులపై ప్రభావం

సకాలంలో బియ్యం పంపిణీ చేయకుండా మిల్లర్లు పెద్దఎత్తున నిల్వలు ఉంచుకోవడం వల్ల లాభం లేదని ఉత్తమ్ కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరాలో జాప్యం వల్ల భవిష్యత్తులో తెలంగాణకు కేటాయింపులపై తీవ్ర పరిణామాలు వస్తాయని మంత్రి హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక, పౌర సరఫరాల కార్పొరేషన్ భవిష్యత్తు కోసం బియ్యం పంపిణీకి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్లు, అధికారులను కోరారు. పీడీఎస్ బియ్యం నాణ్యత లోపించడంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పీడీఎస్ బియ్యాన్ని పాలిష్‌చేసి రీసైక్లింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక్కో బియ్యం బస్తాకు 45 కిలోల కంటే తక్కువ బియ్యం అందుతున్నట్లు రేషన్ షాపు యజమానుల నుంచి వచ్చిన ఫిర్యాదును కూడా మంత్రి ప్రస్తావించారు. కొందరి నిర్లక్ష్యం వల్ల రేషన్‌షాపుల యజమానులు ఎందుకు నష్టపోవాలని, దీనిపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఆ కలెక్టర్లపై చర్యలు తీసుకుంటాం: సీఎస్

సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఎఫ్‌సీఐకి పంపిణీ చేయాల్సిన బియ్యం లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైతే జిల్లా కలెక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డాటా ఎంట్రీని ఆధార్, రేషన్ కార్డుల్లోని సమాచారం ఆధారంగా నమోదు చేయడంలో జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.

మేడారంలో తాత్కాలిక ఆస్పత్రి

- 50 పడకలతో వైద్యసేవలు, 72 మెడికల్ క్యాంపుల ఏర్పాటు
- చర్యలు తీసుకోవాలని అధికారులకు వైద్యారోగ్యశాఖ మంత్రి ఆదేశం
- ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన దామోదర



సాక్షి, హైదరాబాద్: సమ్మక్క, సారక్క జాతరకు వచ్చే భక్తులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు మేడారంలో తాత్కాలికంగా 50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారు లను ఆదేశించారు. జాతరలో ఆరోగ్యశాఖ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సచివాలయంలో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, డీఎంఈ త్రివేణి, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ జాతర ప్రారంభం కావడానికి రెండువారాల ముందు నుంచే వైద్యశిబిరాలు, ఆస్పత్రిని ప్రారంభించాలని ఆదేశించారు. భక్తులకు వైద్య సదుపాయలు కల్పించడంలో ఎలాంటి లోటు రాకుండా చూడాలన్నారు. మేడారంలోని ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆరు పడకలు, స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు.

జాతరకు వెళ్లే మార్గాల్లో 42 మెడికల్ క్యాంపులు

మేడారం జాతర పరిసరాల్లో 30, జాతరకు వెళ్లే మార్గాల్లో మరో 42 వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర అధికారులకు సూచించారు. ప్రతి క్యాంపులో డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, అవసరమైన మందులు, ఎమర్జెన్సీ మెడికల్ కిట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. 20 మొబైల్ మెడికల్ యూనిట్లు, 15 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 15 బైక్ అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుకుని పేషెంట్లను వీలైనంత త్వరగా మెడికల్ క్యాంపులు లేదా సమీపంలోని హాస్పిటళ్లకు తరలించే ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

కేంద్రం విధానాలపై దేశవ్యాప్త ఆందోళనలు

- సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత వెల్లడించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. హేమలత మాట్లాడుతూ కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆందోళన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 10 నుంచి 20 వరకు ఇంటింటి ప్రచారం, 19న అన్ని జిల్లా కేంద్రాల్లో కార్మిక, కర్షక ఐక్యత సదస్సులు, 26న అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్లు, వాహనాల ద్వారా ర్యాలీ నిర్వహించాలని తీర్మానించినట్లు ఆమె వెల్లడించారు. వ్యవసాయ కార్మికుల సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ఐఎఫ్ఎస్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖలో స్పెషల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి ఎస్వీ ప్రదీప్‌కుమార్ శెట్టిని హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్‌గా బదిలీ చేశా రు. అక్కడ పని చేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి డా.బి. ప్రభాకర్‌ను అరణ్యభవన్‌లోని పీసీసీఎఫ్ కార్యాల యంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.

కుక్కల దాడిలో గాయపడిన బాలుడు మృతి

- నిజామాబాద్ జిల్లాలో ఘటన



తీవ్రగాయాలైన హర్షవర్ధన్ (ఫైల్)

మాక్లూర్: కుక్కలదాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ బాలుడు మృతిచెందాడు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కల్లేడి గ్రామానికి చెందిన బండారి మధు, రజని దంపతులకు హర్షవర్ధన్ (5), మరో మూడేళ్ల బాలుడు సంతానం. హర్షవర్ధన్ స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. డిసెంబర్ 25న తన తాతతో కలిసి పొలానికి వెళ్లగా మేకల కాపరుల పెంపుడు కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసి గాయపర్చాయి. వెంటనే తల్లిదండ్రులు నిజామాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి వ్యాక్సిన్లు వేయించారు. ఇంకా మూడురోజులకు ఒకసారి చొప్పున మరికొన్ని వ్యాక్సిన్లు వేయించాల్సి ఉంది. ఈ క్రమంలోనే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తల్లిదండ్రులు ఆదివారం ఉదయం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో హర్షవర్ధన్ మృతిచెందాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడి మృతి గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది.

ఫైళ్లు తగులబెట్టనున్నారంటూ..

ఇరిగేషన్ కార్యాలయం వద్ద పోలీస్ పికెట్



జనగామ: నీటి పారుదల శాఖ కార్యాలయంలోని ప్రాజెక్టులు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులను తగలబెడతారనే సమాచారంతో సోమవారం రాత్రి జనగామ పోలీసులు అలర్ట్ అయ్యారు. ప్రభుత్వం, రాష్ట్ర పోలీస్‌శాఖ ఈ మేరకు ఆదేశించిందని పేర్కొంటూ.. జిల్లా కేంద్రంలోని నీటి పారుదల శాఖ కార్యాలయానికి వెళ్లి తనిఖీలు చేశారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఉదయం వరకు ప్రతీ రెండు గంటలకొకసారి ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని కార్యాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం వచ్చినట్లు చెబుతున్నారు.

మద్యం షాపు తొలగించడం లేదని

ఆత్మహత్యాయత్నం

- ప్రజావాణికి వచ్చి పెట్రోల్ పోసుకున్న వ్యాపారి
- అడ్డుకున్న ఇతర అర్జీదారులు.. కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఘటన



వంటిపై పెట్రోల్ పోసుకుంటున్న అశోక్

కరీంనగర్ అర్బన్: తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ఓ వస్త్ర వ్యాపారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. పక్కన ఉన్నవారు అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. కరీంనగర్‌లోని గాంధీరోడ్డులో మద్యం దుకాణం వద్దని గతంలోనే వస్త్ర వ్యాపారుల వెల్ఫేర్ సంఘం నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మహనీయుని పేరుతో ఏర్పాటైన ఆ ప్రాంతంలో మద్యం అమ్మకాలు ఉండొద్దని, వైన్‌షాపును రద్దు చేయాలని కోరారు. అయినా వైన్స్ షాపును ఏర్పాటు చేయడంతో మళ్లీ వారు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. డిసెంబర్ 11న ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వైన్‌షాపు యజమాని తమను బెదిరిస్తున్నారని ప్రజావాణిలో వాపోయారు. ఆ ప్రాంతంలోనే 70 వస్త్ర దుకాణాలు, 30 ఇతర దుకాణాలున్నాయని, వైన్ షాపు కారణంగా యువతులతో పాటు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇదిలా ఉండగా అర్జీ ఇచ్చి తిరిగి వెళ్లే క్రమంలో అశోక్‌అనే వస్త్ర వ్యాపారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన ఇతర అర్జీదారులు ఆయనను అడ్డుకుని పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వైన్‌షాపు వద్దని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోరా అంటూ ఆయన రోదించారు. అశోక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సెల్‌ఫోన్ పేలి.. పొట్ట ఛిద్రమై

- క్వారీలో పని చేసే కార్మికుడికి తీవ్రగాయాలు

తూప్రాన్: ప్రమాదవశాత్తు సెల్‌ఫోన్ పేలి క్వారీలో పని చేస్తున్న ఓ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మెదక్ జిల్లా తూప్రాన్‌లో చోటు చేసుకుంది. తూప్రాన్ మండలం ఘన్‌పూర్ గ్రామ సమీపంలో ఉన్న శివం శంకరం కంకర మిషన్ (క్రషర్)లో మహారాష్ట్రకు చెందిన సుమన్ కార్మికుడిగా పని చేస్తున్నారు. సోమవారం రాత్రి పని ముగించుకుని సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ పెట్టుకొని తోటి కార్మికులతో గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే చేతిలోని సెల్‌ఫోన్ పేలి పొట్ట ఛిద్రమైంది. కడుపులోని పేగులు బయటకు వచ్చాయి. గమనించిన తోటి కార్మికులు సుమన్‌ను తొలుత స్థానిక ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని, ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపారు. ఈ ఘటనపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

మార్కెట్‌లోకి ఎల్జీ 'మసాలా'

- మసాలా ఉత్పత్తి రంగంలోకి 'లాల్జీ గోధూ అండ్ కో' సంస్థ
- చైర్‌పర్సన్ హీనా మర్చంట్, పార్ట్‌నర్ రిద్ధి మర్చంట్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఇంగువ ఉత్పత్తి రంగంలో ప్రసిద్ధి చెందిన లాల్జీ గోధూ అండ్ కో (ఎల్‌జీ) సంస్థ తాజాగా మసాలా ఉత్పత్తి రంగంలోకి అడుగుపెట్టింది. ఇప్పటికే సంస్థ వంట దినుసులైన పసుపు, కొత్తిమీర, ఎర్ర మిరపకాయ, జీలకర్ర, కశ్మీరీ కారం ఉత్పత్తులు మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకురాగా, సోమవారం హైదరాబాద్ గోల్కొండ హోటల్‌లో జరిగిన డిస్ట్రిబ్యూటర్ల మీట్‌లో స్వచ్ఛమైన ఇంగువ మిళితమైన సాంబార్ పొడి, రసంపొడి, చికెన్, మటన్, బిర్యానీ, గరమ్ మసాలా ఉత్పత్తుల ప్యాకెట్‌లను ఆ సంస్థ చైర్‌పర్సన్ హీనా మర్చంట్, పార్ట్‌నర్ రిధి మర్చంట్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దాదాపు 129 ఏళ్లుగా స్వచ్ఛమైన ఇంగువ ఉత్పత్తులను అందిస్తూ వినియోగదారుల ఆదరాభిమానాలు, నమ్మకాన్ని చూరగొన్న ఎల్‌జీ హింగ్ కుటుంబం నుంచి ఆరవ తరం స్వచ్ఛమైన ఐదు దినుసుల పొడులు, ఆరు ఇంగువ మిశ్రమ సుగంధాల ఉత్పత్తులను మార్కెట్‌లో అందుబాటులో తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కనీస ధర రూ.10 లకు కూడా ఎల్జీ ప్యాకెట్‌లను అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా వారు 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. ఎలాంటి రసాయనాల ప్రభావం లేకుండా స్వచ్ఛమైన ఆర్గానిక్ ఉత్పతులను అందించడమే తమ లక్ష్యమన్నారు. కాగా, మార్కెట్‌లో లాల్జీ గోధూ అండ్ కో(ఎల్‌జీ) బ్రాండ్ పేరిట నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సంస్థ హీనా మర్చంట్, రిధి మర్చంట్ హెచ్చరించారు. అలాగే ఎల్జీ సంస్థ ఉత్పత్తులకు సంబంధించిన యాప్‌ను కూడా అందుబాటులో తీసుకొస్తున్నామని, యాప్‌లో కోడ్ స్కాన్ చేసి అసలు, నకిలీ ఉత్పత్తులను కూడా గుర్తించవచ్చన్నారు. యాప్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా నేరుగా కొనుగోలు చేసే వినియోగదారులకు డిస్కౌంట్ సైతం వర్తిస్తుందని వెల్లడించారు.

జెండా పాట ధర రూ.20 వేలు.. అమ్మేందుకు వెళ్తే రూ. 14 వేలే



మొగిలిచర్ల ప్రధాన రహదారిపై బైఠాయించిన మిర్చి రైతులు

- ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి కొనుగోలు ధరలో భారీ వ్యత్యాసం
- రైతుల ధర్నా... రోడ్డుపై బైఠాయింపు

సాక్షి, వరంగల్/ వరంగల్: వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోలు ధరల విషయంలో భారీ తేడాలుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెండా పాటలో అత్యధిక ధర నిర్ణయించి.. అనంతరం క్వింటాల్‌కు సుమారు రూ.8 వేలు తగ్గించడంతో వారు ఆందోళనకు దిగారు. సోమవారం మార్కెట్‌లోని మిర్చియార్డుకు సుమారు 12 వేల బస్తాల మిర్చి వచ్చింది. రోజుమాదిరిగానే ధరల నిర్ణయం కోసం జెండాపాట నిర్వహించగా తేజ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.20,100లు ధర పలికింది. ధరలు నిర్ణయం కావడంతో యార్డుల్లో ఉన్న మిర్చి వద్దకు వచ్చిన ట్రేడర్‌లు అదే రకం మిర్చికి క్వింటాల్‌కు రూ.14–17వేలు, తక్కువ నాణ్యత ఉన్న మిర్చికి రూ.12–13వేలు చెల్లిస్తామని చెప్పడంతో గొడవ మొదలైంది. జెండా పాటకు.. చెల్లించే ధరకు తేడా ఉందని రైతులు అడ్తిదారులను ఆశ్రయించారు. అడ్తిదారులు ఏం చేయలేమని చేతులెత్తేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మార్కెట్ ముందు ప్రధాన రహదారిపై బైఠాయించారు. కమీషన్, కొనుగోలుదారులు కుమ్మక్కైనా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. అనంతరం వారు రహదారిపై ధర్నా చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో ఏనుమాముల పోలీసులు వచ్చి సర్దిచెప్పినప్పటికీ రైతులు దిగిరాలేదు. చివరకు మార్కెట్ అధికారులు, పోలీసులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం.. వారు రైతులతో చర్చించేందుకు సిద్ధం కావడంతో ధర్నా విరమించారు. నాణ్యతను బట్టి అంతకు ముందు కంటే ఎక్కువ ధరలను ట్రేడర్స్ నుంచి ఇప్పించడంతో కథ సుఖాంతమైంది.

'ఒరిజినల్ ఆధార్' తప్పనిసరి..

▶ మొదటి పేజీ తరువాయి

అందువల్ల ఆ కార్డును ప్రామాణికంగా తీసుకోవడం సాధ్యం కాదని చెప్పారు. ఒరిజినల్ గుర్తింపు కార్డులు చూపించాలని పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా..ఇప్పటికీ కొంతమంది స్మార్ట్ ఫోన్‌లో ఫొటో కాపీలు, కలర్ జీరాక్స్ చూపిస్తున్నారన్న విషయం ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి వచ్చిందన్నారు. దీనివల్ల సిబ్బంది ఇబ్బందులకు గురవడంతో పాటు ప్రయాణ సమయం కూడా పెరుగుతోందన్నారు. ఫలితంగా ఇతర ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వ్యాఖ్యానించారు. మహిళా ప్రయాణికులందరూ ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించి జీరో టికెట్ తీసుకోవాలని కోరారు. ఒరిజినల్ గుర్తింపు కార్డు లేకుంటే కచ్చితంగా డబ్బు చెల్లించి టికెట్ తీసుకోవాలని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకం తెలంగాణ ప్రాంత మహిళలకే వర్తిస్తుందని, ఇతర రాష్ట్రాల మహిళలు చార్జీ చెల్లించి విధిగా టికెట్ తీసుకుని సహకరించాలని సజ్జనార్ తెలిపారు.

వాదనలకు దిగొద్దు...

'ఎలాగూ ఉచితమే కదా. జీరో టికెట్ ఎందుకు తీసుకోవడం'అని కొందరు సిబ్బందితో వాదనకు దిగుతున్నారని ఇది సరికాదని ఆయన తెలిపారు. జీరో టికెట్ల జారీ ఆధారంగానే ఆ డబ్బును ఆర్టీసీకి ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుందని చెప్పారు. జీరో టికెట్ లేకుండా ప్రయాణిస్తే.. సంస్థకు నష్టం చేసిన వారవుతారని వివరించారు. అందువల్ల ప్రతి మహిళ జీరోటికెట్ తీసుకోవాలని. ఒకవేళ టికెట్ తీసుకోకుండా ప్రయాణిస్తే.. అది చెకింగ్‌లో గుర్తిస్తే సిబ్బంది ఉద్యోగం ప్రమాదంలో పడుతుందన్నారు. అలాగే సదరు మహిళ నుంచి రూ.500 జరిమానా వసూలు చేస్తారని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ విధిగా టికెట్ తీసుకుని సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిషిద్ధ కాంతి చిక్కింది

కనువిందు చేస్తున్న సుదూర గెలాక్సీ • తొలిసారి బంధించిన హబుల్ టెలిస్కోప్



ఇప్పటిదాకా వినడమే తప్ప కంటికి కనబడని విశ్వపు సుదూరాల్లోని నిషిద్ధ కాంతి ఎట్టకేలకు చిక్కింది. దాన్ని హబుల్ టెలిస్కోప్ తాజాగా తన కెమెరాలో బంధించింది. భూమికి ఏకంగా 27.5 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో హైడ్రా నక్షత్ర రాశిలో ఉన్న ఎన్‌సీజీ-01-24-014 స్పైరల్ గెలాక్సీ నుంచి వెలువడుతున్న ఈ కాంతి తరంగాలను ఒడిసిపట్టింది. వాటికి సంబంధించి అబ్బురపరిచే ఫొటోలను భూమికి పంపింది. టెలిస్కోప్ తాలూకు అడ్వాన్స్‌డ్ కెమెరా ఫర్ సర్వేస్ (ఏసీఎస్) ఈ ఘనత సాధించింది. అత్యంత స్పష్టతతో ఉన్న ఫొటోలు చూసి నాసా సైంటిస్టులతో పాటు అంతా సంభ్రమాశ్చర్యాలకు లోనవుతున్నారు. ఈ కిరణాల వెలుగులో కనువిందు చేస్తున్న ఎన్‌సీజీ గెలాక్సీ అందాలకు ఫిదా అవుతున్నారు. కాస్మిక్ ఫొటోగ్రఫీ చరిత్రలోనే దీన్ని అత్యంత అరుదైన ఫీట్‌గా అభివర్ణిస్తున్నారు.

హబుల్ ఫొటోల్లో కన్పిస్తున్న ఎన్‌సీజీ గెలాక్సీ పూర్తిస్థాయిలో వికసించిన నిర్మాణం, అత్యంత శక్తిమంతమైన కేంద్రకంతో కనువిందు చేస్తోంది. ఇది అత్యంత చురుకైన కేంద్రకాలున్న టైప్-2 సీఫెర్ట్ గెలాక్సీల జాబితాలోకి వస్తుందని నాసా పేర్కొంది. సీఫెర్ట్ గెలాక్సీలు అంతరిక్షంలో మనకు అత్యంత దూరంలో ఉండే అతి ప్రకాశవంతమైన నక్షత్ర మాలికలైన క్వాసార్‌ల సమీపంలో ఉంటాయి. అయితే క్వాసార్లు తామున్న గెలాక్సీలను బయటికి ఏమాత్రమూ కన్పించనీయనంతటి ప్రకాశంతో వెలిగిపోతుంటాయి. సీఫెర్ట్ గెలాక్సీలు మాత్రం వీక్షణకు అనువుగానే ఉంటాయి. కానీ అత్యంత సుదూరంలో ఉన్న కారణంగా వీటి వెలుతురు ఇప్పటిదాకా మనిషి కంటికి చిక్కలేదు. ఆ కారణంగానే సైంటిస్టుల పరిభాషలో దాన్ని 'నిషిద్ధ కాంతి'గా ముద్దుగా పిలుచుకుంటూ వస్తున్నారు. పైగా ఈ కాంతి పుంజాలు భూమ్మీద మనకు ఇప్పటిదాకా తెలిసిన పరిమాణ భౌతిక శాస్త్ర నియమాలకు పూర్తిగా అతీతమన్నది సైంటిస్టుల నమ్మకం. అనంత విశ్వంలో అంతటి సుదూర అంతరిక్ష క్షేత్రంలో మన భౌతిక శాస్త్ర నియమాలన్నీ తల్లకిందులవుతాయని వారు చెబుతుంటారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

బంగ్లాదేశ్ ఎన్నికల్లో 'అవామీ' విజయం

- 300 పార్లమెంట్ స్థానాలకు 223 స్థానాలు కైవసం
- 62 నియోజకవర్గాల్లో నెగ్గిన స్వతంత్ర అభ్యర్థులు
- వరుసగా నాలుగోసారి ప్రధానమంత్రిగా షేక్ హసీనా



ఢాకా: బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో అధికార అవామీ లీగ్ మరోసారి ఘన విజయం సాధించింది. మొత్తం 300 పార్లమెంట్ స్థానాలకు గాను 299 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించగా, అవామీ లీగ్ ఏకంగా 223 స్థానాలు సొంతం చేసుకుంది. ఎన్నికలు ఆదివారం జరగ్గా, సోమవారం ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. తుది ఫలితాలు వెలువడ్డాయి. పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్షమైన జతియా పార్టీ 11 సీట్లు గెలుచుకుంది. బంగ్లాదేశ్ కల్యాణ్ పార్టీ కేవలం ఒక స్థానంలో గెలుపొందింది. 62 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. అలాగే జతియా సమాజ్ తాంత్రిక్ దళ్, వర్కర్స్ పార్టీ ఆఫ్ బంగ్లాదేశ్ ఒక్కో స్థానం చొప్పున గెలుచుకున్నాయి. అవామీ లీగ్ అధినేత, ప్రధానమంత్రి షేక్ హసీనా గోపాల్‌గంజ్-3 నియోజకవర్గం నుంచి అఖండ విజయం సాధించారు. బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు ఆమె ఎన్నిక కావడం ఇది ఎనిమిదోసారి కావడం విశేషం.

హసీనా రికార్డు

76 ఏళ్ల షేక్ హసీనా 2009 నుంచి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు వరుసగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టబోతున్నారు. మొత్తంగా ఆమె ప్రధాని అవుతుండడం ఇది ఐదోసారి. బంగ్లా చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన నేతగా రికార్డు సృష్టించబోతున్నారు. మాజీ ప్రధాని ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీతో పాటు మరో 15 పార్టీలు ఈసారి ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. ఈసారి కేవలం 41.8 శాతం పోలింగ్ నమోదైంది. 2018 ఎన్నికల్లో 80 శాతానికి పైగా నమోదవడం విశేషం.

ఇండియా గొప్ప మిత్రదేశం

భారత్ తమకు గొప్ప మిత్రదేశమని బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా కొనియాడారు. ఎన్నికల్లో విజయం అనంతరం ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. ఇరుగుపొరుగు దేశాలైన భారత్-బంగ్లాదేశ్ ఎన్నో సమస్యలను కలిసి పరిష్కరించుకున్నాయని చెప్పారు. 1971, 1975లో భారత్ తమకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. తనకు, సోదరికి, కుటుంబ సభ్యులకు ఆశ్రయం కల్పించిందని అన్నారు. ఇండియాను తమ పక్కింటిలాంటి మిత్రదేశంగా భావిస్తామని తెలిపారు. ఇండియాతో తమకు అద్భుతమైన సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. హసీనాకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్‌తో సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

రాయ్‌బరేలీ, అమేథీల్లో సమరమే!

- యూపీలో కాంగ్రెస్ పార్టీ కంచుకోటల్లో పోటీకి సమాజ్‌వాదీ పార్టీ సన్నద్ధం
- 'ఇండియా' కూటమిలోకి బీఎస్పీ రాకను వ్యతిరేకిస్తున్న అఖిలేశ్ యాదవ్

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి వారి కంచుకోటలుగా పేరొందిన లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) సిద్ధమవుతోంది. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య పొత్తు విఫలమైంది. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలోకి బీఎస్పీని ఆహ్వానించాలన్న ప్రతిపాదనను సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దాంతో ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. బీఎస్పీ అధినేత్రి మాయావతి, అఖిలేశ్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. యూపీలోని 80 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలను నియమించింది. ప్రస్తుతం యూపీలో రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ), అప్నాదళ్ (కమేరావాదీ)తో సమాజ్‌వాదీ పార్టీ పొత్తు కొనసాగిస్తోంది.

సర్వశక్తులూ ఒడ్డుతాం: అఖిలేశ్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడానికి సర్వశక్తులూ ఒడ్డుతామని, సంక్రాంతి తర్వాత పొత్తులపై మాట్లాడుతామని అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీతో స్నేహాన్ని వదులుకొని, తమ మిత్రపక్షాలతో కలిసి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవలి మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తమను బాగా అవమానించిందన్న భావన ఆయనలో ఉందంటున్నారు. యూపీలో కాంగ్రెస్ కంచుకోటలుగా పేరొందిన రాయ్‌బరేలీ, అమేథీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ నుంచి అభ్యర్థులను బరిలో దింపేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సమాజ్‌వాదీ పార్టీకి బలమైన క్యాడర్ ఉంది. అమేథీ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఎస్పీకి ఇద్దరు, బీజేపీకి ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండగా, కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. రాయ్‌బరేలీ పరిధిలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఎస్పీకి నలుగురు, బీజేపీకి ఒక ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, సిట్టింగ్ ఎంపీ సోనియా గాంధీ ఇక్కడి నుంచి ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలిపించుకోలేకపోయారు. రాయ్‌బరేలీ నుంచి ఉంచాహార్ ఎమ్మెల్యే మనోజ్ పాండేను, అమేథీ నుంచి గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేశ్ ప్రతాప్‌సింగ్‌ను బరిలో దింపే యోచనలో అఖిలేశ్ ఉన్నట్లు సమాచారం. నిజానికి కాంగ్రెస్, ఎస్పీ మధ్య పొత్తు లేనప్పుడు రాయ్‌బరేలీ, ఆమేథీ నుంచి సమాజ్‌వాదీ పార్టీ తమ అభ్యర్థులను పోటీ చేయించలేదు. ఈసారి మాత్రం పోటీకి సై అంటుండడం ఆసక్తికరంగా మారింది. సమాజ్‌వాదీ అభ్యర్థులు పోటీ చేస్తే రెండు కీలక నియోజకవర్గాల్లో ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. అప్పుడు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం చెమటోడ్చక తప్పదు.

పుణే ఉప ఎన్నికపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: పుణే ఎంపీ గిరీశ్ బాపట్ మృతితో తొమ్మిది నెలలుగా ఖాళీగా ఉన్న ఆ ఎంపీ స్థానానికి వెంటనే ఉప ఎన్నికలు నిర్వహించాలంటూ ఈసీని ఆదేశిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనబెట్టింది. ప్రస్తుత లోక్‌సభ కాలపరిమితి జూన్ 16వ తేదీతో ముగుస్తున్న కారణంగా ఆ ఒక్క స్థానానికి ఉప ఎన్నిక నిర్వహణ వృథా అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం వ్యాఖ్యానించింది. '' ఈ స్థానం ఖాళీగా ఉంటే ఈసీ ఇన్ని రోజులు ఈసీ ఏం చేస్తున్నట్లు?. ఇలాంటి సందర్భాల్లో ఉప ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే పాటించాల్సిన విధివిధానాలపై మార్గదర్శకాలను త్వరలో వెలువరిస్తాం' అని బెంచ్ పేర్కొంది. గత ఏడాది మార్చి 29వ తేదీన ఇక్కడి బీజేపీ ఎంపీ గిరీశ్ బాపట్ కన్నుమూశారు. ఈ స్థానానికి ఉపఎన్నికలు ఉండవని ఈసీ చెప్పడంతో పుణేకు చెందినన సుఘోష్ జోషి గతంలో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. పుణే స్థానం ఖాళీ అయినప్పటి నుంచీ పలు అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు ఈసీ ఉప ఎన్నికలు నిర్వహించింది. పుణే విషయంలో ఈసీ గతంలో ఇచ్చిన వివరణ హేతుబద్ధంగా లేదు. అందుకే అక్కడ తక్షణం ఉప ఎన్నిక నిర్వహించండి'' అంటూ ఈసీని బాంబే హైకోర్టు ఆదేశించింది. వాటిని ఈసీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

ఆ రోజు ప్రపంచ వ్యాప్తంగా 'రామోత్సవం'

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్య రామాలయంలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ రోజు ప్రపంచ వ్యాప్తంగా వేడుకలు జరగనున్నాయి. అమెరికా, బ్రిటన్ సహా 50కిపైగా దేశాల్లో 'రామోత్సవం'నిర్వహించనున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న రామభక్తులు ఇప్పటికే కొన్ని దేశాల్లో శోభాయాత్రలకు కూడా శ్రీకారం చుట్టారు. విశ్వహిందూ పరిషత్ (విశ్వ విభాగం) ఆధ్వర్యంలో మరి కొన్ని దేశాల్లో భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. జనవరి 22న అమెరికాలో 300, జర్మనీలో 100, మారిషస్‌లో 100, కెనడా, ఆస్ట్రేలియాల్లో 30, బ్రిటన్‌లో 25 కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హిందువులు తక్కువగా ఉన్న ఐర్లాండ్‌తో పాటు మరికొన్ని దేశాల్లో ఒక్కో కార్యక్రమం ఉంటుంది. ఇలా మొత్తం 50కి పైగా దేశాల్లో 500 పైగా ధార్మిక, వైదిక, సాంస్కృతిక పరమైన సామూహిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ వర్గాలు తెలిపాయి.

అద్దె గర్భాలను నిషేధించాలి: పోప్

రోమ్: అద్దె గర్భాలతో మాతృత్వం పొందడం అనేది సంప్రదాయబద్ధం కాదని, ఇలాంటి అనైతిక విధానాన్ని ప్రపంచమంతటా నిషేధించాలని పోప్ ఫ్రాన్సిస్ చెప్పారు. ఆధునిక యుగంలో గర్భం, మాతృత్వం కూడా వ్యాపారమయం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. అద్దెగర్భం అనేది మహిళల గౌరవాన్ని కించపర్చడమే అవుతుందని అన్నారు. ఆయన సోమవారం వాటికన్ సిటీలో వివిధ దేశాల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో శాంతియుత పరిస్థితులు నానాటికీ క్షీణిస్తున్నాయని, శాంతికి, మానవత్వానికి విఘాతం కలుగుతోందని చెప్పారు. ఈ పరిణామం ఎంతమాత్రం క్షేమకరం కాదని అన్నారు. కొన్ని దేశాల్లో సంక్షోభాలు, ఫలితంగా వలసలు పెరిగిపోతుండడం, వాతావరణ మార్పులతో ప్రకృతి విపత్తులు విరుచుకుపడుతుండడం పట్ల పోప్ ఆందోళన వ్యక్తం చేశారు. అణ్వాయుధాల ఉత్పత్తి పెచ్చరిల్లుతుండడం భూగోళంపై మానవాళికి మనుగడకు ఎప్పటికైనా ముప్పేనని పేర్కొన్నారు.

రాజస్తాన్‌లో బీజేపీకి భంగపాటు

ఉప ఎన్నికల్లో ఓడిపోయిన మంత్రి

జైపూర్: ఇటీవల రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలిచి అధికారం కైవసం చేసుకున్న బీజేపీ సోమవారం ఒక అసెంబ్లీ స్థానం ఉపఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. భజన్‌లాల్ శర్మ మంత్రివర్గంలో సహాయక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సురేంద్ర పాల్ సింగ్ కరణ్‌పూర్ ఉపఎన్నికల్లో ఓడిపోయారు. పోలింగ్ జనవరి ఐదున జరగ్గా ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. మంత్రి సురేంద్రపాల్‌పై 11వేలకుపైగా మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి రూపీందర్ కూనర్ ఘన విజయం సాధించారు. రూపీందర్ తండ్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే గుర్మీత్ సింగ్ మరణించడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో కాంగ్రెస్ గుర్మీత్ తనయుడికి టికెట్ ఇచ్చి బరిలోకి దింపింది. మంత్రి ఓటమిపై కాంగ్రెస్ స్పందించింది. ''బీజేపీ ప్రభుత్వం తమ వ్యక్తులను మంత్రులుగా చేయగలదు. కానీ ఎమ్మెల్యేగా చేయలేదు. ప్రజాప్రతినిధ్యం వహించగల నేతనే ఎమ్మెల్యే అవగలరు'' అని ఎద్దేవాచేసింది.

682 జేఎన్.1 కేసులు

న్యూఢిల్లీ: దేశంలోని 12 రాష్ట్రాల్లో ఈ నెల 7వ తేదీ వరకు కోవిడ్-19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు 682 బయటపడ్డాయి. ఇందులో అత్యధికంగా కర్ణాటకలో 199 కేసులను గుర్తించగా, ఆ తర్వాతి స్థానంలో ఉన్న కేరళలో 148, మహారాష్ట్రలో 139, గోవాలో 47, గుజరాత్‌లో 36, ఏపీలో 30, రాజస్తాన్‌లో 30, తమిళనాడులో 26, ఢిల్లీలో 21, ఒడిశాలో 3, తెలంగాణలో 2, హరియాణాలో ఒక కేసు బయటపడ్డాయని ఓ అధికారి చెప్పారు. జేఎన్.1 వేరియంట్‌కు సంబంధించిన కేసులు దేశంలో పెరుగుతున్నప్పటికీ ఆందోళన అవసరం లేదని ఆ అధికారి అన్నారు. స్వల్ప లక్షణాలతో ఇంటి వద్ద చికిత్సతోనే వ్యాధి నయమవుతోందని అన్నారు. ఇలా ఉండగా, దేశంలో 24 గంటల వ్యవధిలో కోవిడ్ కొత్త కేసులు 605 నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం తెలిపింది. యాక్టివ్ కేసులు 4002 ఉన్నాయని పేర్కొంది. కేరళలో ఇద్దరు, కర్ణాటక, త్రిపురల్లో ఒక్కరేసి చొప్పున కోవిడ్ బాధితులు చనిపోయినట్లు వివరించింది.

పేదల ప్రగతితో బలమైన భారత్

'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: పేదలు, రైతులు, మహిళలు, యువత సాధికారత సాధిస్తే దేశం శక్తివంతంగా మారుతుందని, బలమైన భారత్ ఆవిర్భవిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కేవలం ప్రభుత్వ యాత్రగానే కాదు, దేశ యాత్రగా మారిందని చెప్పారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రధాని మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గత ప్రభుత్వాల హయాంలో రైతన్నలు నిర్లక్ష్యానికి గురయ్యారని, అప్పట్లో ప్రభుత్వ వ్యవసాయ విధానాలు కేవలం ఉత్పత్తి, అమ్మకానికే పరిమితం అయ్యాయని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక అన్నదాతల సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని చెప్పారు. పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ప్రతి రైతుకు ఇప్పటిదాకా రూ.30,000 బదిలీ చేశామని తెలిపారు. వ్యవసాయ సహకార సంఘాలను, వ్యవసాయ ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేశామని అన్నారు. గోదాములు నిర్మించామని, పంటల నిల్వ సామర్థ్యాలను పెంచామని, ఆహార శుద్ధి పరిశ్రమను ఎంతగానో ప్రోత్సహించామని గుర్తుచేశారు. ''కంది పప్పును ఆన్‌లైన్ ద్వారా నేరుగా ప్రభుత్వానికి విక్రయించే సదుపాయాన్ని కల్పించాం. వారికి మార్కెట్ రేటు కంటే మెరుగైన ధర చెల్లిస్తున్నాం. పప్పుల కొనుగోలు కోసం విదేశాలకు చెల్లించే సొమ్ము మన రైతుల చేతికే అందాలన్నది మా ఉద్దేశం'' అన్నారు. గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

ప్రతి మూలకూ 'మోదీ గ్యారంటీ'

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లక్ష్యమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అర్హుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదన్నారు. అర్హులకు సక్రమంగా, సంతృప్త స్థాయిలో పథకాలు అందితేనే 'అభివృద్ధి చెందిన భారత్' సాధ్యమని చెప్పారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించారు. వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ యాత్ర ఇటీవలే 50 రోజులు పూర్తి చేసుకుందని, దేశమంతటా 11 కోట్ల మంది ప్రజలతో నేరుగా అనుసంధానమైందని హర్షం వ్యక్తం చేశారు. 'మోదీ కీ గ్యారంటీవాలీ గాడీ' దేశంలో ప్రతి మూలకూ వెళ్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాల కింద లబ్ధి కోసం సుదీర్ఘకాలం ఎదురు చూసే పేదలు ఇప్పుడు ఒక అర్థవంతమైన మార్పును చూస్తున్నారని పేర్కొన్నారు. పథకాలు అర్హుల గడప వద్దకే వెళ్తున్నాయన్నారు. ప్రస్తుత, భావి తరాల యువత గత తరాల కంటే మెరుగైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.

అర్ధ శతాబ్ది తర్వాత చంద్రుడిపై అమెరికా కన్ను



కేప్ కనావరెల్(యూఎస్): యాభై సంవత్సరాల తర్వాత అమెరికా చంద్రుడిపై పరిశోధనలకు నడుం బిగించింది. ఆర్టెమిస్ మిషన్ సన్నాహకాల్లో భాగంగా నాసా.. ఆస్ట్రోబోటిక్ టెక్నాలజీ వారు తయారుచేసిన పెరీగ్రీన్ ల్యాండర్‌ను యూనైటెడ్ లాంచ్ అలయన్స్ వల్కన్ రాకెట్ ద్వారా నింగిలోకి పంపింది. సోమవారం ఫ్లోరిడాలోని కేప్ కనావరెల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి రాకెట్‌ను ప్రయోగించారు. పలుమార్లు కక్ష్యలను మార్చుకుంటూ ఫిబ్రవరి 23వ తేదీన అది చంద్రుడిపై దిగనుంది. దాదాపు రూ.900 కోట్ల వ్యయంతో ఈ ల్యాండర్‌ను తయారుచేశారు. ల్యాండర్ తయారీలో ఆస్ట్రోబోటిక్‌కు అవకాశం ఇవ్వడం ద్వారా నాసా.. అంతరిక్ష 'డెలివరీ' సేవల రంగంలోకి ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించినట్లయింది. చంద్రుడిపై దిగాక పెరీగ్రీన్ పలు పరిశోధనలు చేయనుంది. ఈ పరిశోధనలు ఈ ఏడాది చివర్లో నాసా నలుగురు వ్యోమగాములతో చేపట్టే ప్రయోగానికి సాయపడనున్నాయి. ఆస్ట్రోబోటిక్‌తోపాటు నోవా-సీ ల్యాండర్‌ను తయారుచేసేందుకు హ్యూస్టన్‌కు చెందిన ఇంట్యూటివ్ మెషీన్స్‌తోనూ నాసా ఒప్పందం కుదుర్చుకుంది. నోవా-సీను ల్యాండర్‌ను వచ్చే నెలలో స్పేస్‌ఎక్స్ రాకెట్ ద్వారా చంద్రుడి మీదకు పంపనున్నారు. నేరుగా ప్రయాణం కారణంగా పెరిగ్రీన్ కంటే ముందుగా వారం రోజుల్లోనే ఇది చంద్రుడిపై దిగనుంది. 1960, 70 దశకాల్లో చంద్రుడిపై విజయవంతంగా ల్యాండింగ్‌లతో అమెరికా, సోవియట్ యూనియన్‌లు పోటాపోటీగా ప్రయోగాలు చేపట్టడం తెల్సిందే. చంద్రుడిపై శోధనాపర్వంలో 2013లో చైనా, 2023లో భారత్ చేరాయి. గతేడాది రష్యా, జపాన్ ల్యాండర్లు విఫలమయ్యాయి.

హరియాణా మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేసిన ఈడీ

చండీగఢ్: అక్రమ మైనింగ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోమవారం హరియాణా మాజీ ఎమ్మెల్యే దిల్బాగ్ సింగ్, ఆయన సహాయకుడు కుల్విందర్ సింగ్‌ను అరెస్ట్ చేశారు. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్‌ఎల్‌డీ)కి చెందిన మాజీ ఎమ్మెల్యే సింగ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పన్వర్, వారికి సంబంధించిన సంస్థలపై ఈ నెల 4న మొదలైన ఈడీ సోదాలు సోమవారం ముగిశాయి. సోదాల్లో అయిదు రైఫిళ్లు, 300 బుల్లెట్లు, 100కు పైగా లిక్కర్ బాటిళ్లు, రూ.5 కోట్ల నగదు దొరికాయని ఈడీ వర్గాలు తెలిపాయి.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇళ్లపై ఈడీ దాడులు

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజెగౌడకు సంబంధించిన సంస్థల్లో సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు జరిపారు. కోలార్ జిల్లా మాలూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన నంజెగౌడ కోలార్-చిక్కబళ్లాపూర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్ అధ్యక్షుడిగా ఉన్నారు. కోముల్‌లో సిబ్బంది నియామకాల్లో అవకతవకలు జరిగాయన్న కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు ఆయనపై నమోదు చేసింది. సోమవారం మాలూర్, కోలార్‌లలోని నంజెగౌడ ఇళ్లు, సంబంధించిన సంస్థలపై దాడులు జరిపినట్లు ఈడీ అధికార వర్గాలు తెలిపాయి.

ముదిరిన లక్షద్వీప్-మాల్దీవుల వివాదం

దౌత్యవేత్తను పిలిచి తీవ్ర నిరసన వ్యక్తం చేసిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ: 'లక్షద్వీప్-మాల్దీవుల' వివాదం ముదురుతోంది. మన పర్యాటక రంగంపై మాల్దీవుల మంత్రుల వివాదాస్పద వ్యాఖ్యలతో మొదలైన 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' పిలుపుకు అన్ని వర్గాల నుంచి మద్దతు పెరుగుతోంది. ఆ దేశ దౌత్యవేత్త అలీ నజీర్ మొహమ్మద్‌తో భారత హైకమిషనర్ మును ముహావర్ సోమవారం సమావేశమయ్యారు. భారత్ పట్ల, ప్రధాని మోదీ పట్ల మాల్దీవుల మంత్రుల వ్యాఖ్యలను ఎండగట్టారు. వారిని మాల్దీవులు ఇప్పటికే సస్పెండ్ చేయడం తెలిసిందే. అయినా దీనిపై భారతీయ సమాజంలో ఆగ్రహావేశాలు తగ్గలేదు. అమితాబ్ బచ్చన్, సల్మాన్ ఖాన్, శ్రద్ధా కపూర్, వెంకటేశ్ ప్రసాద్, వీరేందర్ సెహ్వాగ్ తదితర సెలెబ్రిటీలు కూడా 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'కు జై కొట్టారు. మాల్దీవుల పర్యటన మానేసి లక్షద్వీప్, అండమాన్ వంటి భారతీయ రమణీయ కేంద్రాలకు వెళ్లాలంటూ ఫొటోలను షేర్‌చేశారు. మాల్దీవులతో వాణిజ్య కార్యకలాపాలు తగ్గించుకోవాలని కన్ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్ పిలుపునిచ్చింది.

3,400 శాతం పెరిగిన సెర్చింగ్!

లక్షద్వీప్‌లో మోదీ పర్యటన తర్వాత ఆన్‌లైన్ వేదికల్లో భారత దీవుల కోసం వెతికే వారి సంఖ్య ఏకంగా 3,400 శాతం పెరిగిందని మేక్‌మైట్రిప్ సంస్థ పేర్కొంది. మాల్దీవులకు పర్యాటకుల్లో భారతీయుల సంఖ్యే అత్యధికమని ఆ దేశ పర్యాటక శాఖ గణాంకాల్లో వెల్లడైంది. గతేడాది 2.09 లక్షల మంది భారతీయులు అక్కడికెళ్లారు. 2022లో 2.4 లక్షలు, 2021లో 2.11 లక్షల మంది పర్యటించారు. అంతేకాదు, కోవిడ్ కాలంలోనూ 63,000 మంది అక్కడ పర్యటించారు!

ట్రెండింగ్‌లో లక్షద్వీప్

మాల్దీవులకు బదులు భారతీయ పర్యాటక కేంద్రాలకే వెళ్దామన్న సెలబ్రిటీలు పిలుపుతో లక్షద్వీప్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చింగ్ అనూహ్యంగా పెరిగింది. 'లక్షద్వీప్' పదంతో ప్రపంచవ్యాప్తంగా సెర్చింగ్ చేస్తున్న వారి సంఖ్య గత రెండు దశాబ్దాల్లో ఎప్పుడూ లేనంత ఎక్కువ స్థాయికి చేరుకుందని 'గూగుల్ ట్రెండ్స్' గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఈజ్‌మైట్రిప్ సంస్థ భారత్‌కు మద్దతుగా మాల్దీవులకు విమానాల బుకింగ్స్‌ను రద్దుచేసింది. ''మాల్దీవులు/సీషెల్స్ మాదిరే లక్షద్వీప్‌లోని బీచ్‌లు, పరిసరాలు అద్భుతంగా ఉంటాయి. ఇక్కడే పర్యటించండి'' అని సంస్థ సీఈవో నిషాంత్ పిట్టి చెప్పారు.

పోలియో టీకా బృందంపై ఉగ్ర పంజా

ఆరుగురు పోలీసులు మృతి..మరో 22 మందికి గాయాలు

పెషావర్: పోలియో టీకా సిబ్బందికి రక్షణగా వెళ్లిన పోలీసులే లక్ష్యంగా ఉగ్రవాదులు విసిరిన బాంబు పేలి ఆరుగురు పోలీసులు చనిపోయారు. మరో 22 మంది గాయపడ్డారు. పాకిస్తాన్‌లోని కల్లోల ప్రాంతం ఖైబర్ పంఖ్తున్వా ప్రావిన్సులో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. అఫ్గానిస్తాన్ సరిహద్దులకు సమీపంలోని బజౌర్ జిల్లా మముండ్ తహశీల్‌కు సోమవారం ఉదయం పోలియో టీకా సిబ్బంది చేరుకున్నారు. గతంలో వారిపై ఉగ్రవాదులు దాడి చేసిన దాఖలాలుండటంతో వారికి భద్రత కల్పించేందుకు పోలీసులు కూడా వచ్చారు. పోలీసులున్న వ్యానుపైకి ఉగ్రవాదులు బాంబులు విసిరారు. దీంతో ఆరుగురు పోలీసు సిబ్బంది మృతి చెందగా మరో 22 మంది గాయపడ్డారు. పోలియో టీకా సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రులైన పోలీసుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ఘటనకు తామే కారణమంటూ తెహ్రీక్-ఇ- తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)ప్రకటించుకుంది.

పోలీస్ స్టేషన్‌కు నిప్పు పెట్టేశాడు!

దర్భంగా: బిహార్‌లోని దర్భంగా జిల్లాలో ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు నిప్పుపెట్టాడు. ధర్మేంద్ర ఠాకూర్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి అరుణ్ యాదవ్ అనే వ్యక్తితో కలిసి మోరో పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఆ రోజు తన అన్నతో గొడవ జరిగిందని, అనంతరం అతడు కనిపించకుండాపోయాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అర్ధరాత్రి వరకు అక్కడే పోలీస్ స్టేషన్ ఆవరణలోనే తచ్చాడాడు. డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బంది నిద్రిస్తున్న సమయంలో, స్టేషన్ ఆవరణలోనే చిన్నచిన్న డబ్బాల్లో ఉన్న ద్రావకాన్ని చల్లి నిప్పంటించాడు. మంటలు వెంటనే స్టేషన్‌కు వ్యాపించాయి. సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తెచ్చారు. ఇదంతా అక్కడి సీసీ టీవీ ఫుటేజీలో నమోదైంది. కొద్ది గంటల తర్వాత పోలీసులు ధర్మేంద్ర ఠాకూర్‌ను పట్టుకున్నారు. అతడు ఎందుకు నిప్పుపెట్టాడో పోలీసులు చెప్పడం లేదు.

ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా కమాండర్ మృతి

బీరుట్: దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ సోమవారం జరిపిన వైమానిక దాడుల్లో హెజ్బొల్లా సీనియర్ కమాండర్ ఒకరు మృతి చెందినట్లు లెబనాన్ రక్షణ శాఖ అధికారి వెల్లడించారు. హెజ్బొల్లా గ్రూపులోని రద్వాన్ ఫోర్సెస్‌కు చెందిన సీనియర్ కమాండర్ తన ఎస్‌యూవీలో వెళ్తుండగా ఖిర్బెట్ సెల్మ్ గ్రామం వద్ద ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడిలో ఆయన చనిపోయినట్లు చెప్పారు. మృతి చెందిన కమాండర్ పేరును మాత్రం ఆయన వెల్లడించలేదు. లెబనాన్-ఇజ్రాయెల్ సరిహద్దుల్లో ఇరాన్ మద్దతున్న హెజ్బొల్లా మిలిటెంట్లు, ఇజ్రాయెల్ మిలటరీకి మధ్య పోరు ఉధృతంగా సాగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. కాగా, తాజా దాడిపై ఇజ్రాయెల్ స్పందించలేదు. తమ ఫైటర్ విమానాలు దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా మౌలిక వసతులే లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. హెజ్బొల్లా కూడా స్పందించలేదు.

గుడులతో మానసిక బానిసత్వం

బిహార్ విద్యా మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

రోహ్‌తాస్: దేవాలయాలు మానసిక బానిసత్వానికి దారి తీస్తే, స్కూళ్లు జీవితానికి వెలుగు చూపుతాయని ఆర్‌జేడీకి చెందిన బిహార్ విద్యా మంత్రి చంద్ర శేఖర్ పునరుద్ఘాటించారు. ఇటీవల ఇటువంటి వ్యాఖ్యలే చేసి తీవ్ర విమర్శలనెదుర్కొన్న తమ పార్టీ ఎమ్మెల్యే ఫతేహ్ బహదూర్ సింగ్‌కు ఆయన మద్దతు పలికారు. అయోధ్యలోని రామ మందిరాన్ని జేబులు నింపుకునే దోపిడీ ప్రదేశంగా ఆదివారం పేర్కొన్నారు. ''అయోధ్యలో రామాలయం కోసం కేటాయించిన ఆ ప్రాంతం కేవలం దోపిడీ కోసమే. ఒక వర్గానికి చెందిన కుట్రదారుల జేబులు నింపే ప్రదేశమది. నకిలీ హిందుత్వ, నకిలీ జాతీయవాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రాముడు ప్రతి ఒక్కరి గుండెల్లో ఉన్నాడు. ఆయన కోసం ఏ గుడికీ, ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు'' అని చంద్రశేఖర్ చెప్పారు.

సాక్షి
కరీంనగర్
మంగళవారం | 9 | జనవరి | 2024

రెండు కరోనా పాజిటివ్ కేసులు



కరీంనగర్‌టౌన్: జిల్లాలో సోమవారం రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో ఒకరు మాతా శిశు ఆరోగ్యం కేంద్రంలో డెలివరీ కోసం వచ్చిన మహిళకాగా, మరొకరు జనరల్ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన మహిళ ఉన్నారు. వీరికి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు.



పత్తి ధర రూ.6,800

జమ్మికుంట:మార్కెట్లో పత్తి రూ.6,800 పలికింది. మార్కెట్‌కు 812 క్వింటాళ్ల పత్తి వచ్చింది. గన్నీ సంచుల్లో 15 క్వింటాళ్లు రాగా.. రూ.6,200 పలికింది. సీసీఎస్ 1,346.05 క్వింటాళ్లు కొనుగోలు చేసింది.

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొడి వాతావరణం ఏర్పడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- ఎస్‌ఈ గంగాధర్



హుజూరాబాద్: విధినిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కరీంనగర్ ఎస్‌ఈ గంగాధర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మధువని గార్డెన్‌లో విద్యుత్‌శాఖాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సబ్‌స్టేషన్ల నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. డివిజన్‌లో విభాగాల వారీగా పెండింగ్‌లో ఉన్న బకాయిల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు వీరాచారి, శ్రీనివాస్, రవీందర్, ఆంజనేయులు, సంపత్‌రెడ్డి, కుమార స్వామి పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయండి

- శరవేగంగా ప్రజా పాలన అర్జీల కంప్యూటరీకరణ
- వీసీలో పౌర సరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్‌కు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వానాకాలం, యాసంగి 2022–23కు గానూ మిల్లర్లు వారికి కేటాయించిన రోజువారి లక్ష్యాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటరీకరించాలని, నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల పూర్తి వివరాలను పొరపాట్లకు తావులేకుండా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీఓ కుందారపు మహేశ్వర్, డీసీఎస్‌వో సురేశ్, డీఎం సివిల్ సప్లై రజనీకాంత్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన'పై నిర్లక్ష్యం.. అధికారులకు షోకాజ్

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరించిన ఆరు గ్యారంటీల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పర్యవేక్షణలో అలసత్వం వహించారని పలువురు అధికారులకు అదనపు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గన్నేరువరం మండల పర్యవేక్షణ అధికారి డీసీవో రామానుజచారి, కరీంనగర్ కార్పొరేషన్ ఇన్‌చార్జీలు, అసిస్టెంటు కమిషనర్ నరేశ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల కిష్టప్ప, మహేందర్, శానిటరీ సూపర్ వైజర్ రాజమనోహర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ భానుచందర్, డీఈవో జనార్దన్రావు, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌కు నోటీలు అందుకున్నట్లు తెలిసింది.

నేడు జాబ్‌మేళా

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కరీంనగర్ జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌తో పాటు ఇతర జిల్లాల్లో యాక్సిస్ బ్యాంకు, నవత ట్రాన్స్‌పోర్టులో టెలిమార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఫార్మసిస్ట్, క్లర్క్, తదితర ఉద్యోగాలకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీ.ఫార్మసీ విద్యార్హత గలవారు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 72076 59969 నంబర్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

జిల్లాలో శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటన నేడు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం, వికసిత్ సంకల్ప భారత్ ముగింపు సమావేశంలో పాల్గొనడానికి మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్‌చౌహాన్ మంగళవారం కరీంనగర్ రానున్నారని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్‌లోని వి–పార్క్ హోటల్‌లో కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని మండల అధ్యక్షులు, ఆ పైస్థాయి నాయకులతో జరిగే విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు మానకొండూరు మండలం కొండపల్కలలో జరిగే వికసిత్ సంకల్ప్ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ మంగళవారం ఉదయం 10గంటలకు వేములవాడ రూరల్‌లో జరిగే వికసిత్ సంకల్ప్ భారత్ ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

'పార్లమెంట్' హీట్!

- ఎంపీ పోరుకు రెడీ అవుతున్న పార్టీలు
- కేంద్ర పథకాల పేరుతో బీజేపీ
- ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్
- గత అభివృద్ధితో ప్రజల్లోకి బీఆర్‌ఎస్
- కరీంనగర్‌కు వస్తున్న అగ్రనేతలు



కరీంనగర్:

లోక్‌సభ సమరానికి రాజకీయ పార్టీలు సైఅంటున్నాయి. విజయబావుటా ఎగురవేసేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేస్తున్నాయి. కరీంనగర్ లోక్‌సభ సీటును కైవసం చేసుకోవాలని బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులను రప్పించే ప్రయత్నాలు చేస్తున్నాయి. కరీంనగర్, వేములవాడ, సిరిసిల్ల, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో సభలు.. సమావేశాలకు రెడీ అయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వేములవాడ, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ స్థానాల్లో కాంగ్రెస్ విజయబావుట ఎగురవేసింది. కరీంనగర్, హుజూరాబాద్, సిరిసిల్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. కరీంనగర్, హుజూరాబాద్‌లో బీజేపీ అభ్యర్థులు గట్టిపోటీ ఇచ్చారు.

ప్రజాక్షేత్రంలోకి బీజేపీ...

బీజేపీ నుంచి ప్రస్తుత ఎంపీ బండి సంజయ్‌కుమార్ తిరిగి పోటీ చేయనున్నారనే ప్రచారం ఊపందుకుంది. పార్టీ శ్రేణులు ఇప్పటికే పలుచోట్ల వాల్‌రైటింగ్, పోస్టర్లు వేసి ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. గతనెల చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో అమిత్‌షా సిట్టింగ్‌లకే టికెట్లు ఇస్తామని సంకేతం ఇవ్వడంతో బండి సంజయ్ క్యాడర్‌ను కదనరంగంలోకి దించారు. అయోధ్య శ్రీరాముడి అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు ప్రజ ల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలను ట్రైనప్ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పిదాలు రిపీట్ కాకుండా జాగ్రత్తలు సూచిస్తున్నారు. వికసిత్ భారత్‌తో ప్రజలతో మమే కం అయ్యేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యప్రదేశ్ మాజీ సీఎం, సీనియర్ బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ మానకొండూరు మండలం కొండపల్కల గ్రామంలో జరిగే 'వికసిత్ భారత్'లో పాల్గొననున్నారు.

జోష్‌లో 'కాంగ్రెస్'..

పదేళ్ల తర్వాత అధికారాన్ని 'హస్త'గతం చేసుకున్న కాంగ్రెస్ ఊపుతో ముందుకెళ్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని నాలుగు అసెంబ్లీ సీట్లను గెలుచుకున్న ఉత్సాహంతో పార్లమెంట్ సీటునూ గెలుచుకోవాలని చూస్తోంది. హుస్నాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి గెలిచిన ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ మంత్రిగా ఉండటం, గతంలో కరీంనగర్ ఎంపీగా పనిచేసిన అనుభవం ఉండడంతో అధిష్టానం లోక్‌సభ ఇన్‌చార్జిగా నియమించింది. దీంతో ఆ పార్టీ లీడర్లు బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఎదుర్కొనేందుకు క్యాడర్‌ను రెడీచేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ ఎమ్మెల్యేలు బిజీబిజీగా ఉన్నారు.

గత అభివృద్ధి, కాంగ్రెస్ హామీలపై ప్రజల్లోకి బీఆర్‌ఎస్..

పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వందరోజుల్లో ఆరు గ్యారంటీల అమలు తదితరాలు ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ నేతలు వ్యూహాలకు పదునుపెడుతున్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాము గెలిచిన మూడు సీట్లతో పాటు మిగతా నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీలకు గట్టిపోటీ ఇచ్చామని గుర్తుచేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.

విజయం మాదే



పదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తాం. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టలేకపోయాం. మండలానికి మూడు టీంలు ఏర్పాటు చేశాం. కాంగ్రెస్, బీజేపీల నిజస్వరూపాన్ని ఎండగట్టి బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధిని చెబుతాం. ప్రజలు మా వెంటే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం మాదే.

– జీవీ రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

కేంద్ర పథకాలను వివరిస్తాం



పదేళ్లల్లో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతీ గ్రామానికి చేరాయి. ప్రధాని మోదీ హయాంలో దేశగౌరవం పతాకస్థాయికి చేరింది. కరీంనగర్ సిట్టింగ్ సీటు మళ్లీ గెలుచుకుంటాం. బీజేపీ అవసరాన్ని అన్నివర్గాల ప్రజలు గుర్తించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం, దేశంలో బీజేపీ అత్యధిక సీట్లు కైవం చేసుకోనుంది. మోదీ మూడో సారి ప్రధాని కావడం ఖాయం.

– గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

గెలుపే లక్ష్యం



అభ్యర్థి ఎవరనేది కాదు... కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతాం. ఈనెల 3న హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీ ముఖ్యులతో సమావేశం జరిగింది. కరీంనగర్ పార్లమెంట్ సీటును గెలుచుకునే విషయంపై దిశా నిర్దేశనం చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ముందుకెళ్తాం.

– కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు

జిల్లా ఓటర్లు 10,64,129

షెడ్యూల్ ఇలా
ముసాయిదా జాబితా ప్రకటన: ఈ నెల 8
అభ్యంతరాలకు గడువు: ఈ నెల 22
తుది జాబితా ప్రకటన: ఫిబ్రవరి 8

ముసాయిదా ప్రకారం ఓటర్ల వివరాలు
మొత్తం ఓటర్లు: 10,64,129
పురుషులు: 5,23,898
స్త్రీలు: 5,40,175, ఇతరులు: 56

- ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన
- గత జాబితాకు 32,983 అదనం
- ఫిబ్రవరి 8న తుది జాబితా



కరీంనగర్ అర్బన్: రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించింది. ముసాయిదా జాబితా ప్రకారం 10,64,129 ఓటర్లు కాగా గత జాబితాకు 32,983 మంది ఓటర్లు పెరిగారు. ముసాయిదా జాబితా ప్రకారం మహిళలే ఎక్కువగా ఓటర్లుగా ఉండటం గమనార్హం. చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు, కరీంనగర్‌లో పురుషులే ఎక్కువ ఉన్నారు. కాగా తుది ఓటరు జాబితా ఫిబ్రవరి 8న ప్రకటించనున్నారు.

ఎన్నారై ఓటర్ల స్పందన అంతంతే

రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నారై ఓటర్లను ప్రత్యేకంగా పేర్కొంది. గతంలో సదరు ఓటర్లకు ప్రత్యేక ఫారం–6ఏ రూపొందించిన సంగతి తెలిసిందే. రానున్న ఎన్నికల్లో వీరు కూడా ఓటేసే అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎన్నారై ఓటర్ల వివరాలను ప్రత్యేక నమూనాలో పొందుపరిచింది. జిల్లా నుంచి వేల సంఖ్యలో అమెరికా, లండన్, స్విట్జర్లాండ్, రష్యా, దుబాయి, మస్కట్, సౌదీఅరేబియా, సింగపూర్, బెహ్రాయిన్ తదితర దేశాల్లో ఉన్నారు. 30శాతం అక్కడే స్థిరపడగా ఉపాధి నిమిత్తం అక్కడున్నవారు రాకపోకలు సాగించేవారు 70శాతం వరకు ఉన్నారు. గత జాబితాకు నేటి జాబితాకు పోలిస్తే కేవలం 9మంది మాత్రమే అదనంగా నమోదు చేసుకున్నారు. ఇప్పటివరకు నమోదైన వారు అత్యల్పంగా 125 కాగా గతంలో ఈ సంఖ్య 116. నమోదైన వారిలో కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన వారు 83 మంది కాగా చొప్పదండికి సంబంధించి 22, మానకొండూరు 4, హుజూరాబాద్ 16 మంది మాత్రమే.

ఈ నెల 22వరకు అభ్యంతరాలకు గడువు

ఓటరు జాబితాలో అనర్హులను తొలగించొచ్చు. ప్రజలు సదరు జాబితాను పరిశీలించి రెండు చోట్ల ఓటరుగా నమోదైనా, మరణించినవారున్నా.. వలస వెళ్లిన వారున్నా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. ఈ నెల 22 వరకు సదరు అభ్యంతరాలను అధికారులు స్వీకరించనున్నారు. బోగస్ ఓట్లున్నాయని ఎన్నికల సమయంలో ఆందోళనలు చేపట్టే కన్నా ఇప్పుడే అప్రమత్తమవడం ఉత్తమం.

ముసాయిదా ప్రకారం నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
కరీంనగర్	1,79,284	1,78,534	43	3,57,861
చొప్పదండి(ఎస్సీ)	1,13,311	1,20,234	6	2,33,551
మానకొండూరు(ఎస్సీ)	1,09,219	1,13,276	1	2,22,496
హుజూరాబాద్	1,22,084	1,28,131	6	2,50,221

ఎన్నారై ఓటర్ల వివరాలిలా.. (బ్రాకెట్లో సర్వీసు ఓటర్లు)

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	మొత్తం
కరీంనగర్	68(87)	15(12)	83(99)
చొప్పదండి	21(192)	1(4)	22(196)
మానకొండూరు	4(126)	0(2)	4(128)
హుజూరాబాద్	12(158)	4(6)	16(164)



సమ్మక్క జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: జిల్లాలో సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఫిబ్రవరి 21 నుంచి 24వరకు జరిగే జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో 16 చోట్ల జాతర జరగనుందని, రేకుర్తి, కేశవపట్నం, హుజూరాబాద్‌లలో పెద్దఎత్తున ఉంటుందని పేర్కొన్నారు. పనులపై ప్రణాళికలను రూపొందించుకొని, త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. మంచినీరు, టాయిలెట్, శానిటేషన్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ విజయవంతం చేయండి

మానకొండూర్ మండలం కొండపల్కలలో మంగళవారం జరగనున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం సాయంత్రం 3 గంటలకు కొండపల్కలలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, గృహ మంత్రిత్వ శాఖ కార్యాలయ డైరెక్టర్ వికసిత్ భారత్ కార్యక్రమ అధికారి దీక్షిత్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే శివరాజ్ సింగ్ చౌహాన్‌లు పాల్గొననున్నారని తెలిపారు. హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు.

సురక్షిత బాల్యం కోసం కృషి చేయాలి

కరీంనగర్: పిల్లలపై జరుగుతున్న హింసలను తగ్గిస్తూ, సురక్షిత బాల్యాన్ని అందించడానికి కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన స్నేహిత ఫస్ట్ వన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పిల్లలపై జరుగుతున్న హింసను తగ్గించి, సేఫ్‌టచ్, అన్‌సేఫ్ టచ్, సురక్షితమైన ఇంటర్ నెట్ వినియోగం, సెల్ఫ్ ప్రొటెక్షన్ అంశాలను వివరించాలని అన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మీ, డీడబ్ల్యూవో సరస్వతి, డీఈవో జనార్దన్ రావు, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీఆర్డీవో శ్రీలత పాల్గొన్నారు.

వీడ్కోలులోనూ వీడని బూతు పురాణం

- బల్దియాలో బదిలీ డీఈ హంగామా

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్: అదే తీరు...బదిలీ వేటు పడినా ఆ డీఈ మారలేదు...విధుల్లో ఉన్నన్నాళ్లూ వివాదాస్పద అధికారిగా ముద్రపడినా, ఆరోపణలతో ఏకంగా ఆదిలాబాద్‌కు బదిలీ అయినా...ఆయన వ్యవహారశైలిలో ఇసుమంతైనా మార్పు కనిపించడం లేదు. బదిలీ నేపథ్యంలో రిలీవ్ అవుతున్న సమయంలోనూ అదే బూతుపురాణాన్ని బల్దియాలో తారాస్థాయిలో వినిపించి మరీ కదిలాడు. పనిలో పనిగా మళ్లీవస్తా.. ఒక్కొక్క...కొడుకుల సంగతి చెబుతానంటూ సవాల్ విసిరారు. నగరపాలకసంస్థలో డీఈగా పనిచేస్తున్న మసూద్ అలీ గత నెల 29న బదిలీ అయ్యారు. బల్దియాలో అంతా తానై నడిపించిన ఆయన పలు వివాదాల్లో ఇరుక్కోవడం తెలిసిందే. అక్రమాలకు పాల్పడ్డాడంటూ అప్పటి అధికార బీఆర్‌ఎస్ కార్పొరేటర్లే కలెక్టర్ నుంచి మొదలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు ఫిర్యాదులు చేశారు. అంతేకాకుండా అధికారులను పరుషపదజాలంతో పలుమార్లు దూషించిన ఘటనలు కూడా నగరపాలక సంస్థలో కలకలం రేపాయి. ఈయన వ్యవహారశైలిపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. ఈక్రమంలోనే ఆయన బదిలీ అయ్యారు. ఉత్తర్వులు అందిన రోజునే రిలీవ్ చేశారు. కానీ.. ఆయన ఇప్పటివరకు రిలీవ్ ఆర్డర్ తీసుకోలేదు. తన బదిలీ రద్దు కోసం పలువురు నేతలతో ప్రయత్నాలు చేశారనే ప్రచారం ఉంది. సోమవారం నగరపాలకసంస్థకు వచ్చిన డీఈ మసూద్ రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. మూడు నెలల్లో తిరిగివస్తానంటూ...తనను ఇబ్బంది పెట్టిన వారి సంగతి చెబుతానంటూ హెచ్చరించారు. వెళ్లిపోతున్న సమయంలోనూ డీఈ ప్రవర్తించిన తీరు చర్చనీయాంశమైంది.

మీ ప్రేమ కోరే చిన్నారులం

- ప్రజావాణికి తరలివచ్చిన చిన్నారులు
- మార్గం చూపాలని కలెక్టర్‌కు వేడుకోలు
- 184 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు




అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజావాణికి వచ్చిన అర్జీలు: 184
కరీంనగర్ ఆర్డీవో కార్యాలయం: 19
కరీంనగర్ మున్సిపల్: 16
కరీంనగర్ రూరల్ తహసీల్దార్: 11
ఇతర శాఖలు: 138


కరీంనగర్ అర్బన్: తమకో మార్గం చూపాలంటూ పలువురు చిన్నారులు ప్రజావాణిని ఆశ్రయించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అర్జీలిచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు మాటలు రానివారు కాగా మరికొందరు నడవలేనివారు తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. సదరం సర్టిఫికెట్ ఉన్నా పింఛన్ రావడం లేదని కొందరు, అర్హత ఉన్నా పర్సంటేజీ తక్కువగా వేశారని మరికొందరు తమ బంధువులతో కలెక్టరేట్‌కు రాగా సీఆర్‌పీ ఆప్లికేషన్లు రాసి చేయూతనిచ్చింది. ప్రజావాణికి మొత్తంగా 184 అర్జీలు రాగా అత్యధికం పింఛన్ల కోసమే ఉన్నాయి. అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో కుందారపు మహేశ్వర్, కలెక్టరేట్ ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

పింఛన్ రావట్లే



విధి మాతో ఆడుకుంటోంది. మనువడు రోహన్(8) పుట్టిన కొద్ది రోజులకే అల్లుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కొడుకు మానసిక పరిస్థితి, అల్లుడి మరణం తట్టుకోలేక కూతురు మతిస్థిమితం కోల్పోయింది. ఉన్న ఒక్కగానొక్క మనవడి కోసం బతుకుతున్నం. పని చేసుకుంటేనే బతుకుడు.. లేకుంటే పస్తులే. మనవడికి సదరం సర్టిఫికెట్‌లో మానసిక వైకల్యం 90శాతం ఉంది. కానీ పింఛన్ రావడం లేదు. కలెక్టరమ్మా దయజూపాలని వచ్చినం.

– రోహన్‌తో లక్ష్మి, ఎల్‌ఎండీ కాలనీ, తిమ్మాపూర్



ఒక కన్ను కనిపించదు.. 30 శాతమని రాశారు

మాది కూలీ కుటుంబం. మా కూతురు 8ఏళ్ల సాహిత్యకు పుట్టిన నుంచి ఒక కన్ను కనిపించదు. మరో కన్ను మసక మసకగా ఉంటుంది. సదరం శిబిరానికి పోతే 30శాతమని రాశారు. ఇదెక్కడి అన్యాయం. అన్ని రకాలుగా పింఛన్‌కు అర్హత ఉన్నా సదరం క్యాంపులో అన్యాయం చేశారు. సదరం మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి న్యాయం చేయాలి.

– బొజ్జ లక్ష్మి, రాగంపేట, చొప్పదండి

స్లాట్ బుక్ అయితలేదు




నా తొమ్మిదేళ్ల మనవడు కార్తీక్.. ఆరేళ్ల మనవరాలు అనన్య పుట్టుకతోనే దివ్యాంగులు. చేతులు వంకరగా, బుద్ధిమాంద్యం ఉంది. సదరం సర్టిఫికెట్ కోసమని మీ సేవకు పోతే స్లాట్ బుక్ అయితలేదు. ఆరు నెలల నుంచి తండ్లాడుతున్నం. పింఛన్ వస్తే పిల్లల చదువులకు ఉపయోగంగా ఉంటుంది.

– కార్తీక్, అనన్యలతో లక్ష్మి, రామకృష్ణకాలనీ

నడవలేడు.. 23 శాతమే వైకల్యం రాశారు



'మా బాబు షాజిద్‌పాషా సరిగ్గా నడవలేడు. మూడో తరగతి చదువుతున్నాడు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. సదరం క్యాంపులో పరీక్షించి ఇంటికే సర్టిఫికెట్ వస్తదని చెప్పారు. తీరా 23శాతం వైకల్యమని సర్టిఫికెట్ పంపారు. మాకు మళ్లీ సదరంలో అవకాశమివ్వాలి' అంటూ కశ్మీర్‌గడ్డకు చెందిన చిత్రంలో కనిపిస్తున్న బాలుడి తండ్రి తన ఆవేదన వ్యక్తం చేశాడు.



దళితబంధు ఇవ్వండి

దళితబంధు రెండో విడత యూనిట్లు త్వరగా మంజూరు చేయాలి. గత ప్రభుత్వంలో ఇస్తామని అకౌంట్లు కూడా కేటాయించారు. మా నియోజకవర్గంలో అత్యధిక మందికి లబ్ధి చేకూరింది. ఇంకా రానివారు వందల్లో ఉన్నారు. అందరికీ లబ్ధి చేకూర్చాలి.

– దళితులు, హుజూరాబాద్ నియోజకవర్గం

క్లుప్తంగా

న్యాయవాదులకు చెస్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ప్రతిమ

కరీంనగర్‌క్రైం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు న్యాయవాదులకు, న్యాయమూర్తులకు కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం న్యాయవాది రఘురామన్ పర్యవేక్షణలో చెస్ పోటీలు నిర్వహించగా జిల్లా జడ్జి బి.ప్రతిమ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం చెస్‌పోటీల్లో న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీవాణి నీరజ, లక్ష్మీ కుమారి, అరుణ, మెజిస్ట్రేట్లు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కరీంనగర్: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనకబడిన తరగతుల సంక్షేమ విద్యాశాఖల ఆధ్వర్యంలో ఇంగ్లిష్ మీడియంలో బోధనతో విజయవంతంగా నడుస్తున్న గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5వతరగతిలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినీవిద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

రహదారి పూడ్చివేతపై ఆందోళన

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే రహదారి పూడ్చివేతపై సోమవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామ శివారులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 30 ఏళ్ల క్రితం హస్నాబాద్, చెర్లపల్లి, చల్‌గల్ గ్రామాల ప్రజలు భక్తులు రహదారిని నిర్మించారు. అయితే దారి పక్కనున్న భూయజమాని రెండురోజుల క్రితం పొక్లెయిన్లు పెట్టి తన వ్యవసాయ భూమితోపాటు రహదారిని కూడా తొలగించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రహదారి వద్దకు వెళ్లి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు అర్బన్ ఆర్‌ఐ రాజేందర్ సంఘటన స్థలానికి చేరుకుని పనులను నిలిపివేయించి విచారణ చేపట్టారు. ఆలయానికి వెళ్లే రహదారిని పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

వెంకట్రావుపల్లిలో వాటర్‌ట్యాంకర్ బోల్తా

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని వెంకట్రావుపల్లి పరిసరాల్లో రోడ్డుపై నీళ్లు పడుతున్న వాటర్ ట్యాంకర్ సోమవారం బోల్తా పడింది. వెంకట్రావుపల్లి పరిసరాల్లో ఫోర్‌లేన్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డుపై పోసిన కంకరపై నీళ్లు చల్లడానికి ట్రాక్టర్ టేలర్‌పై వాటర్‌ట్యాంకర్ అమర్చారు. రోడ్డు చివరిలో కంకర వద్ద ట్రాక్టర్ అదుపు తప్పడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

ఉచిత సేవలు ఉత్తవేనా?

- నిగ్గదీయి లేదా ఫిర్యాదు చేయి
- పెట్రోల్ బంకుల్లో ఈ సేవలుండాల్సిందే
- జిల్లాలోని చాలా చోట్ల కనిపించని సౌకర్యాలు
- పట్టించుకోని అధికారులు

"కరీంనగర్‌కు చెందిన శ్రీధర్ కమాన్‌కు సమీపంలోని ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకునేందుకు వెళ్లాడు. పెట్రోల్ పోసుకుని, బైక్ టైర్‌లో గాలి నింపాలని అక్కడి సిబ్బందిని కోరగా.. ఇక్కడ అలాంటివేమీ ఉండవని, గాలి పంపు పనిచేయడం లేదని సమాధానం ఇచ్చారు. చాలాబంకుల్లో గాలి నింపేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు నగరంలో ఉన్నాయి. గాలే కాదు.. చాలా బంకుల్లో మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు కానరావడం లేదు."

కరీంనగర్ అర్బన్: పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవలకు అనుచితంగా వ్యవహరిస్తున్నారా అయితే ఇది మీ కోసమే. బంకుల్లో టైర్లలో గాలి, తాగునీరు, మూత్రశాలలు, ఫోన్ సౌకర్యం తదితర సేవలు ఉచితం. వీటిపై అవగాహన లేకపోవడంతో డబ్బులు వసూలు చేస్తున్నారు. అసలే పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే అదనపు వ్యయం భారంగా మారుతోంది. చిల్లరే కదా అనుకుంటే నెలకు రూ.కోట్లలోనే సామాన్యుల జేబుకు చిల్లు పడుతోంది.


నగరంలోని ఓ పెట్రోల్ బంకు

మనం చెల్లించే డబ్బులే..

- డీజిల్ అయినా పెట్రోలైనా లీటరుపై మనం పెట్రోలు బంక్‌కు 4 నుంచి 6 పైసలు కేవలం మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ కోసం చెల్లిస్తున్నాం. ప్రతీ బంకులో టాయిలెట్, మంచినీరు, ఎయిర్ ఫ్రీగా అందించాలి. ఇలా అందిస్తేనే పెట్రోల్ బంకు నిర్వహణకు అనుమతి దొరుకుతుంది.
- చాలామంది ప్రయాణంలో ఉన్న వారు టాయిలెట్ అర్జంట్ అయినప్పుడు పబ్లిక్ టాయిలెట్స్ కోసమో.. నిర్మానుష్య ప్రదేశాల కోసమో వెతుకుతారు. కానీ పెట్రోల్ బంకుకు వెళ్లరు. ఇక మీద ఎమర్జెన్సీ టైంలో దర్జాగా బంక్‌లకు వెళ్లండి. అది మన హక్కు
- సగటున ఒక బంకులో రోజుకు 10 వేల లీటర్ల చమురు అమ్మితే.. టాయిలెట్ మెయింటనెన్స్ కాస్ట్ కింద ఆ బంకుకు వచ్చే ఆదాయం రోజుకు రూ.600 అంటే నెలకు రూ.18వేలు. జిల్లాలో ఉన్న అన్ని బంకుల్లో కలిపి వాహనదారులు రోజువారీగా చెల్లిస్తున్న మొత్తం రూ.14లక్షలకు పైనే. ఈ డబ్బుతో టాయిలెట్, మంచినీరు అందించాల్సిన బాధ్యత ఆయా బంక్‌లదే.
- పెట్రోల్ పంపుల వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి ఉండాలి. ఇందుకోసం ఆర్వోయంత్రం, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. ఏ బంకుల్లోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయొచ్చు. స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని పెట్రోలు, డీజిల్ బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉంచాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.
- అత్యవసర పరిస్థితుల్లో చరవాణి వినియోగించుకునే సదుపాయం పంపుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోలు పంపును సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కు అయినా కాల్స్ చేసుకోవచ్చు.
- వాహన టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఓ వ్యక్తిని అందుబాటులో ఉంచాలి. ఈ సౌకర్యం పూర్తిగా ఉచితంగా పొందొచ్చు. ఇటీవల గాలికి ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు.
- ప్రతి బంకులో ఫిర్యాదు పెట్టె లేదా రిజిష్టరు అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రథమ చికిత్స కిట్ సౌకర్యం ప్రతీ బంకు వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది.
- చమురు నాణ్యత, ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోలు, డీజిల్ నాణ్యత, పరిమాణాన్ని తెలుసుకునేందుకు ఫిల్టర్ పేపర్లు అందుబాటులో ఉంచాలి. వాటి ద్వారా నాణ్యతను పరీక్షించుకునే హక్కు మనకు ఉంటుంది
- పెట్రోలు బంకుల్లో సంస్థ పేరు, యజమాని పేరు, సంప్రదింపుల నంబర్లు కచ్చితంగా ఏర్పాటు చేయాలి. పంపు యజమాని వాటిని ప్రజలకు కనిపించే విధంగా బంకుల ఎదుట ఏర్పాటు చేయాలి. పెట్రోలు బంకుల్లో బంకులు తెరిచే, మూసివేసే వేళలు తప్పనిసరిగా రాసి ఉంచాలి. పెట్రోలు, డీజిల్ తీసుకున్న తరువాత వినియోగదారులు వాటికి సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా పొందాలి.

జిల్లాలో పెట్రోల్ బంకులు: 82	
రోజు పెట్రోల్ వినియోగం: 1.20లక్షల లీటర్లు	
నిత్యం డీజిల్ వాడకం	: 1.80లక్షల లీటర్లు
ద్విచక్ర వాహనాల సంఖ్య: 1.45లక్షలు	
మూడు, నాలుగు చక్రాల వాహనాలు: 88వేలు	

ఇలా ఫిర్యాదు చేయండి

పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు అందించాల్సిన సౌకర్యాలను నిర్వాహకులు విస్మరిస్తే సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్‌ను సంప్రదించడం ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. బంకులో కచ్చితంగా ఉండాల్సిన ఫిర్యాదు రిజిష్టరులో లిఖితపూర్వకంగా ఫిర్యాదు నమోదు చేయొచ్చు. లేదంటే సంబంధిత చమురు సంస్థ సేల్స్ మేనేజర్ పేరు, చరవాణి నంబర్లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఇవన్నీ అందుబాటులో లేనట్లైతే సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు.

నిందితులను త్వరలో పట్టుకుంటాం

- కరీనంగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు
- ఎస్సారెస్పీ కార్యాలయం సందర్శన
- ఆఫీస్‌లో పనిచేయని సీసీ కెమెరాలు


ఎస్ఈ శివకుమార్‌తో మాట్లాడుతున్న ఏసీపీ

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ నీటి పారుదలశాఖ డివిజన్ 5 కార్యాలయాన్ని కరీనంగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు సోమవారం సందర్శించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని అన్నారు. కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన చోరీపై సీఐ స్వామి, ఎస్సై చేరాలుతో కలిసి విచారణ చేశారు. నాలుగు సీపీయూలు, ఐదు మానిటర్లు, రెండు ప్రింటర్లు ఎత్తుకెళ్లినట్లు వాచ్‌మెన్ కనకయ్య ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు కార్యాలయానికి చేరుకున్న ఎస్సై చేరాలు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. సోమవారం క్లూస్‌టీం పిలిపించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. కార్యాలయం ఆవరణలో రెండు సీసీ కెమెరాలు ఉన్నా చాలాకాలంగా పనిచేయడం లేదని చోరీపై ఎస్ఈ శివకుమార్‌తో మాట్లాడామని తెలిపారు. కంప్యూటర్లలో విలువైన డేటా ఉందని దానికి సంబంధించిన హార్డ్ కాపీలు తమ వద్ద ఉన్నాయని, పెద్దగా నష్టం లేదని చెప్పారని, అయినా ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని వివరించారు. క్లూస్ టీం ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. కంప్యూటర్లు చోరీ చేసినా డేటా పోలేదని ఈఈ నాగభూషణం తెలిపారు. కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆయన వివరణ ఇచ్చారు.

అల్ఫోర్స్‌లో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబురాల్లో విద్యార్థులు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

జగిత్యాల: ప్రేమ ఆప్యాయత పంచే పండగ సంక్రాంతి అని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కృష్ణానగర్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ ద్వారా సంప్రదాయాల పరిరక్షణ, సందేశాలు అందించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మల్యాలలో

మల్యాల: మల్యాల మండలంలోని అల్ఫోర్స్ టెక్నో స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను సంస్థ అధినేత నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాకీ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి: జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఖ్యాతి లభిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో నాలుగో తరగతి చదివే కతిక్ పటేల్ జాయతీస్థాయి హాకీ పోటీలకు ఎంపిక కాగా.. సోమవారం విద్యార్థిని అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి రాజస్థాన్‌లో జరిగే జాతీయపోటీలకు ఎంపిక అయినట్లు వివరించారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

యూరియా పంపిణీలో చేతివాటం

- బస్తాకు రూ.9 అదనంగా వసూలు
- ఆందోళనకు దిగిన రైతులు
- వెంటనే రూ.6 తగ్గించి విక్రయాలు


యూరియా లారీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు యూరియాను విక్రయించడంలో సంఘం ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించారు. బస్తాకు రూ.9 పెంచి విక్రయించడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో అప్పటికప్పుడే రూ.6 తగ్గించి అమ్మకాలు సాగించారు. ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో ఆధ్వర్యంలో బండలింగంపల్లిలో సోమవారం ఒక లారీలో 450 యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేయడానికి తీసుకెళ్లారు. సమీప ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో ఒక బస్తాకు రూ.267 విక్రయిస్తుంటే.. బండలింగంపల్లిలో రూ.276 వసూలు చేయడంపై రైతులు ఆందోళనకు దిగారు. దీంతో వెంటనే రూ.270 విక్రయించారు. ఈ విషయంపై సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి వివరణ కోరగా.. నిరాధారమైన ఆరోపణ మాత్రమేనన్నారు. బండలింగంపల్లికి క్లస్టర్ పాయింట్ లేకపోవడంతో లారీలకు అదనపు రవాణా చార్జీల కోసం బస్తాకు రూ.3 చొప్పున మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకంటే ఎక్కువగా రైతుల నుంచి వసూలు చేస్తే సదరు ఉద్యోగిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుమ్మరిగుట్ట తవ్వకాలపై పరిశీలన


కుమ్మరిగుట్ట తవ్విన ప్రాంతం

జగిత్యాలక్రైం:జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి శివారులోని కుమ్మరిగుట్ట అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారి సుదర్శన్ సోమవారం పరిశీలించారు. సోమన్‌పల్లి శివారులోని కుమ్మరిగుట్టను కొంతమంది జేసీబీ యజమానులు కొద్దికాలంగా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో గ్రామస్తులు మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. మైనింగ్ అధికారి సుదర్శన్ అక్కడకు చేరుకునేసరికి జేసీబీతోపాటు, ట్రాక్టర్లతో పరారీ అయ్యారు. అక్కడ జరిగిన తవ్వకాలను మైనింగ్ అధికారులు పూర్తిగా పరిశీలించి వచ్చారు.

గల్ఫ్‌లో గుండెపోటుతో చందుర్తి వాసి మృతి


నాగయ్య(ఫైల్)

చందుర్తి(వేములవాడ): జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మరణించిన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో సోమవారం విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి నాగయ్య ఉరఫ్ కైరా నాగయ్య(56) జీవనోపాధి కోసం సౌదీ అరేబియాకు గత 20 ఏళ్లుగా వెళ్లి వస్తున్నారు. రెండేళ్ల క్రితమే స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. సౌదీలోనే 15 రోజుల క్రితం పనిచేసే చోటే చాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుని భార్య 15 ఏళ్ల క్రితమే మృతిచెందగా, ముగ్గురు కుమారులు ఉన్నారు.

గోదావరి నదిలో మృతదేహం

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడ శివారులోని గోదావరినదిలో సోమవారం పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సంతోష్‌కుమార్ సోమవారం తెలిపారు. మృతుడి వయసు సుమారు 40–45 మధ్య ఉంటుందని, నీలిరంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించాడని, మెడలో నల్లటి తాయత్తు ఉందన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. సంబంధీకులు ఎస్సై సెల్ నంబరు 87126 56527, సీఐ సెల్‌నంబరు 87126 56524లో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ మైనింగ్ సర్దార్ మృతి


మచ్చ రమేశ్ (ఫైల్)

గోదావరిఖని: సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా కాజీపేట–2 గనిలో పనిచేస్తున్న మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ (37) గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. డిసెంబర్ 22న కాజీపేట–2గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన రమేశ్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే, కాలి విరిగినట్లు గుర్తించిన వైద్యులు.. ఎక్సరే తీస్తుండగా రమేశ్ అకస్మాత్తుగా మృతి చెందారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే మైనింగ్ సర్దార్ రమేశ్ మృతి చెందాడని సీఐటీయూ నాయకుడు మెండే శ్రీనివాస్ ఆరోపించారు. ఈ ఘటనపై ఏసీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా లంగ్స్‌లో బ్లడ్‌క్లాట్ కావడంతో అకస్మాత్తుగా మృతి చెందారన్నారు. పోస్ట్ కోవిడ్‌తో ఈ సంఘటన జరిగి ఉండవచ్చునని వివరించారు.

గాయపడిన యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్: అప్పన్నపేట వద్ద ఈనెల 6న జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డ కనుకుంట్ల రాజేశ్(18) చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. పెద్దపల్లి మండలం దేవునిపల్లికి చెందిన రాజేశ్.. తన సోదరి హారికను అప్పన్నపేటలో దింపేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 8 తులాల వెండి చోరీ

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన గంజి నర్మద ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. బుగ్గారం మండలం గొపులాపూర్ గ్రామానికి చెందిన నర్మద హనుమాన్‌వాడలో అద్దెకుంటోంది. ఈనెల 6న ఇంటికి తాళం వేసి గోపులాపూర్ గ్రామానికి వెళ్లింది. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 8 తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహమాన్ తెలిపారు.

లింక్ క్లిక్ చేయగానే డబ్బులు విత్‌డ్రా

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎలుపుల బాపు సైబర్ వలలో చిక్కుకొని డబ్బులు పోగొట్టుకున్నాడు. 9440051827 నంబర్ నుంచి వచ్చిన లింక్‌ను బాపు ఓపెన్ చేయగానే వెంటనే రూ. 18 వేలు డ్రా అయినట్లు ఎస్ఎంఎస్ వచ్చింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు కేసు బదిలీ చేశామని పోలీసులు తెలిపారు.

సత్తక్కపల్లి శివారులో చిరుత..?

- పాదముద్రలు గుర్తించిన రైతులు
- అటవీశాఖకు సమాచారమిచ్చిన అన్నదాతలు
- హైనా పాదముద్రలని అనుమానిస్తున్న అధికారులు


శివారు పంటపొలాల్లో పాదముద్రలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారు ఉసికె గుట్ట అటవీ ప్రాంతం సమీపంలో చిరుతపులి పాదముద్రలను రైతులు గుర్తించారు. సోమవారం గ్రామానికి చెందిన ఓ రైతు మొక్కజొన్న చేనులోకి వెళ్లగా.. అక్కడ చిరుతపులి పాదముద్రలు కనిపించాయని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆ ప్రాంతానికి చేరుకున్న అధికారులు పాదముద్రలను పరిశీలించారు. అవి చిరుతపులి పాదాలు కావని, హైనా(తోడేలు) పాదముద్రలు అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ ప్రాంతం వైపు హైనా లేకపోవడం, కొంత చిరుతపులి సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్న అధికారులు.. మరుసటిరోజు మరోమారు పాదముద్రలను పరిశీలిస్తామని అధికారులు రైతులకు చెప్పారు. అటవీ పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా పెడుతామని ప్రజలు భయాందోళనకు గురికావొద్దని సూచించారు. ఇక్కడ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హఫీజొద్దీన్, బీట్ ఆఫీసర్ శివరాజ్, సిబ్బంది గణేశ్ ఉన్నారు.

పొలంలో కరెంట్ తీగలు అమర్చిన వ్యక్తి అరెస్ట్

- చందుర్తి సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి(వేములవాడ): పంటక్షేత్రంలో అక్రమంగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ఒకరికి గాయాలు కావడానికి కారణమైన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని రామన్నపేటకు చెందిన రైతు తిప్పని రాజయ్య పొలం వద్ద వన్యప్రాణులతో పంట పొలం దెబ్బతింటుందని విద్యుత్ తీగలతో కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన బెంద్రం నరసింహారెడ్డి ఉరఫ్ నవీన్‌రెడ్డితోపాటు ఆయన భార్య వర్షిణిలు డిసెంబర్ 25న వరినారు కోసం రాజయ్య పొలం వద్దకు వెళ్తుండగా విద్యుత్ తీగలు తగిలి నరసింహరెడ్డి అక్కడే పడిపోయాడు. అప్రమత్తమైన ఆయన భార్య వర్షిణి అక్కడే ఉన్న మరో రైతు చింతల దేవయ్యతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపి వేయించింది. అప్పటికే విద్యుత్‌షాక్‌తో కాళ్లకు తీవ్ర గాయాలై కిందపడి పోయిన నరసింహారెడ్డి స్థానికుల సహాయంతో గ్రామానికి తీసుకొచ్చి, 108 అంబులెన్స్‌లో వేములవాడకు తరలించారు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి.. బాధ్యుడైన తిప్పని రాజయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చినట్లు తెలిస్తే వారిపై పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. చందుర్తి ఇన్‌చార్జి ఎస్సై రాజేశ్, సిబ్బంది ఉన్నారు.

కన్నబిడ్డను చూడకుండానే..

- కన్నుమూసిన మాతృమూర్తి
- మాతృత్వాన్ని ఆస్వాదించకుండానే మృతిచెందిన బాలింత
- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు


పద్మ(ఫైల్)


వేములవాడ పరిధిలోని నాంపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతురాలు బంధువులు

వేములవాడఅర్బన్: మాతృత్వం కోసం ఆ తల్లి కోటి కలలు కన్నది. దాదాపు 18 ఏళ్ల నిరీక్షణ అనంతరం గర్భవతి కావడంతో మురిసిపోయింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఆ మాతృమూర్తి కన్నబిడ్డను చూడకుండానే కన్నుమూసింది. ఈ సంఘటన వేములవాడలోని నాంపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన చేకూట తిరుపతికి బావుసాయిపేటకు చెందిన పద్మ(35)కు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. చాలా ఏళ్ల తర్వాత గర్భం దాల్చడంతో వేములవాడ మున్సిపల్ పరిధి గల నాంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతీ నెల వైద్యసేవలు పొందింది. ఇందులో భాగంగానే ప్రసూతి కోసం ఆదివారం ఆస్పత్రికి చేరుకుంది. సోమవారం ఉదయం ఆపరేషన్ చేయడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కొంత సమయానికి ఆమె పరిస్థితి విషమిస్తుందని వైద్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్ తీసుకెళ్లగా.. అక్కడికి చేరుకో గానే ఆమె మృతిచెందింది. దీంతో ఆమె బంధువులు నాంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ ఘటనపై వేములవాడ పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం


మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కొండగట్టు(చొప్పదండి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాలేదని కార్యకర్తలు అధైర్యపడొద్దని, పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ మేనేని స్వర్ణలత, నాయకులు మేనేని రాజనర్సింగరావు, శ్రీనివాస్, సింగిరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ


రాజన్న ప్రసాదం అందిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ: రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్నను ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పి.గౌతమి దర్శించుకున్నారు. స్వామివారికి కోడెమొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

రాంచందర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రాంచందర్

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌కు చెందిన టి.రాంచందర్ ఫార్మసుటికల్ సైన్సెస్ విభాగంలో జేఎన్‌టీయూ యూనివర్సిటీ హైదరాబాద్‌లో డాక్టరేట్ అందుకున్నారు. గైడ్ డాక్టర్ ఏవీ జీతన్ పర్యవేక్షణలో రాంచందర్ డెవలప్‌మెంట్ అండ్ అవాల్యువేషన్ ఆఫ్ నావల్ సిరమ్ స్టేబుల్ లాంగ్ సర్క్యులేటింగ్ పాలిమారిక్ నానోపాటికల్స్ ఫర్ సమ్ ఆంటీ కేన్సర్ డ్రగ్ అంశంపై పరిశీలన చేసి సమర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్ట నర్సింహారెడ్డి, ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమ్‌నాథ్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

రజకుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

కరీంనగర్‌రూరల్: రజకుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కేటాయించాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ కోరారు. సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రజక వృత్తిదారులకు ఉచిత విద్యుత్ బిల్లుల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బకాయి ఉన్న రూ.79.80కోట్ల రజక, నాయీ బ్రాహ్మణుల ఉచిత విద్యుత్ బిల్లులు చెల్లించిన సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనపర్తి శంకర్, ఆర్గనైజర్లు పొన్నాల తిరుపతి, కాల్వ మల్లేశం, శంకర్, బాల పోచయ్య, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గుండేటి మల్లీశ్వరీ, అర్చన తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని మంకమ్మతోటలో గల నిరుపేదలకు సోమవారం సుఫీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆరు నెలలుగా ప్రతీనెల పదిహేను కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రియాసత్ అలీ, మహ్మద్ అక్బర్, సాజిద్, ఖదీర్, నయూం తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు వార్తలు పోస్ట్ చేసిన వారిపై చర్య తీసుకోవాలి'

కరీంనగర్‌కార్పొరేషన్: సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు పోస్టు చేసిన వారిపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం టూటౌన్ సీఐకి వారు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేస్తే, ఆ ఫొటోను వాడుకొని సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేశారంటూ తప్పుడు వార్తలను పోస్టు చేశారని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే ఇలాంటి తప్పుడు పోస్టులు పెట్టిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు సమద్ నవాబ్, శ్రవణ్‌నాయక్, కొరివి అరుణ్‌కుమార్, ఖమ్రోద్దిన్, ముక్క భాస్కర్, షేక్ శౌహెన్షా, అష్రఫ్ తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో రాజారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల్లోని వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో 12,260 మంది ప్రజాపాలన కార్యక్రమంలో వివిధ రకాల దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజని, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయాధికారి రాజు తనిఖీ చేశారు. ఈసందర్భంగా నాణ్యతా ప్రమాణాలను పరిశీలించడానికి ఎరువులతో పాటు పురుగు మందుల శాంపిళ్లు తీసుకున్నారు. కొనుగోలు చేసినవాటి రశీదులను రైతులకు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు ఎరువులు, పురుగుమందుల వివరాల బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న బాలురు, బాలికలు



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని మానేరు విద్యాసంస్థల్లో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. పాఠశాలకు చెందిన బాలురు సైతం బాలికలతో పోటీపడి ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ప్రారంభించగా..డైరెక్టర్ కడారి సునీతరెడ్డితో పాటు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో రంగోలి పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతీ విద్యార్థికి బహుమతి అందజేశారు. వాసవీ కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు నలుమాచు మనోహర్, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ జంధ్యం మాధవి, 46వ డివిజన్ కార్పొరేటర్ వంగల శ్రీదేవి, డెర్మటాలజిస్ట్ డాక్టర్ ఎర్రం శ్రీలత, క్లబ్ బాధ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేట్‌తో నిత్యం తిప్పలే..



కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లిలో గల రైల్వే గేట్‌తో నిత్యం తిప్పలు తప్పడం లేదు. సోమవారం ఉదయం 11గంటలకు రైలురావడంతో గేట్ వేసిన అనంతరం సిబ్బంది తొలగించారు. అయితే రెండు వైపుల నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారులు గేటుప్రాంతంలో ఒకేరోడ్డులోకి ప్రవేశించడంతో దాదాపు అరగంటపాటు ట్రాఫిక్‌జాం ఏర్పడింది. అటు కరీంనగర్‌వైపు అపోలో ఆస్పత్రి, ఇటు తీగలగుట్టపల్లి వైపు మాణికేశ్వరి ఆలయం వరకు వాహనాలు బారులు తీరాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు ద్విచక్రవాహనాలు ఒకేవైపు ప్రవేశించకుండా రోడ్డు మధ్య డివైడర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – కరీంనగర్‌రూరల్

ఆమెకు 'భరోసా'

- అతివలకు అండగా కరీంనగర్ భరోసా కేంద్రం
- బాలికలు, మహిళలకు సత్వర న్యాయం
- స్నేహపూర్వక వాతావరణంలో అవగాహన
- ప్రత్యేకంగా మహిళలకు నాలుగు పోస్టులు



కొత్తపల్లి మండలంలో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం

కరీంనగర్‌క్రైం/కొత్తపల్లి: వేధింపులకు గురైన చిన్నపిల్లలు, మహిళలకు కరీంనగర్ భరోసా కేంద్రం అండగా నిలువనుంది. అన్యాయానికి గురైన వారిని అక్కున చేర్చుకోనుంది. సత్వర న్యాయం అందేలా రక్షణ చర్యలు తీసుకోనుంది. మానసికంగా కుంగిపోయిన వారిలో మనోధైర్యం నింపనుంది. మహిళలకు కొండంత అండగా నిలిచేలా కరీంనగర్‌లోని కొత్తపల్లి మండలంలో గతంలో భరోసా కేంద్రం నిర్మించగా.. ప్రస్తుతం నియామకాలు చేపడుతున్నారు. రాష్ట్ర విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో కరీంనగర్ పోలీసులతో నిర్వహించే భరోసా కేంద్రాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

మహిళల భద్రతే ధ్యేయంగా

- మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇప్పటికే కరీంనగర్‌లో షీటీంలు మహిళల భద్రతకు అద్భుతంగా పనిచేస్తుండగా.. భరోసా కేంద్రం ద్వారా మరింత అండగా నిలవనుంది.
- మహిళలపై జరిగే హింసలకు వ్యతిరేకంగా పోరాడేందుకు భరోసా కేంద్రం వైద్య, చట్టపరమైన, మానసిక, కౌన్సెలింగ్ మద్దతుతో అత్యవసర, నాన్-ఎమర్జెన్సీ యాక్సెస్ సేవలు సులభతరం చేస్తుంది.
- కరీంనగర్ పోలీసుల ఆధ్వర్యంలో అత్యాధునిక హంగులతో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న కేంద్రానికి 2022 డిసెంబర్ 17న భూమిపూజ చేశారు. రూ.1.7 కోట్లతో 13 గుంటల్లో భవనాన్ని నిర్మించారు.
- బాధిత మహిళలతో స్నేహపూర్వకంగా వ్యవహరించేందుకు శిక్షణ పొందిన మహిళలను నియమిస్తున్నారు. అన్యాయం, అత్యాచారం, గృహహింస, వేధింపులు, మోసానికి గురైన బాలికలకు మానసికంగా ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందించేందుకు ఈ భద్రత సెంటర్ ఉపయోగపడనుంది.
- వయస్సు, తరగతి, కులం, విద్యాస్థితి, వైవాహిక స్థితి, జాతి, సంస్కృతితో సంబంధం లేకుండా శారీరక, లైంగిక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక వేధింపులను ఎదుర్కొంటున్న స్త్రీలకు మద్దతు ఇవ్వడంతో పాటు వారి సమస్యలకు ఈ కేంద్రంలో పరిష్కారం లభించనుంది.
- లైంగిక వేధింపులు, గృహహింస, అక్రమరవాణా, గౌరవ సంబంధిత నేరాలు, యాసిడ్ దాడులు వంటి హింసను ఎదుర్కొంటున్న బాధిత మహిళలకు ప్రత్యేక సేవలు అందిచనున్నారు.
- భరోసా కేంద్రం ద్వారా పోలీస్, మెడికల్, లీగల్ ప్రాసిక్యూషన్ సర్వీసెస్‌తో పాటు సైకో థెరప్యూటిక్ కౌన్సెలింగ్ ద్వారా సమీకృతసాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళా సిబ్బంది

విమెన్ సేఫ్టీవింగ్ ఆదేశాలతో కరీంనగర్ భరోసా కేంద్రంలో సర్వీస్ రెగ్యులరైజేషన్ హక్కులు లేకుండా ఏడాది కాలపరిమితితో ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని సీపీ అభిషేక్ మహంతి సూచించారు. ఇందులో కాంట్రాక్ట్ పద్ధతిన నియామకానికి నాలుగు పోస్టులు మహిళల కోసం కేటాయించబడ్డాయి. కౌన్సిలర్ కం సెంటర్ కో- ఆర్డినేటర్, లీగల్ సపోర్టింగ్ పర్సన్, సపోర్టు పర్సన్, ఏఎన్‌ఎంలుగా పనిచేసేందుకు అర్హత కలిగిన మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. త్వరలోనే నియామకాలు పూర్తిచేసి భరోసా కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ?



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

కరీంనగర్ కల్చరల్: నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉండే తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడికి తరలించారో అంతుపట్టడం లేదని, అక్కడే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు మాజీ ఎంపీ చొక్కారావు విగ్రహం అక్కడే ఉండేదని, ఆయన విగ్రహం మున్సిపల్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో ఉంచారని, తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడుందో అంతు చిక్కడం లేదని, ఆంధ్రా అధికారులకు తెలంగాణ తల్లి విగ్రహం అంటే గౌరవం లేదన్నారు. ఇందిరా, తెలంగాణ తల్లి విగ్రహాల పనులు ఒకేరోజు ప్రారంభం కాగా.. ఇందిరా గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారని, తెలంగాణ తల్లి విగ్రహం పనులు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. అధికారులు త్వరగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, లేకుంటే తామే ఏర్పాటు చేసుకుంటామని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, తిరుపతి, చంద్రశేఖర్ యాదవ్, తివారి, తుల భాస్కరరావు, జయంత్ పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీటీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో

కరీంనగర్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ(ఆర్‌యూపీపీటీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను డీఈవో జనార్దన్‌రావు సోమవారం డీసీఈబీ కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందింపజేయాలని, రాబోయే పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌యూపీపీటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నెరువట్ల చైతన్య, నేవూరి కరుణాకర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఎండీ ఉమర్ అలీ, ఆంజనేయులు, శ్రీనివాస జియ్యంగార్, గంగారాం, శ్యాంసుందర్, సునీత, సుజాత, ఎండీ అబ్దుల్‌అలీ, శారద, కన్నయ్య, హేమలత, రేణుక, భూపేందర్ కౌర్, శ్రీనివాస్, విలాసాగరం రవీందర్, చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందిని మార్చాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సంవత్సరాలుగా ఒకే డివిజన్‌లలో పనిచేస్తున్న పారిశుధ్య జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులను ఇతర డివిజన్‌లకు మార్చాలని కాంగ్రెస్‌నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా అదే డివిజన్‌లలో పాతుకుపోవడంతో పారిశుధ్య సిబ్బంది పక్కదారి పడుతున్నారని తెలిపారు. ఒక డివిజన్ నుంచి మరో డివిజన్‌కు మార్చడం వల్ల వారి గుత్తాధిపత్యం తగ్గుతుందని, పారిశుధ్యం మెరుగు పడుతుందని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రెహమాన్, మహ్మద్ అమీర్, మహ్మద్ ఇమ్రాన్, సిరిపురం నాగరాజు, కలీం ఉన్నారు.

నిర్మాణాలకు అనుగుణంగా ఉత్పత్తులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న శ్యాంప్రకాశ్

కరీంనగర్‌రూరల్: మార్కెట్‌లో నిర్మాణాలకు అనుగుణంగా సిమెంట్ ఉత్పత్తులు చేస్తున్నట్లు నాగార్జున సిమెంట్ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ శ్యాంప్రకాశ్ తెలిపారు. సోమవారం రాత్రి కరీంనగర్‌లో డీలర్లకు నిర్వహించిన అవగాహన సమావేశం మాట్లాడారు. కంపెనీ నూతనంగా ఉత్పత్తి చేసిన స్టీల్ కాంక్రీట్, విశిష్ట సిమెంట్ ఉత్పత్తులను విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానంగా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఆనంతరం డీలర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సీనియర్ డీజీఎం బస్వరాజు, సీనియర్ మేనేజర్ నరేందర్ రెడ్డి, మేనేజర్ మోహన్‌రెడ్డి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

'యూనిటీ కప్ 2024' పోస్టర్ ఆవిష్కరణ




పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ నరేందర్

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ క్రికెట్ క్లబ్, సూఫ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి ప్రారంభం కానున్న యూనిటీ కప్ 2024 సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను సోమవారం కరీంనగర్ ఏసీపీ నరేందర్ జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో క్రికెట్‌కు ఉన్న క్రేజీ మరే ఇతర క్రీడలకు లేదన్నారు. జిల్లాలో క్రికెట్లో అద్భుతమైన క్రీడాకారులు ఉన్నారని, భవిష్యత్‌లో రంజీ, భారత జట్టుకు జిల్లా క్రీడాకారులు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. యువతలో ఉన్న టాలెంట్‌ను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు దోహదపడతాయన్నారు. 2023-24 క్రీడా సంవత్సరంలో పలు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు జిల్లా కేంద్రంగా మారిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మెరికలాంటి క్రీడాకారులను వెలికి తీసే ప్రయత్నం చేస్తున్న కరీంనగర్ క్రికెట్ క్లబ్ నిర్వాహకులను అభినందించారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ గతంలో క్లబ్ ఆధ్వర్యంలో పలు టోర్నమెంట్‌లు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. విజేతలుగా నిలిచిన జట్లకు ప్రథమ బహుమతి రూ.71,000 , ద్వితీయ రూ.31,000 అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు రూ.5వేలు ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెటా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శులు పుల్లమల్ల ప్రసాద్, చీఫ్ కోచ్ సురేష్, నిర్వాహకులు సిద్ధార్థరెడ్డి, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జమ్మికుంట: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు రికవరీ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో టౌన్ సీఐ బార్పటి రమేశ్ బాధితుడికి అప్పగించారు. మున్సిపల్ పరిధి పాత సిటీకేబుల్ లైన్‌కు చెందిన వెంకట్‌రావు నిత్యావసర సరుకుల కొనుగోలుకు ఓ కిరాణం షాపుకు వెళ్లి రూ.15వేలు విలువ చేసే సెల్‌ఫోన్‌ను మరిచిపోయాడు. ఇంటికెళ్లి మళ్లీ షాపు వద్దకు వచ్చి వెతకగా సెల్‌పోన్ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి హైదరాబాద్‌లోని శామీర్‌పేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి ఫోన్ రికవరీ చేశారు. ఈసందర్భంగా బాధితుడు పోలీసులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో చేపట్టిన విద్యుత్ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు 33కేవీ టవర్స్ వర్క్, 11కేవీ వెంకటసాయి ఫీడర్‌లోని లక్ష్మీనగర్ ప్రభావిత ప్రాంతాలు, మీఎస్‌ఎల్ కాంప్లెక్స్, వాసవికాలనీ, రాఘవేంద్ర నగర్, వందన అపార్ట్‌మెంట్స్, స్కాలర్స్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'బంధుప్రీతి లేకుంటే సునీల్‌రావు మేయర్ ఎలా అయ్యాడు'

కరీంనగర్‌టౌన్: బంధుప్రీతి లేకుంటే సునీల్‌రావు మేయర్ ఎలా అయ్యాడో చెప్పాలని, కరీంనగర్ కార్పొరేషన్‌లో అవినీతి ఎలా రాజ్యమేలుతుందో స్పష్టం చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌కు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ సోమవారం సవాల్ విసిరారు. విద్యుత్‌శాఖలో అక్రమ ఉద్యోగ నియామకానికి సంబంధించి వినోద్ కుమార్ ప్రమేయమే లేకుంటే ఉలికిపాటు దేనికని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమ నియామకాన్ని, లోపాల వ్యవస్థను ఎందుకు ఖండించడం లేదని విమర్శించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో గత నాలుగేళ్లుగా అక్రమ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలకు సంబంధించి, స్మార్ట్‌సిటీలో జరిగిన అవినీతి అక్రమాల లెక్కను తేలుస్తామని ప్రజాకోర్టులో వినోద్ కుమార్‌ను దోషిగా నిలబెట్టే బాధ్యత భారతీయ జనతా పార్టీ తీసుకుంటుందని అన్నారు.

'అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి'

కరీంనగర్: బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల వార్డెన్‌ల అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేశ్‌గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల వార్డెన్లను ఇతర జిల్లాలకు డిప్యూటేషన్ల పేరిట పంపించి, వేరే ప్రాంతాల వారికి అదనపు బాధ్యతలు అప్పగించడాన్ని ఖండించారు. ఉన్నత అధికారులు ఈ చర్యలకు పాల్పడడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించి, విచారణ జరిపించి కరీంనగర్ నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన వార్డెన్లను తిరిగి కరీంనగర్‌కు రప్పించి, అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వార్డెన్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 10న బీసీ సంక్షేమ కార్యాలయం ఎదుట బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



వైష్ణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని బుర్ర వైష్ణవి అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైంది. గతేడాది డిసెంబర్ 23 నుంచి 25వ తేదీ వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సాఫ్ట్‌బాల్ పోటీలలో కరీంనగర్ జిల్లా జట్టు తరుపున పోటీలకు ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, పీడీ కొమురోజు కృష్ణ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. తల్లిదండ్రులు బుర్ర రవి, లావణ్యను అభినందించారు.

గురివింద.. గుంజీలు

విజయవాడ ఈనాడు కార్యాలయాన్ని ఖాళీ చేసిన రామోజీ

- ఎట్టకేలకు యజమాని వల్లూరి రామకృష్ణ చేతికి స్థలం
- 40 ఏళ్లుగా పత్రిక పేరుతో నామమాత్రపు లీజుకే మూడెకరాలు
- రహదారి విస్తరణకు 20 ఏళ్లపాటు రాజ గురువు అడ్డంకులు
- లీజు ముగిసి పదేళ్లు దాటినా ఖాళీ చేయకుండా గురివింద తిష్ట
- ఎన్‌హెచ్ విస్తరణ పరిహారం టీడీఆర్ తనకే ఇవ్వాలని వివాదం
- ఎట్టకేలకు న్యాయస్థానం తీర్పుతో యజమానికి భూమి అప్పగించి పలాయనం
- విశాఖలోనూ ఇదే తరహాలో 'భూమోజీ' భూ అక్రమాలు



సాక్షి, అమరావతి: ఇరుకు రోడ్లతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఈనాడు యజమాని ఓ సంఘ సంస్కర్తలా వార్తలు అచ్చేస్తుంటారు!

...విజయవాడలో అత్యంత రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్ లో రహదారి విస్తరణను రామోజీరావు 20 ఏళ్లు అడ్డుకున్నారు.

- ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను కబ్జా చేస్తున్నారు..! సామాన్యులు హడలిపోతున్నారంటూ ఈనాడు ఎక్కడలేని ఆవేదన వెళ్లగక్కుతుంది..
- బెజవాడ బెంజ్ సర్కిల్ వద్ద అత్యంత విలువైన మూడెకరాల భూమిని లీజు ముగిసినా పదేళ్ల పాటు ఖాళీ చేయకుండా స్థలం యజమానిని రామోజీ తీవ్రంగా వేధించారు.
- ఒకరికి దక్కాల్సిన నష్ట పరిహారాన్ని మరొకరు కాజేస్తున్నారంటూ ఈనాడు వాపోతుంది!
- రహదారి విస్తరణకు భూమి తీసుకుంటే అందుకు నష్ట పరిహారంగా ఇచ్చే టీడీఆర్ బాండ్లను భూ యజమానికి కాకుండా తనకే ఇవ్వాలంటూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు రామోజీ నోటీసులు పంపుతారు. వ్యవస్థలు, వ్యక్తులు, ప్రభుత్వాలను అడ్డు పెట్టుకుంటారు. దీన్ని ఎవరైనా ప్రశ్నిస్తే అది పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ తన అక్రమాలకు పాత్రికేయం ముసుగు వేస్తారు.
- మానవత్వం, బంధుత్వాలకు అర్థం తెలియని చెరుకూరి రామోజీరావు ఓ మనిషి ఎలా ఉండకూడదో చెప్పేందుకు నిలువెత్తు నిదర్శనం! నిజం నిలకడ మీద తేలుతుంది. ఇన్నాళ్లకైనా ఆయనో కబ్జాదారు అని నిగ్గు తేలింది. ఇతరుల సొమ్మును అప్పనంగా కాజేసే దోపిడీదారుడని తేటతెల్లమైంది. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే సైంధవుడని నిరూపితమైంది. ఎట్టకేలకు రామోజీ పాపం పండటంతో విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో తాను కబ్జా చేసిన దాదాపు మూడెకరాల భూమిని ఖాళీ చేశారు. కొన్నేళ్ల క్రితం తన కబ్జాలో ఉన్న విశాఖ ఈనాడు కార్యాలయం భూమిని అసలు యజమానికి అప్పగించిన రాజ గురివింద ఇప్పుడు విజయవాడలోని స్థలాన్ని కూడా భూ యజమానికి అప్పగించి చిత్తగించారు. ఆ స్థలాన్ని ఖాళీ చేస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేసి మరీ బయటకు వెళ్లాల్సి వచ్చింది. అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్న సత్యం మరోసారి రుజువైంది.

లీజు స్థలాన్ని కబ్జా చేసి..

విజయవాడలో అత్యంత రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్ సమీపంలో దాదాపు 3 ఎకరాల్లో ఉన్న భవనం అది. చూడగానే అరె.. ఇది ఈనాడు ఆఫీసే కదా అనుకోవడం సహజం! ఎందుకంటే 40 ఏళ్లకుపైగా అది అలాగే చెలామణి అవుతోంది మరి. ఈనాడు కార్యాలయంగా, రామోజీరావు ఆస్తిగా ముద్ర పడిపోయింది. కానీ వాస్తవం ఏమిటంటే... ఇప్పుడే కాదు అది ఎప్పుడూ ఈనాడు సొంత స్థలం కాదు. కబ్జా ముసుగులో చెరుకూరి రామోజీ చెరబట్టిన స్థలం అది. దాదాపు 3 ఎకరాల్లో ఉన్న ఆ భూమి అసలైన యజమాని వల్లూరి రామకృష్ణ. ఆయన ఆ భూమిని రెండు భాగాలుగా 1980లో రామోజీకి లీజుకిచ్చారు. రామోజీ తన తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు ద్వారా వల్లూరి రామకృష్ణను సంప్రదించి ఆ భూమిని 30 ఏళ్ల లీజుకు తీసుకున్నారు. ప్రస్తుతం రూ.వందల కోట్ల మార్కెట్ విలువ ఉన్న భూమిని కేవలం వందల రూపాయలకే లీజుకు దక్కించుకున్నారు. అందులో 1.80 ఎకరాల విస్తీర్ణంలో ఈనాడు కార్యాలయ భవనాన్ని నిర్మించుకున్నారు. ఆ విధంగా ఆ భూమిని గుప్పిట పట్టిన తరువాత రామోజీ తన నిజ స్వరూపాన్ని ప్రదర్శించారు. భూ యజమానులను ముప్పు తిప్పలు పెట్టారు. విజయవాడ అభివృద్ధికి అడ్డంకిగా నిలిచారు.

రోడ్డు విస్తరణను అడ్డుకుని..

విజయవాడ బాగా విస్తరించడం, ట్రాఫిక్ పెరగడంతో బెంజ్ సర్కిల్ సమీపంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీనిపై ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించిన తరువాత 2004లో విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ప్రవీణ్ ప్రకాశ్ ఆ రహదారిని విస్తరించాలని భావించారు. ఈనాడు ఆఫీసుకు ముందు ఉన్న ప్రాంతం వరకు రహదారిని విస్తరించినా ఈనాడు నుంచి బెంజ్ సర్కిల్ మధ్య కీలక ప్రాంతం విస్తరణ సాధ్యం కాలేదు. రోడ్డు విస్తరణ కోసం ఈనాడు కార్యాలయం ప్రహరీని తొలగించేందుకు రామోజీ సమ్మతించలేదు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ రహదారి వెంబడి ఇరువైపులా డ్రెయిన్లు నిర్మించే ప్రయత్నాన్ని కూడా రామోజీ అడ్డుకున్నారు. ఆ వరుసలో ఉన్న పలు వ్యాపార సంస్థలు, ఇతర కార్యాలయాల ప్రహరీలను తొలగించి రహదారిని విస్తరించినా ఈనాడు వద్దకు వచ్చేసరికి ఆగిపోయింది.

ఎన్‌హెచ్‌ఏఐకి బ్రేకులు

కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) సైతం రామోజీ అక్రమాలు, పరపతికి చేష్టలుడిగి చూస్తుండిపోవాల్సి వచ్చింది. బందరు– పుణె జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ 2018లో కార్యాచరణకు ఉపక్రమించింది. బందరు నుంచి విజయవాడ వరకు రహదారిని విస్తరించినా బెంజ్ సర్కిల్ సమీపంలోకి వచ్చేసరికి ఎన్‌హెచ్‌ఏఐకి బ్రేకులు పడ్డాయి. ఈనాడు కార్యాలయం ప్రహరీని తొలగించేందుకు రామోజీ ససేమిరా అనడంతో రహదారి విస్తరణ నిలిచిపోయింది. ఈ పరిణామాలతో 20 ఏళ్లుగా బెంజ్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమే లభించలేదు. ప్రజలకు అవస్థ పడితే నాకేంటి అన్నట్టుగా రామోజీ నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. మరోవైపు రహదారులు విస్తరించకపోవడంతో రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటూ తన కర పత్రికలో నీతులు వల్లిస్తూనే ఉన్నారు.

బాండ్లు తనకే ఇవ్వాలంటూ..

బెజవాడ ఈనాడు కార్యాలయం భూమిని కాజేసేందుకు రామోజీ మడత పేచీ పెట్టారు. రహదారి విస్తరణ కోసం సేకరించే భూమికి పరిహారంగా భూ, భవన యజమానులకు జారీ చేసే ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లను తనకే ఇవ్వాలంటూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసు పంపించారు. భూ యజమాని అయిన రామకృష్ణకు కాకుండా తనకే ఇవ్వాలని రామోజీ వాదించడంతో మున్సిపల్ అధికారులు షాక్‌కు గురయ్యారు. దీనిపై న్యాయ వివాదంతో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. రామోజీ కోరుకుంది కూడా అదే! రహదారి విస్తరణ నిలిచిపోవాలన్నదే ఆయన ఉద్దేశం. అదే జరిగింది కూడా.

లీజు ముగిసినా గబ్బిలంలా..

బెంజ్ సర్కిల్ సమీపంలోని ఖరీదైన భూమిని హస్తగతం చేసుకోవాలనే దుర్బుద్ధితో భూ యజమానిని రామోజీ ముప్పుతిప్పలు పెట్టారు. లీజుకు తీసుకున్న కొద్ది రోజులకే వివాదం పెట్టుకున్నారు. తన పలుకుబడితో తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. బెదిరింపులకు పాల్పడ్డారు. కనీసం లీజు గడువు ముగిసిన తరువాతైనా తన భూమి తనకు దక్కుతుందని వల్లూరి రామకృష్ణ ఆశించారు. 33 ఏళ్ల లీజు గడువు 2013తో ముగిసింది. అయినా సరే భూమిని ఖాళీ చేయకపోవడంతో రామోజీరావుతో సుదీర్ఘంగా వల్లూరి రామకృష్ణ, డాల్ఫిన్ అప్పారావుల న్యాయ పోరాటం సాగింది. ఏకంగా పదేళ్లపాటు తమ భూమి కోసం భూ యజమానులు పోరాడాల్సి వచ్చింది. ఎట్టకేలకు న్యాయం గెలిచింది. ఆ భూమిని ఖాళీ చేయాలని న్యాయస్థానం గతేడాది రామోజీని ఆదేశించింది.

పుట్టుక నుంచే కుట్ర..!

ఈనాడు కార్యాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయో రామోజీ భూ అక్రమాలకు అక్కడక్కడ కొనసాగాయి. ఈనాడు నెలకొల్పిన విశాఖలో కూడా భూ యజమానిని అదేవిధంగా మోసగించి ముప్పుతిప్పలు పెట్టారు. విశాఖలోని సీతమ్మధారలో మంతెన ఆదిత్య ఈశ్వరకుమార్ వర్మ కుటుంబానికి చెందిన 2.70 ఎకరాల భూమిలో ఈనాడు కార్యాలయాన్ని 1974లో ఏర్పాటు చేశారు. 33 ఏళ్ల లీజు గడువు ముగిసిన తరువాత ఆ భూమిని ఖాళీ చేసేందుకు రామోజీ మొండికేశారు. అంతేకాకుండా రహదారి విస్తరణ కోసం అందులో517 చ.మీటర్ల భూమిని విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇచ్చి అందుకు ప్రతిఫలంగా మరోచోట 872 చ.మీటర్ల భూమిని పొందారు. అసలు యజమాని అయిన వర్మ కుటుంబానికి దాన్ని అప్పగించకుండా రామోజీ దర్జాగా తమ పేరిట రిజిస్టర్ చేసుకున్నారు. ఆ భూమి మార్కెట్ విలువ రూ.3 కోట్లు కావడం గమనార్హం. ఇక మార్కెట్ విలువ ప్రకారం రూ.32.5 లక్షల లీజు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తూ ఆ భూమిని గుప్పిట పట్టారు. లీజు ముగిసినా ఖాళీ చేయకపోవడంతో భూమి యజమాని వర్మ 2007లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో న్యాయస్థానాన్ని మోసగించేందుకు రామోజీ ఏకంగా ఫోర్జరీకి పాల్పడ్డారు. విశాఖ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఫోర్జరీ చేశారని వర్మ ఆధారాలతో నిరూపించడంతో రామోజీ కుట్ర బెడిసికొట్టింది. కుట్ర, ఫోర్జరీ కింద రామోజీపై కేసు కూడా నమోదు చేశారు. దీనిపై వర్మ సుప్రీం కోర్టు వరకు సుదీర్ఘ న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. చివరికి ధర్మమే గెలిచింది. సీతమ్మధారలో ఈనాడు కార్యాలయం ఉన్న భూమిని ఖాళీ చేసి భూ యజమానికి అప్పగించాలని సుప్రీంకోర్టు 2012లో ఆదేశించింది. దాంతో రామోజీ తోక ముడిచి ఆ భూమిని ఖాళీ చేసి ఈనాడు కార్యాలయాన్ని నగర శివారులో పెందుర్తి సమీపంలోకి తరలించారు.

అంతిమ విజయం ధర్మానిదే...

న్యాయస్థానం ఆదేశాల తరువాత కూడా తాను ఆక్రమించిన భూమిని ఖాళీ చేసేందుకు రామోజీరావు ఏడాది సమయం తీసుకున్నారు. కోర్టు ఇచ్చిన గడువు ఇటీవల 2023 డిసెంబర్ 31తో ముగిసింది. దీంతో దారులన్నీ మూసుకుపోవడంతో ఇక తప్పనిసరి పరిస్థితుల్లో బెంజ్ సర్కిల్ సమీపంలోని ఈనాడు కార్యాలయాన్ని ఖాళీ చేశారు. అక్కడి యంత్రాలు, ఫర్నీచర్ తదితరాలను ఆటోనగర్‌లోని కార్యాలయానికి తరలించారు. ఎట్టకేలకు రామోజీ అక్రమ భూబాగోతానికి తెరపడింది. అసలైన యజమానులకు వారి భూమి దక్కింది. ఆ భూమిని తాజాగా ఓ వాణిజ్య సంస్థకు లీజుకు ఇచ్చారు. ఆలస్యమైనా సరే చివరికి న్యాయమే గెలుస్తుందని మరోసారి రుజువైంది.

ఎంపీ సీటు రూ.150 కోట్లకు చంద్రబాబు అమ్ముకున్నారు

- గుడివాడలో రూ.100 కోట్లు ఇచ్చినోడికి టికెట్: కొడాలి నాని ఫైర్
- తెలంగాణ సీఎం రేవంత్‌కు ఎందుకు ఫోన్ చేయాలి
- కేసీఆర్‌కు శస్త్రచికిత్స జరిగింది కాబట్టి జగన్ వెళ్లి పరామర్శించారు
- రేవంత్‌రెడ్డిని పరామర్శించడానికి ఆయనకు ఏమీ విరగలేదు కదా!



సాక్షి, అమరావతి: చంద్రబాబునాయుడు సీట్లు అ మ్ముకుంటున్నారని, రూ.150 కోట్లకు ఎంపీ సీటు కేశినేని చిన్నికి అమ్మారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చెప్పారు. తాడే పల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమ వారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ కోసం అహర్నిశలు పనిచేసిన కేశినేని నానిని చంద్ర బాబు మోసం చేశారని విమర్శించారు. గుడివాడ లో కూడా రూ.100 కోట్లు ఇచ్చినోడికి సీటిచ్చారని తెలిపారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ సీట్లు కూడా చంద్ర బాబు అమ్ముకుంటారని మండిపడ్డారు. ఇంకా ఆయన ఏన్నారంటే..

రేవంత్‌ను కలవాల్సిన అవసరం ఏముంది?

తెలంగాణలో మేం ఏ పార్టీకి మద్దతు తెలపలేదు. ఆ రాష్ట్ర సీఎం గురించి ఇక్కడ చర్చ అనవసరం. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున ఎన్నికైన సీఎం. ఆయ నది ఏమైనా ప్రాంతీయ పార్టీనా? ఆయన ఏమైనా సుప్రీమా? ఆయనకు ఎందీ ఫోన్‌చేసేది. రేవంత్ ముఖ్య మంత్రి అయినందుకు సీఎం వైఎస్ జగన్ కంగ్రాట్స్ చెబు తూ ట్వీట్ చేశారు. చంద్రబా బు అయితే ఎవరు సీఎం అవుతారా అని చూస్తుంటారు. రేవంత్‌రెడ్డిని సీఎం జగన్ ప్రత్యేకంగా ఎందుకు కలుస్తారు. తుంటి ఎ ముక విరిగినందుకు మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం జగన్ పరామర్శించారు. రేవంత్‌ను పరామర్శించ దానికి ఆయనకు తుంటి ఎముక విరగలేదు కదా?. ఏపీలో సీట్లు ఎవరికి ఇవ్వాలో కాంగ్రెస్ అధిష్టానం చూసుకుంటుంది. రేవంత్ చెప్తే ఇక్కడ సీట్లు ఇవ్వరు. ఇక్కడికి వచ్చి రాజకీయం చేయాలి అనుకుంటే తెలంగాణలో సీఎం పదవికి రాజీనామా చేసి ఏపీలో పోటీ చేయాలి. ఆయనే ఆంధ్రాలో పీసీసీ అధ్యక్షుడు అయినా మాకేం అభ్యంతరం లేదు. చంద్రబాబును గెలిపించేందుకే షర్మిలను వినియోగించుకుంటున్నారు. మా సీఎంను కలిసేందుకు మాకు సమయం సరిపోవడం లేదు. పక్క రాష్ట్రం సీఎంను కలసి మేం ఏం చేస్తాం. పక్క రాష్ట్రాల రాజకీయాలు పట్టించుకునే స్థితిలో మా నాయకుడు, మేము లేం. ఏబీఎన్ రాధాకృష్ణవి అన్నీ వెకిలి ప్రోగ్రాములు. ముగ్గురిని కంటే రూ.45 వేలు ఇస్తానని చంద్రబాబు అం టున్నారు. అదే రూ.45 వేలు ఇచ్చి వాళ్ల పప్పుగాడిని పిల్లలను కనమని చెప్పాలి. వాడినే ఐదారుగురిని కనమని చెప్పాలి.

ఫిరాయింపుదారులపై అనర్హత వేటు!

- నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీల విషయంలో వైఎస్సార్‌సీపీ చర్యలు.. లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్‌కు ఫిర్యాదు

సాక్షి, అమరావతి: పార్టీ ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం సీరియస్ అయ్యింది. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం వారిపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు సోమవారం ఫిర్యాదు చేసింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేసి శాసనసభకు ఎన్నికై న ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్ర శేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి పార్టీ ఫిరాయించారు. వారిపై చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచా ర్యులుకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ అభ్య ర్థులుగా పోటీ చేసి శాసనమండలికి ఎన్నికైన వంశీకృష్ణ, సి.రామచంద్రయ్యలు పార్టీ ఫిరా యించారు. వారిపైనా చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు ఎమ్మెల్సీలు మేరుగు మురళి, లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదు చేశారు.

పండుగ ప్రయాణం.. నరకం

- ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- కిక్కిరిసిపోతున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్
- 13వ తేదీ వరకు ఇదే పరిస్థితి



ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్

రామగుండం/ఓదెల(పెద్దపల్లి) : సంక్రాంతి పండుగ వేళ అదనపు రైళ్లు నడపాల్సిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు.. సాంకేతిక కారణాలతో ఉన్న వాటిని రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి కోల్‌బెల్ట్ ఏరియాకు లక్షలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈనెల 13వ తేదీ వరకు రద్దీ కొనసాగుతుంది. ఈ సమయంలోనే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించడం విస్మయానికి గురిచేస్తోంది.

ఆంధ్రాకు అదనపు రైళ్లు..

- ఆంధ్రా వైపు రెగ్యులర్‌తోపాటు అదనంగా రైళ్లు నడిపిస్తున్న దక్షిణమధ్య రైల్వే అధికారులు.. తెలంగాణలో అత్యధిక ఆదాయం సమకూరే రూట్లలో రద్దుచేయడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
- కాజీపేట–బల్లార్షా, సికింద్రాబాద్–కాగజ్‌నగర్, నిజామాబాద్–బల్లార్షా మధ్య అత్యధిక రద్దీతో నడిచే పలు ప్యాసింజర్ రైళ్లను నెలల తరబడి రద్దు చేశారు.
- ఇప్పుడిప్పుడే ప్రయాణికులు ఊపిరి పీల్చుకుంటున్నారు.
- వాటిని మళ్లీ రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించడం, ఎంపీలు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ప్రస్తుతం కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ మధ్య ఒకేఒక ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది.
- ఇందులో ప్రయాణికులు కిక్కిరిసిపోతున్నారు.



దానాపూర్‌రైలు వాష్‌రూంలో ప్రయాణికుడు

- కోల్‌బెల్ట్ ఏరియా నుంచి రైల్వేకు బొగ్గు రవాణాతో రోజూ రూ.కోట్ల ఆదాయం సమకూరుతోంది.
- ఇందుకోసం గూడ్సు రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి.
- వాటికి లేని అడ్డంకులు ప్యాసింజర్ రైళ్లకు ఎందుకు వస్తున్నాయని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.
- కొత్తగూడెం వరకు ఒకేఒక సింగరేణి రైలు నడుస్తోంది. దీనిని సైతం రద్దు చేయడంపై సింగరేణి కార్మిక కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నాలుగో వంతు చార్జీతో..

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉంది. దీంతో ప్రతీ బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోతోంది. అదేవిధంగా హైదరాబాద్ – గోదావరిఖని మధ్య బస్సు చార్జీ కనీసం రూ.500 వరకు ఉంది. అదే భాగ్యనగర్, కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీ రైళ్లలో ప్రయాణం చేస్తే గరిష్టంగా రూ.90 చార్జీ మాత్రమే ఉంటుంది. ఫలితంగా సాధారణ, మధ్య తరగతి ప్రయాణికులు సురక్షితంగా, తక్కువ చార్జీలతో గమ్య స్థానం చేరేందుకు రైలు ప్రయాణంపైనే ఆధారపడుతున్నారు.

సికింద్రాబాద్–బల్లార్షా మధ్య రద్దయిన రైళ్లు

సికింద్రాబాద్ – బల్లార్షా మధ్య నడిచే భాగ్యనగర్, కాగజ్‌నగర్, సింగరేణి, రామగిరి, బల్లార్షా ప్యాసింజర్, పుష్‌పుల్ రైళ్లను ఈనెల 13వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. రైల్వేశాఖ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్యాసింజర్లతోనే గిరాకీ



ప్యాసింజర్ రైళ్ల రాకపోకలతో నిత్యం రైల్వేస్టేషన్‌లో అత్యధిక మంది ప్రయాణికులు ఉంటారు. ఫలితంగా స్నాక్స్‌కు ఎక్కువ గిరాకీ ఉంటుంది. ప్యాసింజర్ రైళ్ల రద్దుతో పరోక్షంగా ఆటోలు, హోటళ్లకు కూడా గిరాకీ తగ్గింది. మధ్య తరగతి ప్రజల అవసరాలను గుర్తించి రైళ్ల రద్దును ఉపసంహరించాలి. – పవన్‌సింగ్, వ్యాపారి

హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లాలి



నా చెయ్యి విరిగింది. హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లి చెకప్ చేయించుకోవాలి. కానీ హైదరాబాద్ వెళ్లేందుకు భాగ్యనగర్, కాగజ్‌నగర్ రైళ్లు రద్దయ్యాయి. ఇంటర్‌సిటీలో అడుగు పెట్టే సందు లేదు. బస్సులో పోతే నాలుగింతల ఖర్చు. పండుగ తర్వాత వెళ్లేందుకు నిర్ణయించుకున్న. – కిషన్‌సింగ్‌ఠాకూర్, రామగుండం

ఎంపీలదే బాధ్యత



రామగుండం కేంద్రంగా రైల్వే శాఖకు బొగ్గు రవాణాతో రూ.కోట్ల ఆదాయం వస్తుంది. నిత్యం గూడ్సు రైళ్లతో బొగ్గు రవాణా సాఫీగానే సాగుతుంది. వీటికి లేని అభ్యంతరం ప్యాసింజర్ రైళ్లకు ఎందుకు? సాధారణ ప్రయాణికులకు కలిగే అసౌకర్యానికి పార్లమెంట్ సభ్యులు బాధ్యత వహించాలి. – తూళ్ల అనన్యరాజ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

జోనల్ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరణ చేయాలి

కరీంనగర్: రాష్ట్రంలోని పాత పది జిల్లాలను ప్రాతిపదికగా చేసుకొని నూతన జోనల్ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలని ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, ముఖ్య సమన్వయకర్త మహమ్మద్ ఫయాజ్ అలీ విజ్ఞప్తి చేశారు. సోమవారం సంఘ కార్యాలయంలో జక్కోజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 33జిల్లాల విభజనపై జ్యుడీషియరీ కమిటీ వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ కోసం ఏర్పాటు చేసే కమిటీ జోనల్ వ్యవస్థ రీఆర్గనైజ్ బాధ్యతలను అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏ ప్రాతిపదికన నూతన జిల్లాలకు కేటాయింపులు చేశారో అదే ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో ఆర్డినేటర్ నాగేందర్‌సింగ్, కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి రామ్ దామోదర్‌రావు, జిల్లా కార్యదర్శి తిరుపత చారి కనకయ్య పాల్గొన్నారు.

పులుల మరణం.. అనుమానాలు అనేకం

- కాగజ్‌నగర్ డివిజన్‌లో రెండు మృత్యువాత
- దరిగాం, పెర్కపల్లి అటవీ ప్రాంతంలో మరో బెబ్బులి కళేబరం గుర్తింపు
- జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా ఘటన
- అధికారుల గోప్యతపై అనుమానాలు



దరిగాం అటవీ ప్రాంతానికి వెళ్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి: కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో రెండు పులులు మృత్యువాత పడడం జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. పులులకు నివాస యోగ్యంగా ఉన్న అటవీప్రాంతం మృత్యువలయంగా మారుతుందా..? అనే అనుమానాలు రేకెత్తిస్తోంది. రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక ఆడ పులి మృతిచెందినట్లు ఆదివారం అటవీశాఖ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. మరో పులి కూడా కాగజ్‌నగర్ మండలంలోని దరిగాం, పెర్కపల్లి అటవీప్రాంతంలో మృత్యువాత పడినట్లు సోమవారం గుర్తించారు. తీవ్ర గాయాలపాలైన పులి కొద్దిదూరంలోని నీటి మడుగులో పడి చనిపోయింది. రెండో పులి వయస్సు మూడేళ్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. సంఘటన స్థలాన్ని సీసీఎఫ్ శాంతారాం, జిల్లా ఫారెస్టు అధికారి నీరజ్ కుమార్ టిబ్రీవాల్, అధికారులు పరిశీలించారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం కాగజ్‌నగర్ డివిజన్‌కు ఎన్‌టీసీఏ బృందం ఢిల్లీ నుంచి విచారణ కోసం రానుంది. మొదటి పులి మృతదేహం నమూనాలను ఇప్పటికే ఫారెన్సిక్‌కు పంపించగా, రెండో పులి మృతి విచారణను మరింత పకడ్బందీగా చేపట్టనున్నట్లు స్పష్టమవుతుంది.

ఆవాసయోగ్యంగా కాగజ్‌నగర్ డివిజన్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో గతంలో పులుల ఉనికి తక్కువగా ఉండేది. 20 ఏళ్లుగా ఈ డివిజన్‌లో పులుల ఉనికి పెరిగింది. సహజసిద్ధంగా ఉండే రాళ్ల గుట్టలు, నీటి వనరులు, దట్టమైన అడవితోపాటు మైదాన ప్రాంతాల్లో వన్యప్రాణుల లభ్యత ఉంది. కర్జెల్లి, సిర్పూర్, బెజ్జూర్, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ రేంజ్‌ల్లో విశాలమైన అటవీ ప్రాంతముంది. వీటిని ఆనుకుని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతాలు ఉన్నాయి. తడోబా, తిప్పేశ్వర్ అభయారణ్యాల్లో పులులు ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నాయి. సురక్షిత ప్రాంతంగా ఉన్న కాగజ్‌నగర్ డివిజన్‌లో పులులు అనువైన పరిస్థితులతో ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఏటా వాటి సంతతి పెరుగుతూ వచ్చింది. కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలో ఆరు పులులు నివాసం ఏర్పాటు చేసుకోగా.. మిగతా పులులు కూడా ఇతర రేంజ్‌లలో నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. మహారాష్ట్రలోని ప్రాణహిత పరీవాహక ప్రాంతం, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి పరీవాహక ప్రాంతం నుంచి పులులు రాకపోకలు సాగిస్తున్నాయి.

2023లో అధిక మరణాలు..

2023లో ఎన్‌టీసీఏ(నేషనల్ టైగర్ కన్జర్వేటర్ అథారిటీ) రికార్డుల ప్రకారం దేశవ్యాప్తంగా 168 పులులు మృతిచెందాయి. గడిచిన 12 ఏళ్లలో 2023లోనే అత్యధిక పులులు మృతిచెందినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో గతంలో పులులు అసహజ రీతిలో మృతిచెందిన ఘటనలు లేవు. రైలు ప్రమాదాల రూపంలో మృతిచెందిన ఘటనలు నమోదయ్యాయి. అదికూడా ఇతర అభయారణ్యాల నుంచి రాకపోకలు సాగిస్తున్న పులులే.

అధికారుల తీరుతో అనుమానాలు

కాగజ్‌నగర్ డివిజన్‌లో వరుసగా రెండు పులులు మృతిచెందడం, అధికారులు అత్యంత గోప్యతను పాటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పులులు ఘర్షణ పడటంతోనే ఒక పులి మరణించిందని అధికారులు చేపట్టిన విచారణ నిర్వహించిన తీరుపై విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో మరో పులి మృతి చెందిన ఘటన బయటకు రావడం ఆందోళన కలిగిస్తోంది. మొదటి పులి మృతిచెందిన నాటి నుంచి నాలుగు లేదా వారం రోజుల తర్వాతే అధికారులు దానిని గుర్తించడం... మరో రెండు రోజుల తర్వాత మరో పులిని చనిపోయినట్లుగా గుర్తించడం అటవీశాఖ అధికారులు వ్యవహరించిన తీరులో లోపాలను ఎత్తిచూపుతోంది. మొదటి పులి గాయాలతో మృతిచెందినట్లు ధృవీకరించినా తర్వాత రెండో పులి సైతం గాయపడి ఉండవచ్చనే కోణంలో అధికారులు విచారణ సాగించడంలో విఫలమయ్యారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ఘనంగా నిర్వహిస్తాం

- ఈ ఏడాది చివర్లో ఉట్నూర్‌లో గిరిజన క్రీడోత్సవం
- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



క్రీడాపతకం అందుకుంటున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఈ ఏడాది చివర్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గిరిజన క్రీడాపోటీలకు ఉట్నూర్ వేదిక కానుంది. ఈ క్రీడోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్ తెలిపారు. ఈ మేరకు క్రీడోత్సవాల పతాకాన్ని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ఆమె సోమవారం అందుకున్నారు. ఈసారి పోటీల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉట్నూర్ ఐటీడీఏకు అప్పగించినట్లు తెలిపారు. కిన్నెరసానిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల ముగింపు అనంతరం భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఉట్నూర్ క్రీడా నిర్వాహకులకు క్రీడా పతాకాన్ని అందజేయగా వారు ఉట్నూర్ పీవోకు అందజేశారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉట్నూర్ ఐటీడీఏ క్రీడాకారులు సాధించిన ఓవరాల్ చాంపియన్‌షిప్, ఇతర పతకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు కృషి చేసిన కోచ్‌లు, పీడీలు, పీఈటీలను త్వరలోనే సత్కరిస్తామన్నారు. భవిష్యత్‌లోనూ క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీల్లో జట్లను ముందుండి నడిపించిన ప్రధానోపాధ్యాయులు గోడం చందన్, మడావి కృష్ణరావు, జే.ప్రేందాస్, ఉత్తందాస్, రాథోడ్ ప్రకాశ్, ఆర్.గోపాల్, జిల్లా గిరిజన క్రీడల అధికారి కె. పార్థసారథిలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీవోలు భీంరావు, ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, గిరిజన సంక్షేమ అధికారి హేమంత్, శ్రీనివాస్, శేఖర్, సునంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిషా ఆర్ట్ స్పేస్...
చిత్రలేఖనాల నిలయం.
పుష్పాలంకరణ కళకు వేదిక.
కళను గ్రంథస్తం చేస్తున్న కలాశాల.


షర్మిలా అగర్వాల్, ఇకెబానా మాస్టర్

పూల కళాతోరణం

షర్మిల నిలయం

హైదరాబాద్, శ్రీనగర్ కాలనీ, షర్మిలా అగర్వాల్ ఇంట్లోకి అడుగుపెడితే మ్యూజియంలోకి ప్రవేశించిన అనుభూతి కలుగుతుంది. విశాలమైన రెండు గదుల గోడల నిండా ఆమె వేసిన చిత్రలేఖనాలు, ఆమె సేకరించిన అరుదైన కళారూపాలు ఉన్నాయి. సెంటర్ టేబుళ్లు, కార్నర్ స్టాండుల్లో ఇకేబానా (జపాన్ పుష్పాలంకరణ కళ) ఫ్లవర్ అరేంజ్‌మెంట్ అలరిస్తుంది. మరోవైపు ర్యాక్‌లలో ఆమె ఆవిష్కరించిన పుస్తకాల ప్రతులు కొలువుదీరి ఉన్నాయి. షర్మిలా అగర్వాల్ స్వయంగా రచయిత్రి, చిత్రకారిణి, ఇకేబానా పుష్పాలంకరణలో నిష్ణాతురాలు. ఈ మూడు కళలూ ఒకరిలో రాశిపోసి ఉండడంతో కావచ్చు ఆమె చిత్రాల్లో... ఆమె కవిత్వంలో కనిపించే భావుకత ద్యోతకమవుతుంది, అలాగే అదే చిత్రాల్లో ఆమె అలంకరించే ఇకేబానా కూడా కనిపిస్తుంది. రచయిత కావడంతో ఇకేబానా పుష్పాలంకరణను అక్షరబద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు పుస్తకాలు వెలువరించారామె. గడచిన గురువారం (నాలుగవ తేదీన) 'ఇకేబానా సులభం' తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరించారు. చిన్నపిల్లలకు ప్రాక్టీస్ వర్క్‌బుక్స్ పోలిన పది పుస్తకాల సెట్‌ను నేడు విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సాక్షితో మాట్లాడుతూ 'గురువు పర్యవేక్షణలో నేర్చుకోవడం అందరికీ సాధ్యం కాదు, కాబట్టి ఈ పుస్తకాల సహాయంతో ఇంట్లోనే ప్రాక్టీస్ చేయవచ్చు. ఇకేబానా పుష్పాలంకరణ కళ ప్రతి తెలుగింటికీ చేరాలనేది నా కల. పుస్తకాన్ని ఎవరికి వారు స్వయంగా నేర్చుకోవడానికి అనువుగా రూపొందించాను' అన్నారామె.

పువ్వు మాట్లాడుతుంది!

''పూలు మన మనసుకు అద్దం పడతాయి. పుష్పాలంకరణ మన ఇంటికి వచ్చిన అతిథులకు మన మాటగా మౌనంగా స్వాగతం పలుకుతుంది, మనసును ఆహ్లాదపరుస్తుంది. అందుకే ప్రతి ఇంటిలో తాజా పువ్వు కనిపించాలి. అందుకే నా ఈ ప్రయత్నం. ఇక నా వివరాలకు వస్తే... నేను పుట్టింది, పెరిగింది ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో. రాసే అలవాటు చిన్నప్పటి నుంచి ఉంది. నా కవితలు స్థానిక హిందీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పెయింటింగ్స్ కూడా ఇష్టంగా వేసే దాన్ని. ఇక చదువు కూడా అదే బాటలో సాగింది. లిటరేచర్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఫైన్ ఆర్ట్స్‌లో కోర్సు చేశాను. మీనియేచర్ పెయింటింగ్స్ ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తుంటాను. పెళ్లి తర్వాత హైదరాబాద్ రావడం నాకు టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. హైదరాబాద్ నగరం చిత్రకారిణిగా నాకు గుర్తింపునిచ్చింది. సోలో ఎగ్జిబిషన్‌లు పెట్టాను, వేరే ప్రదర్శనల్లో నా చిత్రాలను ప్రదర్శించాను. నా స్టూడియోలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు అన్ని ప్రదేశాల ప్రత్యేకతలనూ చూడవచ్చు. హిందీలో చంద్‌లమ్హే., కహా అన్ కహా రాశాను. పెయింటింగ్ గురించి మెళకువలు నేర్పించడానికి 'ఇన్నర్ రిఫ్లెక్షన్స్' పేరుతో రచనను సిద్ధం చేస్తున్నాను. ఇకేబానా గురించి చెప్పాలంటే ఇది నిరంతరం సాధన చేయాల్సిన కళ. ఈ ఆర్ట్‌లో కొత్త విషయాలను నేర్చుకోవడానికి జపాన్‌కి ఆరుసార్లు వెళ్లాను. గతంలో 'ఇకేబానిస్ట్స్ అరౌండ్ ద వరల్డ్, ఇకేబానా ఫర్ బిగినర్స్, ఇకేబానా జపానీ పుష్పకళ' ప్రచురించాను. 'ఇకేబానా మనదేశానికి వచ్చి అరవై ఏళ్లు దాటింది. ముంబయికి చెందిన నిర్మలా లుక్మాణి 1961లో జపాన్‌కెళ్లి ఒహారా స్కూల్‌లో డిగ్రీ చేసి తిరిగి వచ్చిన తర్వాత ఇంట్లోనే విద్యార్థులకు శిక్షణనివ్వడం మొదలుపెట్టారు...' వంటి చారిత్రక వివరాలందించాను. తెలుగు స్నేహితుల సహాయంతో 'ఇకేబానా సులభం' పుస్తకంలో... ఇకేబానా కళను నేర్చుకోవాలనే ఆసక్తి ఉండి, స్వయంగా క్లాసులకు హాజరు కాలేని వాళ్లకు పూసగుచ్చినట్లు వివరించాను. ఫ్లవర్‌పాట్ కొలతలు, కొమ్మలు, పూల పరిమాణాలతో సహా కచ్చితంగా రేఖాచిత్రాలతో పుస్తకం రాశాను. జపాన్‌లో ఉపయోగించే పూలతో అలంకరణను చూపిస్తూనే మనకు లభించే పూలు, ఆకులతో అలంకరించడం కూడా ఫొటోలతో చూపించాను. ఫ్లవర్‌వాజ్‌లుగా ఉపయోగించే పాత్రలు, పిన్‌హోల్డర్‌లు, పూలు... ఎందులోనూ కృత్రిమత్వం ఉండదు. నురుగు లాంటి వాటికి నిషేధం. శ్వాసకు హాని కలగరాదు, మట్టిలో కరిగే క్రమంలో నేలకు హాని కలిగించరాదు. ఇది నియమం.



> ఈ పెయింటింగ్‌ను పరిశీలించండి. ఇందులో అజంతా గుహలున్నాయి. బౌద్ధ భిక్షువులు, రికా (ఇకేబానాలో ఓ శైలి) పుష్పాలంకరణ ఒక భాగంలో కనిపిస్తాయి. మరొక భాగంలో అంతఃపుర స్త్రీలు పుష్పాలంకరణ చేస్తున్నారు. కిందవైపు సామాన్య మహిళలు ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌లో సంతోషిస్తున్నారు. జపాన్ నుంచి ఈ కళ బౌద్ధ భిక్షువుల ద్వారా ఇండియాకి వచ్చినప్పుడు రాజకుటుంబాల మహిళలకు చేరింది. ఆ తర్వాత సామాన్యులకు పరిచయమైంది. ఇది ప్రాచీన చారిత్రక నేపథ్యం.

చిత్ర వైవిధ్య లేఖనం

నేను పుట్టిపెరిగిన ఉత్తరాది జీవనశైలిని నా చిత్రాలు ప్రతిబింబిస్తుంటాయి. అక్కడి జీవనశైలిలో టెర్రస్‌కు ప్రాధాన్యం ఎక్కువ. ఉష్ణోగ్రతలు గరిష్ఠం, కనిష్ఠం రెండూ తీవ్రంగా ఉంటాయి. వేసవిలో సాయంత్రం నుంచి తెల్లవారే వరకు డాబా మీద గడుపుతారు. శీతాకాలంలో మధ్యాహ్నపు ఎండ కోసం డాబా మీద ఉంటారు. దైనందిన జీవితంలో సగభాగం డాబా మీద గడుస్తుంది. కాబట్టి డాబా అన్ని ఏర్పాట్లతో ఉంటుంది. నా చిత్రాలు ఉత్తరాది జీవితాన్ని కళ్లకు కడతాయి. ఇకేబానా పరిణామక్రమం కూడా చిత్రాల్లో మిళితమై ఉంటుంది. ఈ కళ జపాన్ స్కూళ్ల నుంచి మన దేశానికి థియరిటికల్‌గా వచ్చి అరవై ఏళ్లు దాటినప్పటికీ సంపన్న, ఎగువ మధ్యతరగతి దగ్గరే ఆగి పోయింది. సామాన్యులకు చేరాలంటే నేను ఊరూరా స్కూళ్లను పెట్టలేను, కాబట్టి అక్షరం అనే మాధ్యమాన్ని ఎంచుకున్నాను. తెలుగు నేల నాకు చాలా ఇచ్చింది. తెలుగు నేలకు నేను తిరిగి ఇవ్వడం ద్వారా కృతజ్ఞత చెల్లించుకుంటున్నాను. ఈ పుష్పాలంకరణ కళను తెలుగు రాష్ట్రాల్లో కుగ్రామాలకు కూడా చేర్చాలనేది నా ఆకాంక్ష'' అన్నారు షర్మిలా అగర్వాల్.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఫస్ట్ టైమ్

స్టార్ చెఫ్‌కు మిషెలాన్ స్టార్


గరీమా అరోరా



'అబ్బో! ఇప్పుడు తినాలా!' అని బద్ధకించే వాళ్లను కూడా ఆవురావురుమంటూ తినేలా చేసింది ముంబైకి చెందిన గరీమా అరోరా. వంటల తత్వాన్ని ఒడిసిపట్టిన గరీమా చెఫ్, రెస్టారెంట్ నిర్వాహకురాలిగా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది.

తాజాగా...

'మిషెలాన్ స్టార్' అవార్డ్ గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా ప్రత్యేకత సాధించింది గరీమా అరోరా. ప్రపంచ వ్యాప్తంగా 'ఔట్ స్టాండింగ్ కుకింగ్'కు సంబంధించి చెఫ్‌లకు ఇచ్చే ఫ్రాన్స్ దేశపు అత్యున్నత అవార్డ్ మిషెలాన్ స్టార్.

గరీమా ఫుడ్ ఫిలాసఫీ ఏమిటీ?

'వంటకం ఎలా ఉండాలంటే తినే వ్యక్తి చుట్టుపక్కల ప్రపంచాన్ని పూర్తిగా మరిచిపోవాలి. ఆస్వాదన మీద తప్ప మరే విషయం మీద దృష్టి మళ్లకూడదు'

కొత్త వంటకాలను రుచి చూడడం, కొత్త వంటకాలు తయారు చేసి ఇతరులకు పరిచయం చేయడం అంటే గరీమాకు ఇష్టం. ఆ ఇష్టమే 'చెఫ్' అయ్యేలా చేసింది. గరీమాకు థాయిలాండ్‌లో 'గా' పేరుతో ఇండియన్ రెస్టారెంట్ ఉంది. ఊహించని సమ్మేళనాలతో దినుసులు, రకరకాల వంటకాల ఘుమఘుమలతో అతిథులను ఆశ్చర్యపరచడంలో 'గా' ముందు ఉంటుంది.

'ఏడు నెలల పిల్లాడిని చూసుకోవడం, బిజినెస్, కిచెన్ పనులను సమన్వయం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాను. నా టీమ్‌ను నా శక్తిగా చెబుతాను. రకరకాల కస్టమర్‌లు, లేటునైట్‌లు. పని ఒత్తిడి ఉన్నా, నేను అందుబాటులో లేకపోయినా రెస్టారెంట్ సజావుగా సాగేలా చేస్తారు. వారి సపోర్ట్ లేకపోతే కుటుంబ బాధ్యతలు, వ్యాపార పనులను సమన్వయం చేసుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చేది. మిషెలాన్ స్టార్ అవార్డ్ గెలుచుకోవడంలో తగిన సహాయ సహకారాలు అందించి టీమ్ నన్ను ముందుకు నడిపించింది.

రెస్టారెంట్‌లో పనిచేయడం లేదా నిర్వహించడం అంత సులభం కాదు. ఎంతో అంకితభావం ఉండాలి. కష్టపడే తత్వం ఉండాలి. ఇంట్లో వాళ్లతో హాయిగా మాట్లాడానికి కూడా సమయం దొరకకపోవచ్చు. సెలవులు, పండగలు, ఫంక్షన్‌లు మిస్ కావచ్చు. అన్నిటినీ తట్టుకోగలిగితే ఎన్నో సాధించవచ్చు' అంటున్న గరీమా అరోరా మరిన్ని పురస్కారాలు గెలుచుకోవాలని ఆశిద్దాం.

> **నా సక్సెస్‌మంత్ర**
> పురాణాల నుంచి చరిత్ర వరకు వంటలకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను తెలుసుకుంటాను. మన భారతీయ పురాతన వంటకాల నుంచి ప్రేరణ పొందుతాను. సంప్రదాయ, ఆధునిక పద్ధతులను మిళితం చేస్తాను. స్థానికంగా దొరికే పదార్థాలను ఉపయోగిస్తాను.
> – గరీమా అరోరా

● ముగ్గు-ముచ్చట


ప్రతిభ భారతి
నవాబు పేట,
మహబూబ్ నగర్

22 చుక్కలు
22 వరుసలు




ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

సాగుబడి
ఉత్తరాషాడ కార్తె: జనవరి 11 నుంచి

ఇండిగ్యాప్‌తో ఆరోగ్యం, అధికాదాయం!

- 'మంచి వ్యవసాయ పద్ధతులు' అనుసరించి పండించే ఆహారోత్పత్తులకు 'ఇండిగ్యాప్' ధృవీకరణ
- 'ఇండిగ్యాప్' ప్రమాణాలను రైతులకు అందుబాటులోకి తెచ్చిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్
- తొలి ఏడాది 33 రైతు ఉత్పత్తిదారుల కంపెనీల రైతులకు శిక్షణ
- ఈ ఉత్పత్తులకు 130 దేశాల్లో మంచి గిరాకీ.. రైతులు అధికాదాయం పొందే అవకాశం



రసాయనిక ఎరువులు, పురుగుమందులు.. జన్యుమార్పిడి విత్తనాలను అస్సలు వాడకుండా పంటలు పండించే సేంద్రియ /ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు దేశ విదేశాల్లో 'ఆర్గానిక్' సర్టిఫికేషన్ గుర్తింపు ఉన్న విషయం తెలిసిందే. అయితే, 'మంచి వ్యవసాయ పద్ధతుల(జి.ఎ.పి.)'తో పండించే ఆహారోత్పత్తులకు 'గ్యాప్' సర్టిఫికేషన్‌కు కూడా అదే మాదిరి గుర్తింపు ఉంది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల్లో 'గ్లోబల్‌గ్యాప్' ప్రమాణాలు అమల్లో ఉన్నాయి. ఈ ఆహారోత్పత్తులకు ఆయా దేశాల్లోని వినియోగదారులు, రిటైలర్ల ఆదరణతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ మంచి గిరాకీ ఉంది. 'గ్లోబల్‌గ్యాప్'కు అనుగుణంగా దేశీయంగా రైతులు, ప్రాసెసింగ్ పరిశ్రమదారులు పాటించవలసిన 'ఇండిగ్యాప్' ప్రమాణాలను భారత ప్రభుత్వ సంస్థ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యు.సి.ఐ.) 2021లో అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్రమాణాలను రైతులకు మొట్టమొదటగా అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కటం విశేషం. తొలుత ఈ ప్రమాణాలను పాటించటం అలవాటు చేసుకునే రైతులకు.. భవిష్యత్తులో సేంద్రియ సర్టిఫికేషన్ పొందటం సులువు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో 'గ్లోబల్‌గ్యాప్', 'ఇండిగ్యాప్' ప్రమాణాలు, వాటి ప్రయోజనాల పూర్వాపరాలపై 'సాక్షి సాగుబడి' ప్రత్యేక కథనం..

ఆహారం ప్రజలకు స్థానికంగా, సరసమైన ధరలో, అందరికీ అందుబాటులో ఉంటే ప్రజలకు ఆహార భద్రత (ఫుడ్ సెక్యూరిటీ) ఉన్నట్లు.

ఆ ఆహారం మనుషుల ఆరోగ్యానికి హాని కలిగించని ప్రమాణాలతో పండించి, నిల్వ చేసినదై ఉంటే అది క్షేమదాకమైన ఆహారం (సేఫ్ ఫుడ్).

తగుమాత్రంగా రసాయనాలు వాడుతూ, ఇతర జాగ్రత్తలు పాటిస్తూ సేఫ్ ఫుడ్‌ను పండించడానికి రైతులకు ఉపకరించేవే 'మంచి వ్యవసాయ పద్ధతులు'. వీటిని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (జి.ఎ.పి.– గ్యాప్) అంటారు. అంతర్జాతీయంగా అమల్లో ఉన్న 'గ్లోబల్‌గ్యాప్' ప్రమాణాలకు అనుగుణంగా రూపొందినవే 'ఇండిగ్యాప్' ప్రమాణాలు. ఈ ప్రమాణాల ద్వారా రైతుల ఉత్పత్తులకు గిరాకీ పెరిగి, వారి నికరాదాయం పెరుగుతుందని అనుభవాలు చెబుతున్నాయి.

'గ్లోబల్‌గ్యాప్' పుట్టుపూర్వోత్తరాలు

తెలిసో తెలియకో పరిమితికి మించి రసాయనిక ఎరువులు, పురుగుమందులను విచ్చలవిడిగా వాడుతూ పంటలు పండిస్తున్నందు వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటోంది. కొందరు రైతులు నిషిద్ధ పురుగుమందులను సైతం వాడుతున్నారు. పురుగుమందులు చల్లటానికి, పంట కోతకు మధ్య పాటించాల్సిన వ్యవధిని సైతం పాటించకపోవటం వల్ల విష రసాయనాల అవశేషాలు పరిమితికి ఎన్నో రెట్లు ఎక్కువ కనిపిస్తున్న సందర్భాలు లేకపోలేదు. కొన్ని సందర్భాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు కోసిన తర్వాత కలుషిత నీటిలో కడగటం వంటి, రవాణా, నిల్వ పద్ధతుల్లో కూడా టోకు, చిల్లర వ్యాపారులు నిర్దేశిత ప్రమాణాలు పాటించకపోవటం పరిపాటిగా మారింది. ఇటువంటి సురక్షితం కాని ఆహారోత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నది. మన రాష్ట్రం, దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితి ఇదే.

ఈ సమస్యలకు పరిష్కారం కనుగొనే లక్ష్యంతో ఆహార వ్యవస్థలో గుణాత్మక మార్పులు తేవడానికి యూరప్‌లో చిల్లర వర్తకులు 1997లో 'యూరోప్‌గ్యాప్' పేరుతో మంచి వ్యవసాయ పద్ధతుల అమలుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వారి కృషి ఫలితంగా మెరుగుపరిచిన ప్రమాణాలు 2007లో 'గ్లోబల్‌గ్యాప్' పేరుతో ప్రపంచ దేశాలకు అందుబాటులోకి వచ్చాయి.

> **ప్రభుత్వ ఖర్చుతోనే పరీక్షలు**
>
> 
>
> 'ఇండిగ్యాప్' సర్టిఫికేషన్ పొందే ప్రయత్నాలను దేశంలో మొదటిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే 2023 ఖరీఫ్ నుంచి ప్రారంభించింది. తొలుత 20 వ్యవసాయ, 13 ఉద్యాన ఎఫ్‌పిసిలకు శిక్షణ ఇచ్చాం. ఇప్పటికే కొందరు రైతులు తక్కువ ఖర్చుతో, రసాయనిక అవశేషాల్లేని ఆహారం పండించి రైతులు అధిక ఆదాయం పొందారు. పరిమితికి మించి రసాయనిక అవశేషాల్లేని ఆహారోత్పత్తులను పండించిన తర్వాత శాంపుల్స్‌ను బెంగళూరు పంపి ప్రభుత్వ ఖర్చులతోనే 200 వరకు రసాయనాలకు సంబంధించి పరీక్ష చేయిస్తున్నాం. ఒక్కో శాంపిల్‌కు రూ. 10-12 వేలు ఖర్చు అవుతోంది. ఏపీలోనే రూ.2.6 కోట్లతో అధునాతన లాబ్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇండ్‌గ్యాప్ సర్టిఫికేషన్ పొందే రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు 130 దేశాలకు ఎగుమతి చేయొచ్చు. ఆర్గానిక్ సర్టిఫికేషన్‌ను రైతులకు అందించడానికి సంబంధించి అపెడా ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన రైతుల బ్రాండెడ్ ఉత్పత్తులను దేశ విదేశాల్లో మంచి ధరకు విక్రయించి అధికాదాయం రాబట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.
>
> – డా. ఎ. త్రివిక్రమరెడ్డి (97393 16931),
> డైరెక్టర్,
> ఏపీ విత్తన, సేంద్రియ ధృవీకరణ అథారిటీ, గుంటూరు

> **రైతుల్లో మార్పు వస్తోంది!**
>
> 
> ● మంత్రి కాకాణి నుంచి ఇండిగ్యాప్ ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న ఉయ్యూరు సాంబిరెడ్డి (ఎడమ)
>
> మా శ్రేష్ఠ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీలో 300 మంది రైతులు ఉన్నారు. ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ కోసం రూ. 18 వేలు ఫీజు చెల్లించి నమోదు చేసుకున్నాం. మొదటి ఏడాది 24 మంది రైతులు 50 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి 100 మంది రైతులు 500 ఎకరాల్లో పసుపు సాగు చేయించాలన్నది లక్ష్యం. మా రైతులు 10% రసాయనిక ఎరువులు 90% సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. నిషేధిత పురుగుమందులు వాడకుండా ఇండిగ్యాప్ నిపుణులు ఎప్పటికప్పుడు సూచిస్తున్న విధంగా అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తున్నాం. పసుపు పండిన తర్వాత ప్రభుత్వమే పరీక్ష చేయించి, ఇండిగ్యాప్ సర్టిఫికేట్ ఇస్తుంది. ఈ సర్టిఫికెట్ ఉంటే దేశ విదేశాల్లో మా ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంటుంది. ఈ సర్టిఫికేషన్ కోసం పనిచేస్తున్న మా సభ్య రైతుల్లో మార్పు కనిపిస్తోంది. ఇండిగ్యాప్ మామిడి, మిరప, అరటి రైతులకు లాభదాయకంగా ఉంటుంది. అన్ని వివరాలూ మాన్యువల్‌గా నమోదు చేస్తున్నాం. వచ్చే ఏడాది ఆన్‌లైన్ సదుపాయం అందుబాటులోకి వస్తే వెసులుబాటుగా ఉంటుంది.
>
> – ఉయ్యూరు సాంబిరెడ్డి (93969 62345),
> శ్రేష్ఠ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ, కొల్లిపర, గుంటూరు జిల్లా

> **చిన్న,సన్నకారు రైతుల కోసం..!**
>
> 
>
> విదేశాల్లో రిటైల్ స్టోర్లలో పక్కపక్కనే సాధారణ రసాయనిక వ్యవసాయంలో పండించిన ఆహారోత్పత్తులు, సేంద్రియ సర్టిఫైడ్ ఆహారోత్పత్తులతో పాటు.. మంచి వ్యవసాయ పద్ధతుల (గ్యాప్) ద్వారా పరిమితంగా రసాయనాలు వాడి పండించిన సర్టిఫైడ్ ఉత్పత్తులు కూడా పక్కపక్కనే పెట్టి అమ్ముతూ ఉంటారు. వినియోగదారులు తమ స్థోమతను బట్టి వాటిని కొనుగోలు చేస్తుంటారు. యూరప్‌లో 1997లో రిటైల్ వర్తకుల చొరవ వల్ల 'గ్లోబల్‌గ్యాప్' సర్టిఫికేషన్ ప్రారంభమైంది. ఆ ప్రమాణాలకు అనుగుణంగా మన దేశంలో క్వాలిటీ కౌన్సెల్ ఆఫ్ ఇండియా 'ఇండిగ్యాప్' ప్రమాణాలను నిర్దేశించింది. ఈ ప్రమాణాలను ఖచ్చితంగా పాటించటం, సర్టిఫికేషన్ పొందే ప్రక్రియకు సంబంధించిన అంశాలపై మా సంస్థ అనేక రాష్ట్రాల్లో అధికారులు, ఎఫ్‌పిసిలు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం. గతంలో మహారాష్ట్రం, ఏపీలకు చెందిన ద్రాక్ష రైతులకు కూడా శిక్షణ ఇచ్చాం. ఔషధ మొక్కల పెంపకంపై స్పైసెస్ బోర్డు తోడ్పాటుతో రైతులకు శిక్షణ ఇస్తున్నాం. శంషాబాద్‌లో క్షేత్రస్థాయిలో ఇండిగ్యాప్, సేంద్రియ సర్టిఫికేషన్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు, అధికారులు, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఆచరణాత్మక శిక్షణ ఇచ్చేందుకు త్వరలో నమూనా క్షేత్రాన్ని నిర్మిస్తున్నాం. 'ఇండిగ్యాప్' ప్రమాణాల ప్రకారం రైతులు పంటలు పండించి ఎఫ్‌పిఓలు, కోఆపరేటివ్‌ల ద్వారా గ్రూప్ సర్టిఫికెట్ పొందొచ్చు. పరిమితికి మించి రసాయనిక పురుగుమందుల అవశేషాల్లేని మంచి ఆహారానికి ఇటు దేశీయ మార్కెట్లలో గాని, అటు అంతర్జాతీయ మార్కెట్లలో గాని మంచి గిరాకీ ఉంది. రైతులు అధికాదాయం పొందవచ్చు.
>
> – కోటెల శ్రీహరి (98480 34740),
> వ్యవస్థాపకులు, కృషిగ్యాప్ డిజిటల్ సొల్యూషన్స్, హైదరాబాద్
> www.krishigap.com

- ధాన్యపు పంటలు, కూరగాయలు, పండ్లు, పూల సాగుతో పాటు ఆక్వా సాగుకు కూడా 'గ్లోబల్‌గ్యాప్' ప్రమాణాలు వర్తింపజేస్తున్నారు.
- పంట పొలాలు, తోటలు, ఆక్వా చెరువుల్లో సాగు పద్ధతుల్లో ప్రతి దశలోనూ.. అదేవిధంగా ఆహారోత్పత్తుల సేకరణ, రవాణా, నిల్వ, ప్రాసెసింగ్ వ్యవస్థల్లో పాటించాల్సిన ప్రమాణాలను 'గ్లోబల్‌గ్యాప్' ప్రమాణాల సంస్థ నిర్దేశిస్తోంది.
- భారత్ సహా 130 దేశాల్లో ఇప్పటికి 1,95,000 మంది రైతులు గ్లోబల్‌గ్యాప్ సర్టిఫికేషన్ పొందారు.
- 43 లక్షల హెక్టార్లలో రైతులు అందుకు అనుగుణంగా సాగు చేస్తూ.. సాధారణ ఉత్పత్తులతో పోల్చితే అధిక ధరకు అమ్ముకుంటున్నారు.
- 25 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల చేపలు, రొయ్యలతో పాటు.. 2.1 కోట్ల టన్నుల సర్టిఫైడ్ కాంపౌండ్ ఫీడ్‌ను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు.
- టర్కీలో గ్యాప్ ప్రమాణాలు పాటించిన రైతుల పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకం 19–31% మేరకు తగ్గింది. రసాయనిక పురుగుమందుల వాడకం 50%, శిలీంధ్రనాశనులు 25%, కలుపు మందులు 70% తగ్గిందని ఒక అధ్యయనంలో తేలింది.
- మన దేశంలో చిన్న, సన్నకారు రైతులు, పెద్ద రైతులు అనుసరించదగిన మంచి వ్యవసాయ పద్ధతులను క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా (క్యు.సి.ఐ.) 'ఇండిగ్యాప్' ప్రమాణాలను 2021లో ప్రకటించింది. 2023 ఆగస్టులో గ్లోబల్ గ్యాప్ ప్రమాణాలతో ఇండిగ్యాప్‌ను అనుసంధానం చేశారు.


● పసుపు తోటలో శ్రేష్ఠ ఎఫ్‌పిసి రైతు నెర్ల విజయేంద్రరెడ్డి

- 180కి పైగా గ్లోబల్‌గ్యాప్ సర్టిఫికేషన్ సంస్థలు అంతర్జాతీయగా రైతులకు సేవలందిస్తున్నాయి.
- మన దేశంలో 'ఇండిగ్యాప్' సర్టిఫికేషన్ విస్తరణ సేవలను వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా అమలుకు శ్రీకారం చుట్టిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావటం విశేషం. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గున్వత్తా సంకల్ప్ పథకం కింద ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ కార్యక్రమం అమలవుతోంది.
- తొలి ఏడాది 33 ఎఫ్‌పిసిలకు శిక్షణ ఇచ్చారు. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లోనూ ఇండ్‌గ్యాప్ అమలుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కృషిగ్యాప్ డిజిటల్ సొల్యూషన్స్ సంస్థ ఇందుకు తోడ్పడుతోంది.
- స్పైసెస్‌బోర్డు ద్వారా మిరప, పసుపు తదితర సుగంధ ద్రవ్య పంటల్లో సైతం ఏపీ, తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇండిగ్యాప్ సర్టిఫికేషన్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

స్పోర్ట్స్



రన్నరప్ అనాహత్ సింగ్

ప్రతిష్టాత్మక బ్రిటిష్ జూనియర్ ఓపెన్ స్క్వాష్ టోర్నమెంట్‌లో భారత రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ రన్నరప్‌గా నిలిచింది. బర్మింగ్‌హమ్‌లో జరిగిన ఈ టోర్నీలో ఢిల్లీకి చెందిన 15 ఏళ్ల అనాహత్ సింగ్ అండర్–17 బాలికల సింగిల్స్ విభాగంలో రజత పతకం గెలిచింది. 68 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ అనాహత్ 11–7, 11–13, 10–12, 11–5, 9–11తో రెండో సీడ్ నాదీన్ ఎల్‌హమీ (ఈజిప్ట్) చేతిలో ఓటమి చవిచూసింది. ఈ టోర్నీ చరిత్రలో అనాహత్‌కిది మూడో పతకం. 2019లో అండర్–11 విభాగంలో, 2023లో అండర్–15 విభాగంలో అనాహత్ స్వర్ణ పతకాలు సాధించింది.



టెస్టు క్రికెట్‌కు క్లాసెన్ వీడ్కోలు

దక్షిణాఫ్రికా జట్టు వికెట్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్ టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. 32 ఏళ్ల క్లాసెన్ 2019లో భారత జట్టుతో రాంచీలో జరిగిన టెస్ట్‌తో అరంగేట్రం చేశాడు. ఇటీవల స్వదేశంలో భారత్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో క్లాసెన్‌కు స్థానం దక్కలేదు. కేవలం నాలుగు టెస్టులే ఆడిన క్లాసెన్ 104 పరుగులు సాధించాడు. 10 క్యాచ్‌లు పట్టిన అతను రెండు స్టంపింగ్‌లు చేశాడు. వన్డే, టి20 ఫార్మాట్‌లలో మాత్రం కెరీర్ కొనసాగిస్తానని చెప్పిన క్లాసెన్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

దబంగ్ ఢిల్లీకి ఏడో గెలుపు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు తమ జోరు కొనసాగిస్తోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 40–34తో మాజీ చాంపియన్ యు ముంబా జట్టును ఓడించింది. ఈ లీగ్‌లో దబంగ్ ఢిల్లీకిది ఏడో విజయం కావడం విశేషం. తాజా ఫలితంతో ఢిల్లీ జట్టు 40 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. ముంబాతో జరిగిన పోరులో ఢిల్లీ తరఫున అషు మలిక్ అత్యధికంగా 13 పాయింట్లు స్కోరు చేశాడు. మంజీత్ ఆరు పాయింట్లు, యోగేశ్ నాలుగు పాయింట్లు సాధించారు. యు ముంబా తరఫున అమీర్ మొహమ్మద్ 11 పాయింట్లు, గుమన్ సింగ్ 9 పాయింట్లు స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 35–33తో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. బెంగళూరు బుల్స్ తరఫున సచిన్ నర్వాల్ 9 పాయింట్లు, సుర్జీత్ సింగ్ 8 పాయింట్లు స్కోరు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌తో బెంగాల్ వారియర్స్ తలపడుతుంది.



పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	10	9	1	0	46
దబంగ్ ఢిల్లీ	11	7	3	1	40
గుజరాత్ జెయింట్స్	11	7	4	0	39
జైపూర్ పింక్ పాంథర్స్	10	6	2	2	38
యు ముంబా	10	6	4	0	32
హరియాణా స్టీలర్స్	10	6	4	0	31
బెంగళూరు బుల్స్	12	5	7	0	31
పట్నా పైరేట్స్	11	5	6	0	29
బెంగాల్ వారియర్స్	10	3	5	2	23
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	10	2	8	0	14
తెలుగు టైటాన్స్	10	1	9	0	9

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు



సిరీస్ ఎవరిదో?

- నేడు భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య చివరి టి20 మ్యాచ్
- గెలిచిన జట్టు ఖాతాలోకి సిరీస్
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

నవీ ముంబై: మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా మహిళా జట్లు చెరొకటి గెలిచి సమఉజ్జీలుగా ఉన్నాయి. ఇప్పుడు సిరీస్‌ను గెలుచుకునేందుకు ఫైనల్ లాంటి పోరులో అమీతుమీ తేల్చుకునేందుకు ఇరుజట్లు సిద్ధమయ్యాయి. వన్డే సిరీస్‌లో క్లీన్‌స్వీప్ అయిన భారత అమ్మాయిలు ఇప్పుడు టి20 సిరీస్‌ను కోల్పోవడానికి సిద్ధంగా లేరు. ఆఖరి పోరులో ఎలాగైనా నెగ్గాలనే లక్ష్యంతో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం బరిలోకి దిగుతోంది. తద్వారా కొత్త ఏడాదిలో క్లీన్‌స్వీప్ పరాభవాన్ని మరిచేలా ఈ టి20 సిరీస్ విజయం సాధించాలనే పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో నెగ్గినట్లే ఈ ఆఖరి పోరులోనూ దాన్ని పునరావృతం చేస్తే సిరీస్ కష్టం కానేకాదు. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్లు బాధ్యతగా ఆడాలి. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమాలు రాణిస్తే తొలి మ్యాచ్‌ను గెలుచుకున్నంత సులభంగా సిరీస్‌నూ గెలుచుకోవచ్చు. గత మ్యాచ్‌లో వీరి వైఫల్యమే జట్టును దెబ్బ తీసింది. దీంతో పాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వరుస వైఫల్యాలు జట్టుకు ప్రతికూలంగా మారాయి. ఈ నలుగురు కీలకమైన చివరి మ్యాచ్‌లో రాణిస్తే మాత్రం మన మహిళా జట్టుకు తిరుగుండదు. బౌలింగ్‌లో రేణుక సింగ్, శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ, పూజ వస్త్రకర్ నిలకడగా రాణిస్తున్నారు. ఆసీస్‌తో పోల్చుకుంటే భారత ఫీల్డింగ్ సాధారణంగా ఉంది. ఈ నేపథ్యంలో జట్టు మేనేజ్‌మెంట్‌కు ఫీల్డింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరముంది.

మరోవైపు ఏకైక టెస్టు మ్యాచ్ ఓడాక అలీసా హీలీ నాయకత్వంలోని ఆస్ట్రేలియా జట్టు దెబ్బతిన్న పులిలా వన్డేల్లో పంజా విసిరింది. తాజా టి20 సిరీస్‌లోనూ తొలి మ్యాచ్‌లో చిత్తుగా ఓడినా... రెండో మ్యాచ్‌లో బదులు తీర్చుకుంది. ఇప్పుడు ఇదే ఉత్సాహంతో భారత గడ్డపై రెండో సిరీస్ విజయంపై కన్నేసింది.



ఫుట్‌బాల్ దిగ్గజం బెకెన్‌బాయెర్ కన్నుమూత

మ్యూనిక్: జర్మనీ ఫుట్‌బాల్ దిగ్గజం ఫ్రాంజ్ బెకెన్‌బాయెర్ కన్నుమూశారు. 78 ఏళ్ల ఈ మాజీ కెప్టెన్ ఆదివారం నిద్రలోనే తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబసభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఆయన మృతికి గల కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. జర్మనీ ఫుట్‌బాల్‌లో బెకెన్‌బాయెర్ శిఖరం. డిఫెండర్ పొజిషన్‌లో ఆడే ఆయన తొలుత కెప్టెన్‌గా తదనంతరం కోచ్‌గా విజయవంతమై జర్మనీకి రెండు ప్రపంచకప్ టైటిళ్లను అందించారు. పశ్చిమ జర్మనీ కెప్టెన్‌గా 1974లో ప్రపంచకప్ టైటిల్‌ను అందించిన ఆయన 1990 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన జర్మనీకి కోచ్‌గానూ వ్యవహరించారు.

ఇషా డబుల్ ధమాకా

- మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలు
- పారిస్ ఒలింపిక్స్ బెర్త్ సొంతం



జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత షూటర్లు అదరగొట్టారు. నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి మొత్తం ఆరు పతకాలు గెల్చుకున్నారు. అంతేకాకుండా రెండు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు కూడా ఖరారయ్యాయి. తెలంగాణ యువ షూటర్ ఇషా సింగ్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో బంగారు పతకాలు సొంతం చేసుకుంది. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో ఇషా సింగ్ భారత్‌కు ఒలింపిక్ బెర్త్ అందించింది. ఎనిమిది మంది షూటర్లు ఎలిమినేషన్ పద్ధతిలో పోటీపడ్డ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో ఇషా సింగ్ 243.1 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. తలత్ కిష్మలా (పాకిస్తాన్; 236.3 పాయింట్లు) రజతం, భారత్‌కే చెందిన రిథమ్ సాంగ్వాన్ (214.5 పాయింట్లు) కాంస్యం కైవసం చేసుకున్నారు. భారత్‌కే చెందిన మరో షూటర్ సురభి రావు 154 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో రిథమ్, సురభి రావు 579 పాయింట్లతో వరుసగా మూడు, ఐదు స్థానాల్లో నిలువగా... ఇషా సింగ్ 578 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్‌లో రిథమ్, సురభి, ఇషా సింగ్ సాధించిన స్కోరు ఆధారంగా భారత జట్టుకు టీమ్ విభాగంలో బంగారు పతకం లభించింది. భారత బృందం మొత్తం 1736 పాయింట్లు స్కోరు చేసింది.

పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ వరుణ్ తోమర్ స్వర్ణ పతకం నెగ్గడంతోపాటు భారత్‌కు పారిస్ ఒలింపిక్ బెర్త్‌ను ఖరారు చేశాడు. ఇదే ఈవెంట్‌లో మరో భారత షూటర్ అర్జున్ సింగ్ చీమా రజత పతకం నెగ్గాడు. ఎనిమిది మంది షూటర్లు పాల్గొన్న ఫైనల్లో వరుణ్ 239.6 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలువగా... అర్జున్ 237.3 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. వరుణ్, అర్జున్ సింగ్, ఉజ్వల్ మలిక్‌లతో కూడిన భారత బృందం 1740 పాయింట్లతో టీమ్ విభాగంలో పసిడి పతకాన్ని గెల్చుకుంది. ఇప్పటి వరకు భారత్ నుంచి 15 మంది షూటర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. టోక్యో ఒలింపిక్స్‌లోనూ భారత్ నుంచి 15 మంది షూటర్లు బరిలోకి దిగారు.

శ్రీకాంత్‌కు సవాల్

నేటి నుంచి మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: గత సీజన్ భారత స్టార్ షట్లర్లకు మిశ్రమ ఫలితాలిచ్చింది. కానీ ఇప్పుడు ఒలింపిక్ నామ సంవత్సరం కావడంతో మన బ్యాడ్మింటన్ ఆటగాళ్లంతా నూతనోత్సాహంతో కొత్త సీజన్‌కు శ్రీకారం చుట్టేపనిలో ఉన్నారు. నేటి నుంచి జరిగే మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో శుభారంభమే లక్ష్యంగా మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్, ప్రపంచ 8వ ర్యాంకర్ ప్రణయ్, డబుల్స్‌లో అగ్రశ్రేణి జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి కోటి ఆశలతో కొత్త ఏడాదిని విజయవంతం చేసుకోవాలని ఆశిస్తున్నారు. నేడు జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో శ్రీకాంత్, వెంగ్ హాంగ్ యంగ్ (చైనా)తో లక్ష్య సేన్ తలపడతారు.

ఆంధ్ర జట్టుకు మూడు పాయింట్లు

బెంగాల్‌తో రంజీ మ్యాచ్ 'డ్రా'

విశాఖ స్పోర్ట్స్: ఈ ఏడాది రంజీ ట్రోఫీ సీజన్‌ను ఆంధ్ర క్రికెట్ జట్టు 'డ్రా'తో ప్రారంభించింది. బెంగాల్ జట్టుతో ఇక్కడి వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన నాలుగు రోజుల మ్యాచ్‌ను ఆంధ్ర జట్టు 'డ్రా' చేసుకుంది. 36 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఆంధ్ర జట్టు ఖాతాలో మూడు పాయింట్లు చేరగా... బెంగాల్ జట్టుకు ఒక్క పాయింట్ లభించింది. మ్యాచ్ చివరిరోజు ఓవర్‌నైట్ స్కోరు 339/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 165.4 ఓవర్లలో 445 పరుగులకు ఆలౌటైంది. రికీ భుయ్ (347 బంతుల్లో 175; 23 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీ సాధించి ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కేలా చేశాడు. షోయబ్ మొహమ్మద్ ఖాన్ (149 బంతుల్లో 56; 7 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి ఏడో వికెట్‌కు 133 పరుగులు జోడించిన రికీ భుయ్ చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. బెంగాల్ బౌలర్లలో కైఫ్ మూడు వికెట్లు తీయగా, ఆకాశ్ దీప్, ఇషాన్ పోరెల్, కరణ్ లాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. 36 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్ జట్టు 25 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 82 పరుగులు సాధించింది. ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో టీ విరామం తర్వాత ఇరు జట్ల కెప్టెన్‌లు 'డ్రా'కు అంగీకరించి ఆటను ముగించారు. ఆంధ్ర జట్టు తదుపరి మ్యాచ్‌ను ఈనెల 12 నుంచి వాంఖెడె స్టేడియంలో ముంబై జట్టుతో ఆడుతుంది.



సినిమా

అందుకేనేమో ఎర్ర సముద్రం అంటారు!



ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్–డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రం తొలి భాగం 'దేవర పార్ట్ 1' ఏప్రిల్ 5న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. కాగా ఈ సినిమా గ్లింప్స్‌ను ఆయా భాషల్లో సోమవారం విడుదల చేశారు మేకర్స్. 'ఈ సముద్రం సేపల్ని కంటే కత్తుల్ని, నెత్తుర్ని ఎక్కువ సూసుండాది.. అందుకేనేమో దీన్ని ఎర్ర సముద్రం అంటారు' అంటూ ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్‌తో గ్లింప్స్ రిలీజైంది. ''దేవర' సినిమా కోసం ఎన్టీఆర్ అభిమానులతో పాటు ప్రేక్షకులు, ట్రేడ్ వర్గాలు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. ఆ అంచనాలను దృష్టిలో పెట్టుకుని ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: రత్నవేలు.

సినిమా హిట్‌కి ఆస్కార్ ఉపయోగపడదు

– కీరవాణి



''నేను మొదటి నుంచి సెలక్టివ్‌గానే సినిమాలు చేస్తున్నాను. ఒక సినిమాకి హైప్ అనేది రిలీజ్ అయ్యే పాటల ద్వారా వస్తుంది. అంతే కానీ నాకు వచ్చిన 'ఆస్కార్' అవార్డు అనేది ఓ సినిమా విజయానికి ఉపయోగపడదని భావిస్తాను. నా వరకూ సంగీతం బాగా అందించాలి. సినిమాని డైరెక్టర్ బాగా తీయాలి. అది జనాలకి నచ్చాలి. 'నా సామిరంగ' చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అని సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి అన్నారు. నాగార్జున, ఆషికా రంగనాథ్ జంటగా విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన చిత్రం 'నా సామిరంగ'. శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన ఎంఎం కీరవాణి విలేకరులతో పంచుకున్న విశేషాలు.

- నాగార్జునగారు, నా కాంబినేషన్‌లో 'ప్రెసిడెంట్‌గారి పెళ్ళాం, అల్లరి అల్లుడు, అన్నమయ్య, శ్రీరామదాసు..' వంటి పలు హిట్ సినిమాలు వచ్చాయి. ఇప్పుడు వస్తున్న 'నా సామిరంగ' కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. 'ప్రెసిడెంటుగారి పెళ్ళాం' గ్రామీణ నేపథ్యం ఉన్న సినిమా. అందులో ఉన్నట్లుగానే 'నా సామిరంగ'లోనూ వినోదాత్మక అంశాలు చాలా ఉన్నాయి. ఈ మూవీ మరో 'ప్రెసిడెంటుగారి పెళ్ళాం' అవుతుందని ఆశిస్తున్నాను. పైగా 'నా సామిరంగ' నాగార్జునగారికి యాప్ట్ టైటిల్.
- సీనియర్స్ కంటే కొత్త దర్శకుల్లో బాగా కష్టపడే తత్వం ఉంటుంది. ఎలాగైనా తమను తాము నిరూపించుకోవాలనే కసితో పని చేస్తారు. ఈ చిత్రదర్శకుడు విజయ్ బిన్నీ కూడా అంతే.. చాలా త్వరగా ఈ సినిమా తీయగలిగాడు. దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ, రాఘవేంద్ర రావుగార్లలా క్వాలిటీ తగ్గకుండా త్వరగా సినిమా తీయడం తన ప్రధాన బలం అని భావిస్తున్నాను. బిన్నీ డ్యాన్స్ మాస్టర్ కాబట్టి ప్రతి పాటని ఫుల్ డ్యాన్స్ కోణంలో ఆలోచించడం సహజం. కానీ, దానికి భిన్నంగా ఇందులో రెండు మూడు మెలోడీ పాటలు చేయించాడు. అప్పుడు తను పరిపక్వత ఉన్న దర్శకుడనిపించింది. తెలుగు నేటివిటీ, కట్టుబాట్లు, సంక్రాంతి పండగ కళ ఉట్టిపడేలా ఈ చిత్రాన్ని రూపొందించాడు. సంగీతం కూడా ఫ్రెష్‌గా ఉంటుంది.
- 'నా సామిరంగ' చిత్రానికి పాటలన్నీ చంద్రబోస్‌గారే రాశారు. అయితే అన్నం తినేటప్పుడు కొంచెం పచ్చడి నంజుకుంటాం. అలా అని పచ్చడి తిన్నామని ప్రత్యేకంగా చెపుకోం.. అన్నం తిన్నామని మాత్రమే చెప్పుకుంటాం కదా (నవ్వుతూ). ఇదీ అంతే. నేను ప్రొఫెషనల్ లిరిక్ రైటర్‌ని కాదు. ఎవరైనా వచ్చి రాయమని అడిగినా రాయను. కానీ రీ రికార్డింగ్ చేసినప్పుడు ఒక సందర్భం పుడుతుంది. అలాంటి సందర్భంలో నుంచి ఓ ఆలోచన వస్తుంది. ఆ సందర్భం వచ్చింది కాబట్టి ఈ సినిమాలో ఓ పాట రాశానంతే.
- 'నా సామిరంగ' చిత్రంలో ఇప్పటి తరానికి కావాల్సిన పాటలు ఇచ్చాను. నా వయసు ఎక్కువైనా నా వద్ద పని చేసే వారందరూ యువకులే.. వారి ఆలోచనలు నేటి యువతకు తగ్గట్టు ఉంటాయి. అలా ముందుకెళుతున్నాను (నవ్వుతూ). ఓ పాట వైరల్ కావడం, కాకపోవడం అనేది మన చేతిలో లేదు. ఇప్పుడు ఇంటర్నెట్ ఉంది.. వ్యూస్‌ని బట్టి తెలుస్తోంది. కానీ గతంలో పాట హిట్ అయ్యిందా? లేదా అని తెలుసుకోవాలంటే కష్టంగా ఉండేది. ఏదైనా పెళ్లికి వెళ్లి చూసేవాళ్లం. అక్కడ బ్యాండ్‌లో ఆ పాట ప్లే చేస్తుంటే హిట్టయినట్టు.. లేకుంటే కానట్టు అని తెలుసుకునే వాళ్లం (నవ్వుతూ).
- నేను సంగీతం అందిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమాకి మూడు పాటలు రికార్డ్ చేశాం. చిరంజీవిగారి సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభమయ్యాయి. రాజమౌళిగారితో చేయబోయే కొత్త సినిమా మ్యూజిక్ వర్క్ నా వరకూ ఇంకా రాలేదు.

సంక్రాంతికి ఫస్ట్ లుక్

ప్రభాస్ అభిమానులకు శుభ వార్త. సంక్రాంతి కానుకగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం అప్‌డేట్ రానుంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. పీపుల్స్ మీడియా పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ని సంక్రాంతి పండగ రోజున విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ప్రభాస్‌ను కొత్త జానర్‌లో కొత్తగా చూపించబోతున్నారు దర్శకుడు మారుతి. ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. కాగా 'సలార్ పార్ట్ 1: సీజ్‌ఫైర్' సినిమాతో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న ప్రభాస్ ఆ ఆనందాన్ని యూనిట్ సభ్యులతో కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు. రెట్టించిన ఉత్సాహంతో తర్వాతి సినిమాల షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 ఏడీ' సినిమాలోనూ, మారుతి చిత్రంలోనూ ప్రభాస్ నటిస్తున్నారు.



విజయ్ కిరగందూర్, ప్రశాంత్ నీల్, పృథ్వీరాజ్ ప్రభాస్

ఇది యుఐ ప్రపంచం



ఉపేంద్ర

'ఇది ఏఐ వరల్డ్ కాదు.. యుఐ వరల్డ్' అనే బ్యాక్‌గ్రౌండ్ వాయిస్‌తో మొదలవుతుంది 'యుఐ' చిత్రం టీజర్. ఉపేంద్ర స్వీయ దర్శకత్వం వహిస్తూ, హీరోగా నటిస్తున్న చిత్రం 'యుఐ'. జి. మనోహరన్, కేపీ శ్రీకాంత్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవీన్ మనోహరన్ సహనిర్మాత. బందీలుగా ఉన్నవారి హాహాకారాలు, విచిత్ర వేషధారణలో ఉన్న వ్యక్తులు కనిపిస్తుండగా, వారిని రక్షించడానికే అన్నట్లు హీరో ఉపేంద్ర ఎంట్రీతో టీజర్ ముగుస్తుంది. సోమవారం జరిగిన ఈ టీజర్ విడుదల కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, ప్రముఖ నటుడు శివ రాజ్‌కుమార్ అతిథులుగా పాల్గొన్నారు. ''ఈ చిత్రానికి ఇండస్ట్రియల్ లైట్ మ్యాజిక్ (ఐఎల్ఎమ్) క్రియేషన్ టెక్నాలజీని వాడాం. దాదాపు 90 శాతం వీఎఫ్ఎక్స్ ఉంటాయి'' అని యూనిట్ పేర్కొంది. ఉపేంద్ర సరసన రీష్మా నానయ్య నటిస్తున్న ఈ చిత్రంలో నిధి సుబ్బయ్య, మురళీ శర్మ, పి. రవిశంకర్ ముఖ్య పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ బి. లోక్‌నాథ్, కెమెరా: హెచ్‌సి వేణుగోపాల్.

దర్శకుడు జయదేవ్ మృతి



ప్రముఖ జర్నలిస్ట్, సినీ దర్శకుడు కె. జయదేవ్ సోమవారం రాత్రి గుండెపోటుతో హైదరాబాద్‌లో మృతి చెందారు. పలు షార్ట్ ఫిలింస్‌కి దర్శకత్వం వహించిన జయదేవ్ 'కొరంగి నుంచి' (2022) అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) నిర్మించింది. మంచి చిత్రాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎన్ఎఫ్‌డీసీ ప్రతి ఏడాది కొన్ని చిత్రాలకు ఫండింగ్ ఇస్తుంది. అందులో భాగంగా 'కొరంగి నుంచి'కి కోటి రూపాయల ఫండింగ్ ఇచ్చారు. 25 ఏళ్ల తర్వాత నటి అర్చన ఈ సినిమాలో నటించటం విశేషం. ఈ చిత్రం పలు జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. భారత రత్న సి.ఎస్.ఆర్. రావుపై ఫిల్మ్ డివిజన్‌కు డాక్యుమెంటరీ నిర్మించారు జయదేవ్. ఇంకా ఎన్ఎఫ్‌డీసీ, ఫిల్మ్ డివిజన్‌కు పలు డాక్యుమెంటరీలు నిర్మించారు. 'సాక్షి' వెబ్‌లో కొంత కాలం పనిచేశారు. ప్రముఖ దర్శకుడు, జర్నలిస్టు కేఎన్‌టీ శాస్త్రికి జయదేవ్ చిన్న కుమారుడు. గతంలో ఎన్ఎఫ్‌డీసీ నిర్మించిన 'తిలదానం' చిత్రానికి కేఎన్‌టీ శాస్త్రి దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. జయదేవ్‌కు భార్య యశోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

టైటిల్ చాలా ఆసక్తిగా ఉంది

– 'దిల్' రాజు



అనన్య, 'దిల్' రాజు, మోహన్

''శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' టైటిల్ చాలా ఆసక్తిగా ఉంది. ఈ మూవీలో మంచి వినోదం ఉంటుందనే నమ్మకం కలుగుతోంది.. సినిమా విజయం సాధించాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. 'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో రైటర్ మోహన్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణా రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని 'దిల్' రాజు విడుదల చేశారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ– ''క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ సినిమాలో మూడు పాత్రలున్నాయి'' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజేశ్ రామ్ బాల, నటులు నాగ మహేశ్, భద్రం, నటి ప్రభావతి పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: మల్లికార్జున్ ఎన్.

ఈ కార్యక్రమంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''హను–మాన్' సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవిగారు నా గురించి మాట్లాడిన మాటలను వక్రీకరించి, 'దిల్' రాజు మీద చిరంజీవి విమర్శలు గుప్పించారంటూ కొన్ని వెబ్ సైట్స్‌లో రాశారు. ఇకపై వ్యూస్ కోసం నా మీద తప్పుడు వార్తలు రాస్తే తాట తీస్తా. సంక్రాంతికి ఓ తమిళ సినిమాని నేను విడుదల చేస్తున్నానని కూడా రాశారు. కానీ నేనే ఆ సినిమా విడుదల వాయిదా వేయించాను. 'హను–మాన్' సినిమాని ఈ నెల 12న కాకుండా 14న రిలీజ్ చేస్తే ఎక్కువ థియేటర్స్ దొరుకుతాయని చెప్పాను.. అంతే కానీ, రిలీజ్ చేయొద్దని చెప్పలేదు. ఈ నెల 12న మహేశ్‌బాబు 'గుంటూరు కారం', 'హను–మాన్'కి నైజాంలో థియేటర్స్ ఉన్నాయి. కానీ పెద్ద స్టార్స్ అయిన నాగార్జున, వెంకటేశ్‌గార్ల సినిమాలకి థియేటర్స్ దొరకలేదని చెప్పాను. తప్పుడు రాతలతో ఏం చేద్దామనుకుంటున్నారు. నేను ఎప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటాను. నా గురించి వార్త రాసేటప్పుడు ఎలాంటి సందేహం వచ్చినా ఫోన్ చేస్తే మాట్లాడతాను'' అన్నారు.

తొలి చిత్రం రిలీజ్ కాకుండానే..



యశస్వి, సుకుమార్

ఒక కొత్త దర్శకుడికి అతని తొలి చిత్రం విడుదల కాక ముందే రెండో సినిమాకి చాన్స్ వస్తే మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంటుంది. దర్శకుడు యశస్వి వి. ఆ ఆనందంలోనే ఉన్నారు. దీపక్ సరోజ్ హీరోగా 'సిద్ధార్థ్ రాయ్' అనే ప్రేమకథా చిత్రానికి దర్శకత్వం వహించారు యశస్వి. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా ఈ చిత్రం విషయంలో యశస్వి ప్రతిభను గుర్తించిన సుకుమార్ తన సుకుమార్ రైటింగ్స్ బేనర్‌లో ఓ సినిమాకి దర్శకత్వం వహించే అవకాశం ఇచ్చారు. సుకుమార్ దగ్గర పని చేయకపోయినప్పటికీ ఆయనకు ఏకలవ్య శిష్యుడు యశస్వి. ఇక ఇప్పటికే పలువురు ప్రతిభ గల దర్శకులను సుకుమార్ పరిచయం చేసిన విషయం తెలిసిందే.

సాక్షి బిజినెస్

మంగళవారం
9-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	671	71,355
నిఫ్టీ ▽	198	21,513

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,711	△	187
డోజోన్స్	37,390	▽	76
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,694	△	5
డాక్స్	16,716	△	122
షాంఘై	2,888	▽	42
నికాయ్	33,377	△	89

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	62,192
బంగారం (99.5 స్వచ్ఛత)	61,943
వెండి (కేజీ)	71,386

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.71	83.73
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.42	106.97
€	యూరో	ఒకటి	89.84	92.23
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.98	58.29
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.89	56.82
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.46	62.56
SAR	సౌదీ రియాల్	పదిహేనుకు	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	పదిహేనుకు	21.74	23.53
¥	చైనా యువాన్	పదిహేనుకు	10.49	12.56

కేజీ బ్లాక్ నుంచి ఓఎన్‌జీసీ చమురు ఉత్పత్తి ప్రారంభం



న్యూఢిల్లీ: సుదీర్ఘ జాప్యం తర్వాత కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లోని డీప్ సీ బ్లాక్ నుంచి ప్రభుత్వ రంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) చమురు ఉత్పత్తిని ప్రారంభించింది. కంపెనీతో పాటు కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి ఈ విషయం తెలిపారు. అయితే, ఉత్పత్తి చేస్తున్న పరిమాణాన్ని మాత్రం వెల్లడించలేదు. కేజీ–డీడబ్ల్యూఎన్–98/2 (కేజీ–డీ5) ప్రాజెక్టుతో తమ చమురు ఉత్పత్తి సామర్థ్యం 11 శాతం, గ్యాస్ ఉత్పత్తి సామర్థ్యం 15 శాతం పెరుగుతుందని ఓఎన్‌జీసీ తెలిపింది. 2022–23లో ఓఎన్‌జీసీ 18.4 మిలియన్ టన్నుల క్రూడాయిల్, రోజుకు 20 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉత్పత్తి చేసింది. తాజాగా అందుబాటులోకి వచ్చిన బ్లాక్‌లో చమురు ఉత్పత్తి గరిష్టంగా రోజుకు 45,000 బ్యారెళ్లు, గ్యాస్ ఉత్పత్తి 10 మిలియన్ క్యూబిక్ మీటర్ల స్థాయికి చేరగలదని మంత్రి తెలిపారు. అయితే, ఎప్పటికి ఆ స్థాయిని చేరవచ్చనేది వెల్లడించలేదు. కేజీ బేసిన్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి చెందిన కేజీ–6 బ్లాక్ పక్కనే కేజీ–డీ5 బ్లాక్ ఉంది. దీన్ని మూడు క్లస్టర్లుగా విడగొట్టి ముందుగా రెండో క్లస్టర్‌పై పనులు ప్రారంభించారు. వాస్తవ ప్రణాళికల ప్రకారం 2021 నవంబర్‌లోనే ఇందులో ఉత్పత్తి ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ కోవిడ్ పరిణామాలతో 2023 మే నెలకు, అటుపైన ఆగస్టుకు, తర్వాత డిసెంబర్‌కు వాయిదా పడుతూ వచ్చింది.

తాన్లా బోర్డులోకి ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మను డైరెక్టర్ల బోర్డులో నియమించినట్లు తాన్లా ప్లాట్‌ఫామ్స్ సోమవారం ప్రకటించింది. దీంతో సంస్థ బోర్డ్ డైరెక్టర్ల సంఖ్య ఏడుకు చేరుకుంది. 2015–20 మధ్య ట్రాయ్ చైర్మన్‌గా ఆయన విధులు నిర్వర్తించారు. ఎంపవర్డ్ గ్రూప్ ఆఫ్ కోవిడ్ వ్యాక్సిన్ అడ్మినిస్ట్రేషన్ చైర్మన్‌గా.. భారత్‌లో కోవిడ్–19 టీకా కార్యక్రమానికి డిజిటల్ వెన్నెముక అయిన కో–విన్ రూపకల్పన, అమలుకు నాయకత్వం వహించారు. నేషనల్ హెల్త్ అథారిటీ సీఈవోగా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలైన ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలులో కీలకపాత్ర పోషించారు. 2009–13 మధ్య ఆధార్ కార్డుల జారీ సంస్థ యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్, మిషన్ డైరెక్టర్‌గా పని చేశారు.

జీ–సోనీ డీల్‌కు బ్రేక్?

- సీఈవోగా గోయెంకా కొనసాగింపుపై ప్రతిష్టంభన
- డీల్‌ను రద్దు చేసుకునే యోచనలో సోనీ



న్యూఢిల్లీ: దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీల్) – సోనీ భారత విభాగం విలీన ప్రయత్నాలకు బ్రేక్ పడనున్నట్లు తెలుస్తోంది. విలీన సంస్థకు జీ సీఈవో పునీత్ గోయెంకా సారథ్యం వహించే విషయంపై సోనీ సుముఖంగా లేకపోవడమే ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో నిర్దిష్ట షరతులను పాటించలేదనే కారణంతో ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని సోనీ గ్రూప్ భావిస్తున్నట్లు తెలిపారు. డీల్ కుదుర్చుకునేందుకు నిర్దేశించుకున్న గడువు కన్నా ముందే జనవరి 20లోగా రద్దు నోటీసును పంపించే అవకాశం ఉందని వివరించాయి. వివరాల్లోకి వెళ్తే.. జపాన్ దిగ్గజం సోనీ గ్రూప్ తమ భారత విభాగాన్ని, జీల్‌ను విలీనం చేసేందుకు సంబంధించి 2021లో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది సాకారమైతే దేశీయంగా 10 బిలియన్ డాలర్ల మీడియా దిగ్గజంగా విలీన సంస్థ ఆవిర్భవిస్తుంది. సదరు ఒప్పందం ప్రకారం జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర తనయుడు, సీఈవో పునీత్ గోయెంకానే విలీన సంస్థకు కూడా సారథ్యం వహించాలి. కానీ, ఈలోగా చంద్ర, గోయెంకాలు తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి సొంత అవసరాల కోసం నిధులను మళ్లించారంటూ సెబీ ఆరోపించడంతో డీల్ పురోగతిపై సందేహాలు రేకెత్తాయి. అయితే, ఈ మొత్తం వ్యవహారాన్ని కార్పొరేట్ గవర్నెన్స్‌పరమైన వివాదంగా పరిగణిస్తున్న సోనీ.. విలీన సంస్థ సారథ్య బాధ్యతలను గోయెంకాకు అప్పజెప్పడానికి విముఖంగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కానీ, ముందుగా అనుకున్న ప్రకారం సీఈవోగా తనని కొనసాగించాల్సిందేనంటూ గోయెంకా పట్టుబడుతున్నట్లు వివరించాయి. ఈ నేపథ్యంలోనే డీల్‌ను సోనీ రద్దు చేసుకోవాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి.

రూ. 50 లక్షల కోట్లకు ఫండ్స్ ఆస్తులు

- 2023లో రూ.11 లక్షల కోట్ల వృద్ధి
- డిసెంబర్‌లో ఈక్విటీల్లోకి రూ.17వేల కోట్లు
- నూతన గరిష్టాలకు సిప్ పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశ మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ సరికొత్త మైలురాయికి చేరుకుంది. అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని ఆస్తులు 2023 డిసెంబర్ ముగింపునకు రూ.50 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించాయి. గతేడాది మొత్తం మీద ఫండ్స్ నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) 27 శాతం (రూ.10.9 లక్షల కోట్లు) వృద్ధి చెంది రూ.50.77 లక్షల కోట్లకు చేరాయి. 2022లో కేవలం 5.7 శాతం మేర (రూ.2.65 లక్షల కోట్లు) ఫండ్స్ ఏయూఎం పెరిగింది. 2021 చివరికి ఫండ్స్ ఏయూఎం రూ.37.72 లక్షల కోట్లుగా ఉంటే, 2022 చివరికి రూ.39.88 లక్షల కోట్లకు చేరింది. గతేడాది మెరుగైన పనితీరుకు.. ఈక్విటీ మార్కెట్లలో ఆశావహ ధోరణి, మ్యూచువల్ ఫండ్స్ పట్ల పెరుగుతున్న అవగాహన, బలమైన ఆర్థిక మూలాలు, ఫండ్స్ పెట్టుబడుల విషయంలో క్రమశిక్షణ, ఇవన్నీ అనుకూలించాయి. గత డిసెంబర్‌లో ఫండ్స్ ఏయూఎం (అన్ని విభాగాలు కలిపి) 3.53 శాతం పెరిగింది. వరుసగా 11వ ఏడాదీ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు పెరిగాయి. గతేడాది రూ.1.61 లక్షల కోట్లు ఈక్విటీ పథకాల్లోకి రాగా, హైబ్రిడ్ పథకాలు రూ.87,000 కోట్లను ఆకర్షించాయి. ''మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ మొదటి రూ.10 లక్షల కోట్ల నిర్వహణ ఆస్తులు సమకూర్చుకోవడానికి 50 ఏళ్లు పట్టింది. రూ.40 లక్షల కోట్ల నుంచి రూ.50 లక్షల కోట్లకు చేరుకోవడం ఏడాదిలోనే సాధ్యపడింది'' అని యాంఫీ సీఈవో వెంకట్ చలసాని పేర్కొన్నారు.

ఈక్విటీ పథకాలకు దన్ను..

2023 డిసెంబర్‌లో ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ.16,997 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. నవంబర్ నెలలో వచ్చిన రూ.15,536 కోట్లతో పోల్చి చూస్తే 9.40 శాతం వృద్ధి కనిపించింది.

- సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా నెలవారీగా వచ్చే పెట్టుబడులు నూతన గరిష్టాలకు చేరాయి. డిసెంబర్‌లో రూ.17,610 కోట్లు సిప్ ద్వారా వచ్చాయి.
- డిసెంబర్‌లో థీమ్యాటిక్/సెక్టోరల్ ఫండ్స్ వెలుగులో నిలిచాయి. ఈ విభాగమే అత్యధికంగా రూ.6,005 కోట్లను ఆకర్షించింది. నవంబర్‌లో ఇదే విభాగంలోకి వచ్చిన పెట్టుబడులు రూ.1,965 కోట్లుగానే ఉన్నాయి.
- వీటి తర్వాత స్మాల్‌క్యాప్ పథకాలు అత్యధికంగా రూ.3,865 కోట్లను రాబట్టాయి.
- లార్జ్, మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.2,339 కోట్లు, మల్టీ క్యాప్ ఫండ్స్ రూ.1,852 కోట్లు ఆకర్షించాయి.

సెన్సెక్స్ 671 పాయింట్లు క్రాష్

నిఫ్టీకి 198 పాయింట్ల నష్టం

- ప్రపంచ ప్రతికూల సంకేతాల ప్రభావం
- క్యూ3 ఆర్థిక ఫలితాల వెల్లడికి ముందు లాభాల స్వీకరణ
- బ్యాంకింగ్, మెటల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడంతో పాటు దేశీయ కార్పొరేట్ డిసెంబర్ క్వార్టర్ ఫలితాల ప్రకటనకు ముందు ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సోమవారం దేశీయ మార్కెట్లు దాదాపు ఒక శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 671 పాయింట్లు పతనమై 71,355 వద్ద నిలిచింది. నిఫ్టీ 198 పాయింట్లు నష్టపోయి 21,513 వద్ద స్థిరపడింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ఆసియా మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలతో వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. రియల్టీ, మీడియా మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, మెటల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 725 పాయింట్లు నష్టపోయి 71,301 వద్ద, నిఫ్టీ 218 పాయింట్లు పతనమైన 21,711 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. మధ్య తరహా షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో బీఎస్‌ఈ మిడ్ క్యాప్ సూచీ 0.87% నష్టపోయింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.16.03 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.156 కోట్ల విలువైన షేర్లను కొన్నారు.

- అమెరికాలో డిసెంబర్‌కు సంబంధించి వ్యవసాయేతర రంగాల్లో 2.16 లక్షల ఉద్యోగాల కల్పన జరిగింది. పేరోల్ డేటా అంచనాలకు మించి నమోదవడంతో 'ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా' ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. చైనా ద్రవ్యోల్బణ, వాణిజ్య లోటు డేటాతో సహా ఆయా దేశాల కీలక స్థూల ఆర్థిక గణాంకాల వెల్లడి ముందు అప్రమత్తత చోటు చేసుకోవడంతో ఆసియా, యూరప్ మార్కెట్లు బలహీనంగా కదలాడాయి. అమెరికా ఫ్యూచర్లు సైతం స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.
- మెక్వైర్ ఈక్విటీస్ రీసెర్చ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ బ్యాంకులపై రేటింగ్ డౌన్‌గ్రేడ్ చేయడంతో బ్యాంకింగ్ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎస్‌బీఐ 2%, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు 1.51% నష్టపోయాయి.
- బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ సోమవారం ఒక్కరోజే రూ.2.91 లక్షల కోట్ల సంపద తగ్గి రూ.366 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- నష్టాల మార్కెట్లో కొన్ని చిన్న రంగాల షేర్లు రాణించాయి. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ షేరు ఇంట్రాడేలో 2.50% పెరిగి రూ.1182 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది.
- ఈక్విటీ షేర్ల బైబ్యాక్‌కు బోర్డు ఆమోదించినట్లు బజాజ్ ఆటో వెల్లడించింది. షేరుకి రూ. 10,000 ధర మించకుండా 40,00,000 షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది. ఇందుకు రూ. 4,000 కోట్లు వెచ్చించనుంది.

రూ. 120 కోట్లతో మోల్డ్‌టెక్ ప్లాంట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యాకేజింగ్ రంగ సంస్థ మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ రూ.100 కోట్లతో కొత్తగా మూడు ప్లాంట్లను ప్రారంభించింది. తెలంగాణలోని సుల్తాన్‌పూర్, హరియాణాలోని పానిపట్, తమిళనాడులోని చెయ్యార్ వద్ద ఏర్పాటయ్యాయి. వీటి మొత్తం వార్షిక సామర్థ్యం 5,500 మెట్రిక్ టన్నులు. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ కోసం మహారాష్ట్రలోని మహద్ వద్ద రూ.20 కోట్లతో 1,500 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యం గల ప్లాంటు 2024 అక్టోబర్ నాటికి రెడీ అవుతోంది. 2024–25లో మోల్డ్‌టెక్ రూ.75–80 కోట్ల మూలధన వ్యయం చేయనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్లు, 2022–23లో రూ.148 కోట్లు వెచ్చించింది. 2024–25లో పరిమాణంలో 15–18 శాతం వృద్ధిని ఆశిస్తోంది. తాజా విస్తరణతో 2024–25లో మొత్తం వార్షిక తయారీ సామర్థ్యం 54,000 మెట్రిక్ టన్నులకు చేరుతుందని మోల్డ్‌టెక్ సీఎండీ జె.లక్ష్మణ రావు వెల్లడించారు. 'కొత్త ప్లాంట్లు కంపెనీ వృద్ధి అవకాశాలను ప్రధానంగా ఫార్మా ప్యాకేజింగ్‌లో మెరుగుపరుస్తాయి. ఫార్మా పరిశ్రమ నుండి మా ఉత్పత్తులకు డిమాండ్ చాలా ప్రోత్సాహకరంగా ఉంది. 2024–25 తొలి త్రైమాసికం నుండి ఫార్మా ప్యాకేజింగ్ ఆదాయం తోడవుతుంది. 5–6 ఏళ్లలో మొత్తం ఆదాయంలో ఫుడ్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా విభాగాలు 50 శాతం సమకూర్చాలన్నది మా ప్రణాళిక' అని తెలిపారు.

ఏసీసీ చేతికి ఏషియన్ కాంక్రీట్స్



న్యూఢిల్లీ: ఏషియన్ కాంక్రీట్స్, సిమెంట్స్‌లో మిగిలిన 55 శాతం వాటాను అదానీ గ్రూప్ కంపెనీ ఏసీసీ కైవసం చేసుకుంది. ఇందుకు సుమారు రూ.426 కోట్లు వెచ్చించింది. అంబుజా సిమెంట్స్ అనుబంధ సంస్థ అయిన ఏసీసీకి ఇప్పటికే ఏషియన్ కాంక్రీట్స్‌లో 45 శాతం వాటా ఉంది. ఏషియన్ కాంక్రీట్స్, సిమెంట్స్‌కు హిమాచల్ ప్రదేశ్‌లోని నలఘర్ వద్ద 1.3 మిలియన్ టన్నుల ప్లాంటు, అలాగే అనుబంధ కంపెనీ అయిన ఏషియన్ ఫైన్ సిమెంట్స్‌కు పంజాబ్‌లోని రాజ్‌పురాలో 1.5 మిలియన్ టన్నుల సిమెంట్ ప్లాంటు ఉంది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ నేవీ ఎగ్జిక్యూటివ్,టెక్నికల్ బ్రాంచుల్లో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ కింద నాలుగేళ్ల బీటెక్ డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 35 (మహిళలకు 10 ఖాళీలు కేటాయించారు).
» **కోర్సు వివరాలు:** 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(పర్మనెంట్ కమిషన్).
» **బ్రాంచ్:** ఎగ్జిక్యూటివ్, టెక్నికల్.
» **కోర్సు ప్రారంభం:** 2024 జూలైలో.
» **వయసు:** 02.01.2005 నుంచి 01.07.2007 మధ్య జన్మించిన వారై ఉండాలి.
» **అర్హత:** కనీసం 70శాతం మార్కులతో సీనియర్ సెకండరీ పరీక్ష(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ(మెయిన్) పరీక్షలో ర్యాంకు సాధించి ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ(మెయిన్) ర్యాంక్, పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**20.01.2024
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

మేనేజ్, హైదరాబాద్‌లో టెలీ అడ్వైజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్).. ఒప్పంద ప్రాతిపదికన టెలీ అడ్వైజర్(నేచురల్ ఫార్మింగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** అగ్రికల్చర్ పీజీ(అగ్రోనమి/సాయిల్‌సైన్స్/అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ /ప్లాంట్ పాథాలజీ/అగ్రికల్చర్ అటానమీ/అగ్రికల్చర్ మార్కెటింగ్/అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్). టెలీ అడ్వైజరీ సర్వీసెస్ అనుభవం,కంప్యూటర్,భాషా నైపుణ్యాలు ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.01.2024
» **వెబ్‌సైట్:** www.manage.gov.in

టీటీడీ తిరుపతిలో 78 డిగ్రీ/జూనియర్ లెక్చరర్ పోస్టులు

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శాశ్వత ప్రాతిపదికన టీటీడీ డిగ్రీ కళాశాలలు/ఓరియంటల్ కళాశాలల్లో డిగ్రీ లెక్చరర్లు, టీటీడీ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 78
» **పోస్టుల వివరాలు:** డిగ్రీ లెక్చరర్‌లు–49, జూనియర్ లెక్చరర్‌లు–29.
» **డిగ్రీ లెక్చరర్‌లు:** సబ్జెక్టుల వారీగా ఖాళీలు: బోటనీ–03,కెమిస్ట్రీ–02, కామర్స్–09, డెయిరీ సైన్స్–01,ఎలక్ట్రానిక్స్–01, ఇంగ్లిష్–08, హిందీ–02, హిస్టరీ–01, హోమ్ సైన్స్–04, ఫిజికల్ ఎడ్యుకేషన్–02, ఫిజిక్స్–02, పాపులేషన్ స్టడీస్–01, సంస్కృతం–01, సంస్కృత వ్యాకరణం–01, స్టాటిస్టిక్స్–04, తెలుగు–03, జువాలజీ–04.
» **అర్హత:** కనీసం 55శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/స్లెట్ అర్హత సాధించి ఉండాలి.
» **జూనియర్ లెక్చరర్‌లు:** సబ్జెక్టుల వారీగా ఖాళీలు: బోటనీ–04, కెమిస్ట్రీ–04, సివిక్స్–04, కామర్స్–02, ఇంగ్లిష్–01, హిందీ–01, హిస్టరీ–04, మ్యాథమేటిక్స్–02, ఫిజిక్స్–02, తెలుగు–03, జువాలజీ–02.
» **అర్హత:** కనీసం 55శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు డిగ్రీ లెక్చరర్‌కు రూ.61,960 నుంచి రూ.1,51,370. జూనియర్ లెక్చరర్‌కు రూ.57,100 నుంచి రూ.1,47,760.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(కంప్యూటర్ ఆధారిత రిక్రూట్‌మెంట్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 2024, ఫిబ్రవరి మొదటి వారం.
» **వెబ్‌సైట్:** www.tirumala.org

బెల్ బెంగళూరులో 12 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 55,000
» **పనిచేయాల్సిన ప్రదేశం:** పంజాబ్.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ మేనేజర్(హెచ్‌ఆర్), బీఈఎల్, జలహళ్లి, బెంగళూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 23.01.2024.
» **వెబ్‌సైట్:** www.bel-india.in

పదిలో బెస్ట్ గ్రేడ్ ఇలా!

పదో తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలకం! పదిలో సాధించిన మార్కులను ఉన్నత విద్య, ఉద్యోగాల కోణంలో ప్రతి దశలోనూ పరిగణనలోకి తీసుకుంటున్నారు. అందుకే పదో తరగతి వార్షిక పరీక్షలకు అంతటి ప్రాధాన్యం!! ఇంతటి కీలకమైన పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. పదో తరగతిలో.. పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించేందుకు సబ్జెక్ట్ వారీగా ప్రిపరేషన్ టిప్స్..

» ఏపీలో మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు
» తెలంగాణలోనూ మార్చి 18 నుంచి టెన్త్ ఎగ్జామ్స్
» సిలబస్, ప్రశ్నల తీరుపై అవగాహనతో ఉత్తమ స్కోర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024, మార్చి 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. అంతేకాకుండా ఈసారి.. సైన్స్(పీఎస్, ఎన్ఎస్) పేపర్లను వేర్వేరుగా రెండు రోజుల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరోవైపు తెలంగాణలోనూ మార్చి 18 నుంచి పరీక్షలు జరపనున్నట్లు పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తమ సన్నద్ధతకు పదును పెట్టుకోవాలని సబ్జెక్ట్ నిపుణులు సూచిస్తున్నారు.

తెలుగు.. తేలిగ్గా తీసుకోవద్దు

మన మాతృ భాష తెలుగు అనే ఆలోచనతో విద్యార్థులు ఈ సబ్జెక్ట్‌ను కొంత తేలిగ్గా తీసుకుంటారు. కానీ.. మంచి గ్రేడ్ పాయింట్లు సాధించాలంటే మాత్రం విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిందే. అందుకోసం.. పద్యభాగం, గద్యభాగంలోని అన్ని అంశాలను గుర్తుంచుకోవాలి. వాటిని పునశ్చరణ చేసుకోవాలి. పాఠాన్ని కేవలం చదవడంతో సరిపెట్టకుండా.. సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యం ఎంతో ముఖ్యం. ఈ విషయంలో సొంతంగా ఆలోచిస్తూ చదవాలి. ఉప వాచకానికి సంబంధించి ఇతివృత్తం, ప్రాముఖ్యత, పాత్రలు, వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి తదితర అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకోవాలి. తెలుగు సబ్జెక్ట్‌లో వ్యాకరణం కూడా ముఖ్యమే. ఈ వ్యాకరణంలో మెరుగ్గా రాణించాలంటే.. సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్యర్థాలు, జాతీయాలు బాగా చదవాలి. ఇప్పటి నుంచి ప్రతి రోజు క్లాస్ రూంలో బోధించే అంశాలను అదే రోజు ఇంటి వద్ద ప్రాక్టీస్ చేయడం ఎంతో ఉపకరిస్తుంది. విద్యార్థులు జనవరి మొదటి వారం నుంచి పునశ్చరణకు ప్రత్యేకంగా సమయం కేటాయించేలా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి.

ఇంగ్లిష్ - ఆందోళన వద్దు

గ్రామీణ ప్రాంత విద్యార్థులు కొంత ఆందోళన చెందే సబ్జెక్ట్ ఇది. కానీ.. ఇందులోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంది. ఇందుకోసం చేయాల్సిందల్లా.. ముందుగా ఇంగ్లిష్ పదజాలం, వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా వాటిని తాము సొంతంగా విశ్లేషించే నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాలు–సమాధానాలను పరిశీలించడం మేలు చేస్తుంది. విద్యార్థులు ప్రతి పాఠం చివరలో ఉండే కాంప్రహెన్సన్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రతి పాఠానికి సంబంధించి సారాంశాన్ని గ్రహించి.. సొంతంగా రాసుకునే అలవాటు చేసుకోవాలి. పోయెట్రీ ప్రశ్నల్లో మంచి మార్కుల సాధన కోసం సదరు పద్యంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. వీటితో పాటు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్‌ను చదవాలి. వీటిని చదవడంతోపాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందొచ్చు. అన్‌నోన్ ప్యాసేజ్ కింద ఇచ్చే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ఆ ప్యాసేజ్ సారాంశాన్ని గుర్తించే నైపుణ్యం అవసరం. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపై పట్టు పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్.. ప్రాక్టీస్‌తోనే స్కోర్

మ్యాథమెటిక్స్.. భవిష్యత్తులో ఉన్నత విద్య, ప్రవేశ పరీక్షలు..ఇలా అన్నింటా ఎంతో కీలకంగా నిలుస్తుంది. ఈ సబ్జెక్ట్‌లో వందకు వంద సాధించే అవకాశం ఉంటుంది. అందుకోసం ప్రతి చాప్టర్‌ను సంపూర్ణంగా అధ్యయనం చేయడంతోపాటు వాటికి సంబంధించిన ప్రశ్నలు (ప్రాబ్లమ్స్)ను ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ; బీజ గణితం; నిరూపక రేఖాగణితం; పేపర్–2లో రేఖా గణితం; క్షేత్రమితి; త్రికోణమితి; సంభావ్యత, సాంఖ్యక శాస్త్రంపై పట్టు సాధించాలి. విద్యార్థులు ప్రిపరేషన్ సమయంలోనే సమస్య సాధనతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు పొందాలి. ముఖ్యమైన నిర్వచనాలు,సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. టెక్స్ట్ బుక్‌లో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు; సమితులు; బహుపదులు; రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు; సంభావ్యత; సాంఖ్యక శాస్త్రం ; త్రికోణమితి; క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలను సాధన చేస్తే సులభంగానే 60 శాతం మార్కులు సొంతం చేసుకోవచ్చు.

ఫిజికల్ సైన్స్.. అన్వయ దృక్పథం

ఫిజికల్ సైన్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. అనువర్తిత ఆధారిత ప్రిపరేషన్ సాగించాలి. ఇందులో ఫిజిక్స్ నుంచి ఏడు, కెమిస్ట్రీ నుంచి ఏడు మొత్తం 14 చాప్టర్లు చదవాల్సి ఉంటుంది. ఆయా చాప్టర్లకు సంబంధించిన అంశాలను నిజ జీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. విషయ అవగాహనతోపాటు, ప్రశ్నించడం-పరికల్పన చేయడం; ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు–ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా కృషి చేయాలి. కాంతి పరావర్తనం , కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. అదే విధంగా.. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుళైచ్ఛిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలిచ్చే పట్టు లభిస్తుంది. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత పెంచుకుంటే బెస్ట్ స్కోర్ చేయొచ్చు.

నేచురల్ సైన్సెస్

జీవశాస్త్రంలో టాప్ స్కోర్ కోసం సబ్జెక్ట్ అవగాహనతోపాటు విశ్లేషణ నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. ఇందుకోసం ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. ఒక అంశాన్ని నేర్చుకున్న తర్వాత దాన్ని వాస్తవ పరిస్థితులతో అన్వయించే నేర్పు సొంతం చేసుకోవాలి. ప్రయోగాలకు సంబంధించి ప్రయోగం ఫలితంతో పాటు.. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందాలి. చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, భేదాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్‌కు సంబంధించిన భాగాలను గుర్తించడమే కాకుండా..వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

సోషల్ స్టడీస్.. సమకాలీనంగా

సోషల్ స్టడీస్‌లో అడిగే ప్రశ్నల తీరులో మార్పు వచ్చింది. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించి సమకాలీన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. టెక్స్ట్ బుక్‌లో ఒక అంశం గురించి ఉంటే.. దానికి సంబంధించి మన నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనలతో పోల్చుకుంటూ చదవడం లాభిస్తుంది. సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన,ప్రశ్నించడం, ప్రశంస/అభినందనలపై సాధన చేయాలి. అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి, సొంత పరిజ్ఞానంతో రాసే విధంగా నైపుణ్యం పెంచుకోవాలి. జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో భారతదేశం –భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి–ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధ కాలాల సమయంలో ప్రపంచం; సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రను ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగల నుంచి అనుసరించారు? వంటి కోణాల్లో చదవాలి. డయాగ్రమ్/రేఖాచిత్ర, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

ఉత్తమ స్కోర్‌కు సూచనలు

- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు పెంచుకోవాలి.
- ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అనువర్తిత నైపుణ్యం పెంపొందించుకునేలా చదవాలి.
- మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్ కాన్సెప్ట్స్, థీరమ్స్‌ను బాగా అధ్యయనం చేయాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.
- జనవరి నుంచి అధిక సమయం పునశ్చరణకు కేటాయించాలి.
- జనవరి చివరి నాటికి ప్రిపరేషన్, రివిజన్ రెండింటినీ పూర్తి చేసుకోవాలి.
- ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారం వరకు ప్రీ–ఫైనల్స్‌కు హాజరవ్వాలి.
- తొలి పరీక్షకు వారం ముందు నుంచి పూర్తిగా ఆ పరీక్ష కోసమే సమయం కేటాయించాలి.

క్లుప్తంగా...

భద్రాద్రిలో వైభవంగా విశ్వరూప సేవ



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం విశ్వరూప సేవను వైభవంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగిసిన తర్వాత వచ్చే బహుళ ద్వాదశి రోజున విశ్వరూప సేవ నిర్వహించడం ఈ దేవస్థానంలో ఆనవాయితీ. ఏ పుణ్యక్షేత్రంలోనూ లేని ఈ వేడుక దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రగిరిలో మాత్రమే జరుగుతుంది. సంవత్సర కాల పూజల్లో దొర్లే దోషాల నుంచి ప్రాయశ్చిత్తం కోసం శ్రీ సీతారామలక్ష్మణ స్వామితో పాటు ఆలయం ప్రాంగణంలోని ఉపాలయాల్లో ఉండే 108 మంది అర్చనా మూర్తులను ఒకే చోటకు చేర్చి ఏకకాలంలో సేవ నిర్వహించడం ఈ విశ్వరూప సేవ విశిష్టత. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకోలేని వారు ముక్కోటి దేవతలు కొలువై ఉన్న విశ్వరూప సేవ దర్శనం చేసుకుంటే అంతటి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునీకరించిన టీటీడీ వెబ్‌సైట్ ప్రారంభం

తిరుమల: తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని టీటీడీ స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాలకు విస్తృత ప్రాచుర్యం కల్పించేదిశగా అన్ని వివరాలతో ఆధునీకరించిన వెబ్‌సైట్ ttdevasthanams.ap.gov.inను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సోమవారం ప్రారంభించారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమం భూమన మాట్లాడుతూ టీటీడీలో 60కి పైగా ఉన్న స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాలకు సంబంధించిన స్థలపురాణం, ఆర్జిత సేవలు, దర్శన వేళలు, రవాణా వివరాలు, ఇతర సౌకర్యాలను పొందుపరిచారు. ఆలయ విశిష్టతపై ఫొటోలు, వీడియోలను అందుబాటులో ఉంచారు. జియో సంస్థ సహకారంతో టీటీడీ ఐటీ విభాగం ఈ వెబ్‌సైట్ ను ఆధునీకరించింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

టెక్సాస్‌లో రోడ్డు ప్రమాదం

ఖమ్మం జిల్లా వాసి మృతి



పెనుబల్లి: కోటి ఆశలతో అమెరికాకు వెళ్లాడు. ఉద్యోగం చేస్తూ సంపాదించిన సొమ్ముతో ఇటీవలే ఇల్లు కొనుగోలు చేశాడు. గృహప్రవేశం చేసేందుకు సామగ్రితో వెళ్తున్న ఆయనను రోడ్డు ప్రమా దం బలితీసుకుంది. అమెరికాలోని టెక్సాస్‌లో ఆదివారం జరిగిన ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతిచెందారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడుకు చెందిన ముక్కెర భూపాల్‌రెడ్డి 40 ఏళ్ల క్రితం పెనుబల్లి మండలం వీఎం బంజరకు వచ్చి స్థిరపడ్డారు. ఆయన కుమారుడు సాయిరాజీవ్‌రెడ్డి(33) ఉద్యోగరీత్యా కొన్నేళ్లుగా అమెరికాలో నివాసముంటున్నారు. ఇటీవలే ఆయన టెక్సాస్‌లో కొత్త ఇల్లు కొనుగోలు చేశారు. గృహప్రవేశం కోసం ట్రక్కును అద్దెకు తీసుకొని భార్య, సామగ్రితో సహా తానే డ్రైవ్ చేసుకుంటూ బయలుదేరారు. మధ్యలో ట్రక్కు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఇనుప స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయిరాజీవ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. పక్కనే ఉన్న ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడినట్లు తెలుస్తోంది. సాయిరాజీవ్ మృతి చెందినట్లు సమాచారం అందడంతో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది.

బహుళజాతి కంపెనీల 'డిగ్రీ' రూట్

డిగ్రీ కాలేజీల్లో క్యాంపస్ నియామకాలు • కంప్యూటర్ కాంబినేషన్ కోర్సుల్లో స్కిల్స్ ఉన్నవారికి ఆఫర్లు



- వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి తమకు తగినట్టు సానబెట్టుకునే యోచన.. రూ.4 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు వార్షిక వేతనాలు
- గత ఏడాది 43శాతం రిక్రూట్‌మెంట్లలో డిగ్రీ వాళ్లకే చాన్స్.. కేంద్ర విద్యాశాఖ, యూజీసీల అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ విద్యార్థులకు తిరిగి మంచి రోజులొస్తున్నాయి. బహుళజాతి కంపెనీలు కూడా డిగ్రీ కాలేజీల్లో క్యాంపస్ నియామకాలకు ఆసక్తి చూపుతున్నాయి. ఇంజనీరింగ్ కాలేజీల తరహాలోనే ఇక్కడా నిపుణులైన వారికి మంచి ఆఫర్లు ఇస్తున్నాయి. కేంద్ర విద్యాశాఖ, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) గత ఏడాది నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం తేటతెల్లమైంది. గత ఏడాది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన వారిలో కంప్యూటర్ కాంబినేషన్ ఉన్న డిగ్రీ కోర్సులు చేసిన వారు 43శాతం ఉన్నట్టు గుర్తించారు. విప్రో, అమెజాన్, టీసీఎస్, యాక్సెంచర్ వంటి మల్టీనేషనల్ కంపెనీల్లో గరిష్టంగా రూ.16 లక్షలు, కనిష్టంగా రూ.4 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభించినట్టు తేలింది. తెలంగాణలోనూ 45వేల మంది బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్టు విద్యాశాఖ చెబుతోంది. నిజానికి ఈ ట్రెండ్ ఐదేళ్ల క్రితమే మొదలైందని.. గత ఏడాది నుంచి ఊపు వచ్చిందని నిపుణులు చెప్తున్నారు. డిగ్రీ స్వరూప స్వభావం మారుతోందని, అందుకే ఇప్పుడు వీటిని నాన్-ఇంజనీరింగ్ కోర్సులుగా పిలుస్తున్నారని ఉన్నత విద్య వర్గాలు అంటున్నాయి.

టెక్నాలజీ ఆధారిత కోర్సులతో..

తెలంగాణవ్యాప్తంగా 4 లక్షల పైచిలుకు డిగ్రీ సీట్లున్నాయి. ఏటా 2.25 లక్షల సీట్ల వరకూ భర్తీ అవుతున్నాయి. ఇందులో చాలా మంది కంప్యూటర్ సాంకేతికత కోర్సులకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. సాధారణ కోర్సులతోపాటు ఏదైనా డిమాండ్ ఉన్న కాంబినేషన్ సబ్జెక్టులను ఎంచుకుంటున్నారు. అలాంటి విద్యార్థులకు బహుళజాతి కంపెనీలు ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నాయి. ఈ క్రమంలో బీకాం కంప్యూటర్స్ చేసిన వారికి ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. కోవిడ్ తర్వాత అన్ని విభాగాల్లో యాంత్రీకరణ ప్రభావం కనిపిస్తోంది. అన్ని కంపెనీలు ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానాలను అభివృద్ధి చేసుకున్నాయి. డేటా ఎనాలసిస్, మార్కెటింగ్ ట్రెండ్స్, ఆడిట్ కోసం సాంకేతిక నిపుణులు అవసరం. బీకాం చేసినవారికి ఆడిట్ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటున్నాయి. పెద్ద ఆడిటర్ల కన్నా బీకాం పూర్తిచేసే ఆడిటర్లను అసిస్టెంట్లుగా కంపెనీలు నియమించుకుంటున్నాయి.

తెలంగాణవ్యాప్తంగా గత ఏడాది 76వేల మంది కామర్స్ గ్రాడ్యుయేట్లు మార్కెట్లోకి వచ్చారు. వారిలో 24వేల మంది వరకు అసిస్టెంట్ ఆడిటర్లు, అనలిస్టులుగా బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. గత సంవత్సరం బీఏ నేపథ్యంతోపాటు కంప్యూటర్స్ ఆప్షన్‌తో ఉత్తీర్ణులైన విద్యార్థులు 18 వేల మంది మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగాలు పొందినట్టు కేంద్ర

మూడో వంతు మందికి..

విద్యాశాఖ గణాంకాలు చెప్తున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులతో సమానంగా డిగ్రీ విద్యార్థులకు నైపుణ్యం ఉండటం, వారిని తక్కువ వేతనంతో తీసుకున్నా వీలైనంత త్వరగా శిక్షణ ఇచ్చి అనుకూలంగా మార్చుకోవచ్చని కంపెనీలు భావిస్తుండటమే దీనికి కారణం. విద్యార్థులు కూడా మొదట్లో తక్కువ వేతనాలకే చేరుతున్నా.. నైపుణ్యం పెరిగితే మంచి వేతనం వస్తుందని ఆశిస్తున్నారు.

రాజధానికే పరిమితం...

ఇప్పటికీ నాణ్యమైన డిగ్రీ విద్య కేవలం హైదరాబాద్, పరిసర ప్రాంతాలకే పరిమితమైంది. మంచి వేతనంతో ఉద్యోగం పొందుతున్నవారిలో ఇక్కడి కాలేజీల్లో చదివినవారే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని 83 కాలేజీల నుంచి డిగ్రీ విద్యార్థులు బహుళజాతి కంపెనీల్లో మంచి ఉద్యోగాలు పొందారు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లోని డిగ్రీ కాలేజీల్లో నాణ్యత పెరగడం లేదు. క్యాంపస్ సెలక్షన్‌కు వెళ్ల కంపెనీలు కూడా హైదరాబాద్ ప్రాంత డిగ్రీ కాలేజీలకే ప్రాధాన్యమిస్తున్నాయి. డిగ్రీలో విద్యార్థుల్లో 43శాతం హైదరాబాద్, పరిసరాల్లోకి కాలేజీల్లోనే చేరుతున్నారు. ఇక్కడ డిగ్రీ చేస్తూనే పార్ట్‌టైం జాబ్ చేసుకోవచ్చనే ఆలోచన, చదువుకునే సమయంలో ఇతర కోర్సులు చేయడానికీ హైదరాబాద్ అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశమే దీనికి కారణం. విద్యార్థుల చేరిక ఎక్కువగా ఉండటంతో మార్కెట్లో డిమాండ్ ఉండే వివిధ కాంబినేషన్ల కోర్సులను హైదరాబాద్‌లోని డిగ్రీ కాలేజీలు ప్రవేశపెట్టగలుతున్నాయి. ఇలా డేటాసైన్స్, ఆనర్స్ వంటి కోర్సులు హైదరాబాద్ పరిధిలోనే విజయవంతంగా కొనసాగుతున్నట్టు ఉన్నత విద్యా మండలి వర్గాలు కూడా చెప్తున్నాయి. భవిష్యత్‌లో అన్ని జిల్లాల్లోని డిగ్రీ కాలేజీల్లోని కోర్సుల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని అంటున్నాయి.

నైపుణ్యమే డిగ్రీ విద్యార్థులకు నజరానా

డిగ్రీ విద్యార్థులను నియమించుకునేందుకు పెద్ద కంపెనీలు ఇష్టపడుతున్నాయి. వీరిలో ఇంజనీరింగ్ విద్యార్థులతో సమానమైన నైపుణ్యం ఉంటుందని భావిస్తున్నాయి. వారిని తేలికగా తమ కంపెనీ అవసరాలకు తగినట్టుగా మలుచుకోవచ్చనే అభిప్రాయం కూడా ఉంది. డిగ్రీలో వస్తున్న కాంబినేషన్ కోర్సుల వల్ల నైపుణ్యం పెరిగింది. తక్కువ వేతనాలతో ఉద్యోగులను తీసుకునే కంపెనీలు కూడా డిగ్రీ విద్యార్థులను ఇష్టపడుతున్నాయి. వారు అంత తేలికగా కంపెనీ మారరనే భావన ఉంది. ఇవన్నీ డిగ్రీ విద్యార్థులకు కలసి వచ్చే అంశాలే.
– బుర్రా వెంకటేశం, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

2023లో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థుల వివరాలివీ..

బీకాం	85,153	బీసీఏ	4,706
బీఎస్సీ లైఫ్‌సైన్స్	43,180	డిప్లొమా	595
బీఏ	29,752	బీబీఎం	107
బీఎస్సీ ఫిజికల్ సైన్స్	25,937	బీఎస్‌డబ్ల్యూ	56
బీబీఏ	15,160	బీ.ఒకేషనల్	28

మరో పులి మృత్యువాత



- కాగజ్‌నగర్ రేంజ్ దరిగాంలోనే వారం రోజుల్లో రెండు పులులు మృతి
- వరుస మరణాలపై అటవీ శాఖ సీరియస్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ కవ్వాల్ టైగర్ రిజర్వు కారిడార్‌లో సోమవారం మరో పులి కళేబరాన్ని గుర్తించారు. ఇది చనిపోయి ఎన్ని రోజులైంది. ఎలా చనిపోయిందనేది అటవీ అధికారులు ప్రస్తుతానికి చెప్పలేకపోతున్నారు. ఆ వివరాలు సేకరిస్తున్నామని అంటున్నారు. ఈ నెల 6న కాగజ్‌నగర్ రేంజ్ దరిగాం బీట్‌లో ఓ పులి కళేబరాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. ఇలా రోజుల వ్యవధిలో రెండు పులుల మృత్యువాత ఆందోళన కలిగిస్తోంది. కేవలం వారం రోజుల్లో రెండు పులులు చనిపోవడం రాష్ట్రంలోనే ఇది తొలిసారిగా చెబుతున్నారు. దీంతో అటవీ శాఖ ఈ మరణాలపై సీరియస్‌గా తీసుకుంది.

అది ఏడాదిన్నర వయసు పులి: మహారాష్ట్రలోని తడోబా-అంధేరి పులుల అభయా రణ్యం నుంచి పులులు వచ్చి ఇటు వైపు స్థిర నివాసం ఏర్పరచుకుంటున్నాయి. కవ్వాల్‌లోని కోర్ ప్రాంతంలో కాకుండా కాగజ్‌నగర్ డివిజన్‌లో కారిడార్ ప్రాంతంలోనే ఆవాసాలు తీర్చిదిద్దుకుంటున్నాయి. ఈ క్రమంలో ఆహారం, తోడు కోసం సంచరిస్తూ మేతకు వెళ్లిన పశువులను హతమార్చి ఆకలి తీర్చుకుంటున్నాయి. ఈ నెల 6న చనిపోయిన పులి కళేబరాన్ని, అక్కడ కనిపించిన ఆన వాళ్లను పరిశీలించి రెండు పులుల మధ్య ఆధిపత్య పోరులో ఏడాదిన్నర వయస్సున్న పులి మృత్యు వాత పడినట్లు గుర్తించారు. విష ప్రయోగం, వేటాడడం, తదితరవాటిపై స్పష్టత కోసం పరీక్షల నిమిత్తం శాంపిళ్లు ల్యాబ్‌కు పంపారు.

కెమెరాకి చిక్కిన ఆ 3 పులులు: ఇటీవల కాగజ్‌నగర్ రేంజ్ దరిగాం అటవీ ప్రాంతంలో పులులు ఓ పశువును హతమార్చాయి. మూడు పులులు కలిసి పశు కళేబరాన్ని ఆరగిస్తుండగా కెమెరాకు చిక్కాయి. ఆ ప్రాంతంలోనే ఏడాదిన్నర వయస్సున్న కే15(కే అంటే కాగజ్‌నగర్) పులి చనిపోయినట్లు గుర్తించారు. ఇది ఎస్6కు పుట్టిన రెండింటిలో ఒకటి. మరుసటి రోజే మరో పులి అదే ప్రాంతంలో చనిపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు చెబుతున్నట్లు పులుల మధ్య ఆధిపత్య పోరేనా? లేక మరేదైనా కారణమా? గుర్తించాల్సి ఉంది. సాధారణంగా రెండు పులుల మధ్య పోరు జరిగితే ఒకటి నెగ్గితే మరోటి వెళ్లిపోతుంది. చాలా అరుదైన ఘటనల్లోనే చనిపోతాయని నిపుణులు అంటున్నారు. తాజాగా చనిపోయిన రెండో పులి వయస్సులో పెద్దదిగా ఉన్నట్లుగా సమాచారం. అటవీ అధికారులు మాత్రం ఆవాసం కోసమే రెండింటి మధ్య భీకర పోరు జరిగి ఓ పులి మృతిచెందిందని అంటున్నారు. మరి రెండో పులి మృత్యువాతపై స్పష్టత రావాల్సి ఉంది.

నిబంధనలు పాటించని అధికారులు?: మరోవైపు జాతీయ పులుల సంరక్షణ అథారిటీ నిబంధనల ప్రకారం పులి చనిపోతే నిపుణులైన పశువైద్యులు, ఎన్జీవో లేదా ప్రైవేటు వ్యక్తుల మధ్య కళేబరానికి దహనం నిర్వహించాలి. రాత్రివేళ కాకుండా మధ్యాహ్నమే కార్యక్రమం చేయాల్సి ఉన్నా అటవీ అధికారులు ఈ నిబంధ నలు పాటించలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

'సంక్రాంతి వేడుకల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు'



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి వేడుకల్లో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పతంగులు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, నిబంధనల మేరకు డీజే, లౌడ్‌స్పీకర్లు వినియోగించాలని పేర్కొన్నారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని, పిట్టగోడలు లేని ఇళ్ల, భవనాల పైకప్పు నుంచి పతంగులు ఎగురవేయవద్దని సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని, నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొలికపూడి, టీవీ5 సాంబశివరావుల విచారణ

విచారించిన ఏపీ సీఐడీ

సాక్షి, అమరావతి: సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తలనరికి తెస్తే రూ.కోటి ఇస్తామన్న వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు, టీవీ 5 న్యూస్ యాంకర్ సాంబశివరావులను ఏపీ సీఐడీ అధికారులు సోమవారం విచారించారు. గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో వారిద్దరిని కలిపి, విడివిడిగానూ విచారించారు. టీవీ 5 చానల్ నిర్వహించిన డిబేట్ ద్వారా తన హత్యకు ప్రేరేపించేందుకు ఉద్దేశపూర్వకంగానే కొలికపూడి శ్రీనివాసరావు ఆ వ్యాఖ్యలు చేశారని రామ్‌గోపాల్ వర్మ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అందుకు బాధ్యులుగా ఆయన పేర్కొన్న కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు, టీవీ 5 చానల్ ఎండీ, చీఫ్ ఎడిటర్ బి.ఆర్.నాయుడు, న్యూస్ యాంకర్ సాంబశివరావు, ఫిరోజ్, టీవీ 5 మేనేజింగ్ ఎడిటర్లపై పలు సెక్షన్ల కింద సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈనెల 3న కొలికపూడి శ్రీనివాసరావును సీఐడీ అధికారులు మొదటి దఫా విచారించారు. కాగా ఆరోజు న్యూస్ యాంకర్ సాంబశివరావు విచారణకు హాజరుకాలేదు. దాంతో వారిద్దరిని సోమవారం సీఐడీ అధికారులు విచారించారు. ఆర్జీవీని హత్య చేసేలా ఎందుకు వ్యాఖ్యానించారు? ఉద్దేశపూర్వకంగానే మాట్లాడారా? ఆ వ్యాఖ్యలతో ప్రేరేపితమై ఎవరైనా అవాంఛనీయ ఘటనకు పాల్పడితే పరిణామాలు ఎలా ఉంటాయో అవగాహన ఉందా.. సమాజంలో విద్వేషాలు రేకెత్తించకూడదన్న అవగాహన లేదా..? అంటూ వారిద్దరిపై సీఐడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ సీఐడీ అధికారుల ప్రశ్నలకు కొలికపూడి శ్రీనివాసరావు, సాంబశివరావు సూటిగా సమాధానం చెప్పలేదని సమాచారం.



సోమవారం తిరుమల ఘాట్ రోడ్డును కమ్మేసిన దట్టమైన పొగ మంచు

బరిలో బౌన్సర్లు

కోడి పందేల బరుల్లోనూ కాపలా..

- కండలు తిరిగిన యువతకు ఉపాధి మార్గం
- జిమ్ నిర్వాహకుల పర్యవేక్షణలో ఏజెన్సీలు
- ఖరీదైన పందేల్లో గలీజు గొడవలకు అడ్డుకట్ట
- ఉభయ గోదావరి, విశాఖ, విజయవాడలో బౌన్సర్లు రెడీ




సాక్షి, అమరావతి: సంక్రాంతి బరిలో పందెం కోళ్లతోపాటు బౌన్సర్లు సైతం దిగబోతున్నారు. సెలబ్రిటీలకు రక్షణ కవచంగా ఉండే బౌన్సర్లను షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవాలు, వివాహాలు, వేడుకల సందర్భాల్లో ఉపయోగిస్తుండగా ఇకపై ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సాగే కోడి పందేల జాతరలో ప్రైవేటు సైన్యంగా బౌన్సర్లు సైతం రంగంలోకి దిగనున్నారు. ఇందుకోసం రాష్ట్రంలో ప్రధాన జిమ్ సెంటర్ల నిర్వాహకుల పర్యవేక్షణలో ఏజెన్సీలు సిద్ధమయ్యాయి. శిక్షణ పొందిన బౌన్సర్లు సిద్ధంగా ఉన్నారని, కోడి పందేల నిర్వాహకులు అవసరమైతే తమను సంప్రదించాలని సామాజిక మాధ్యమాల్లో ప్రచారానికి తెరలేపారు. బలిష్టమైన శరీరాకృతి, ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో బరుల్లో కలియ తిరిగే వారిని చూస్తే పందెం రాయుళ్లు సైతం గొడవలకు వెనుకడుగు వేస్తారు. వారి సహకారంతో బరుల్లో ఏ వివాదాలు తలెత్తకుండా ప్రశాంతంగా కోడి పందేలు నిర్వహిస్తారు. ప్రధానంగా భీమవరంలో 70 మంది, పాలకొల్లులో 20 మంది, రాజమండ్రిలో 300 మంది, విజయవాడలో 200 మంది, విశాఖపట్నంలో 300 మంది శిక్షణ పొందిన బౌన్సర్లు ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి రోజువారీ వేతనాన్ని మాట్లాడుకుని బరిలో దించితే ఖరీదైన కోడి పందాల్లో సైతం గలీజు గొడవలకు అడ్డుకట్ట పడుతుంది.

బరిలో బౌన్సర్లకు ఉపాధి

బౌన్సర్ వృత్తిని యువత ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారు. పెళ్లిళ్లు, వేడుకల్లో రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 ఇస్తున్నారు. సెలబ్రిటీల రక్షణకు వెళితే రూ.2,500 నుంచి రూ.3 వేలు ఇస్తున్నారు. తాజాగా కోడి పందేల బరుల్లో బౌన్సర్ల కోసం ఏజెన్సీలను సంప్రదించి ఒప్పందాలు చేసుకుంటున్నారు. వీటిలో చిన్న పందేల బరిలో రోజుకు రూ.1,500, భారీ పందేల్లో అయితే రూ.3 వేల చొప్పున ఇచ్చేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు.
– అడిదెల రవి, సీనియర్ కోచ్, భీమవరం

టుడేస్ గ్రాఫిక్



కరోనా టెస్టింగ్ కిట్లు కొనొద్దు!

- అవసరం లేదంటున్న అధికారులు
- ఆరోగ్య కేంద్రాల్లో గత నెలాఖరుకు గడువు తీరిపోయిన కిట్లు
- కోవిడ్ ముప్పు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు
- మెడికల్ ఆఫీసర్లు కిట్లు ఇవ్వాలని కోరినా స్పందన కరువు



సాక్షి, హైదరాబాద్

కరోనాపై జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా కోవిడ్ పరీక్షలు చేసే విషయంలో తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దేశవ్యాప్తంగా అనేకచోట్ల కరోనా కేసులు విస్తరిస్తున్నాయి. అక్కడక్కడా మరణాలు కూడా సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రుల్లో పడకలు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా.. అధికారులు మాత్రం ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లో కరోనా టెస్టింగ్ కిట్లు గత నెలాఖరు నాటికి గడువు తీరిపోయాయి. దీంతో పరీక్షలు నిలిచిపోయాయి. అయితే కొత్త వాటిని కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అధికారులు సంబంధిత విభాగానికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. కరోనా విస్తరిస్తున్నా, ప్రమాదం లేనందు వల్ల పరీక్షలు చేయాల్సిన అవసరం లేదని వారు అంటున్నట్లు సమాచారం. కాగా, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు కోవిడ్ కిట్లు కావాలని కోరుతుంటే, అవసరంలేదని పై అధికారులనుంచి సమాధానం వస్తోందని అంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఒక మెడికల్ ఆఫీసర్ దీనిపై కోఠిలోని ప్రజారోగ్య సంచాలకుని కార్యాలయానికి వచ్చి అడిగినా స్పందించడంలేదని తెలిసింది. జిల్లావ్యాప్తంగా కిట్లు కాలం తీరిపోయాయని చెప్పినా పట్టించుకోలేదని ఆయన వాపోయారు.

నిలిచిన కరోనా బులెటిన్..

ప్రజలను అప్రమత్తం చేసేందుకు, కోవిడ్ తీవ్రతను తెలియజేసేందుకు కరోనా కాలంలో రోజూ బులెటిన్‌ను విడుదల చేసేవారు. కేంద్రం ఇప్పటికీ ప్రతీరోజూ కరోనా బులెటిన్‌ను విడుదల చేస్తోంది. అయితే తెలంగాణ ప్రజారోగ్య సంచాలకుని కార్యాలయం నుంచి మాత్రం రోజువారీ బులెటిన్‌ను నిలిపి వేశారు. కరోనా టెస్టులు చేయకపోవడం, అక్కడక్కడ చేసినా.. ఆ వివరాలను బయటపెట్టడం అవసరం లేదన్న భావనతో ఇక్కడి అధికారులు సొంత నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కేంద్రం రోజూ కోవిడ్ బులెటిన్‌ను విడుదల చేస్తుంటే, తెలంగాణలో దాచిపెట్టాల్సిన అవసరం ఏముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పైగా ఇప్పుడు సంక్రాంతి సీజన్. ప్రజలు ప్రయాణాలు చేస్తుంటారు. ఒకచోట నుంచి మరోచోటకు గుంపులుగా వెళుతుంటారు. దీనివల్ల కేసులు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తమవుతోంది. కానీ ఈ విషయంలో జనాన్ని అప్రమత్తం చేసేలా ప్రజారోగ్య సంచాలకుని కార్యాలయం నుంచి ఎలాంటి ఉత్తర్వులు జారీకావడంలేదు. గతంలో అధికారులు చురుగ్గా వ్యవహరించి ఎప్పటికప్పుడు వివరాలు అందజేసేవారు. దీనివల్ల ప్రజలు జాగ్రత్తలు పాటించేవారు. వైద్య, ఆరోగ్య శాఖలో ముఖ్యకార్యదర్శి సహా డీఎంఈ, ప్రజారోగ్య సంచాలకుడు, టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు మారిన నేపథ్యంలో కీలకమైన ఈ సమయంలో ఆయా అధికారులు చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పండుగ సీజన్‌లో జాగ్రత్త



ప్రస్తుతం పండుగ సీజన్ కావడంతో ప్రయాణాలు చేసేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. రద్దీ కారణంగా వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఇన్ఫెక్షన్లకు గురికాకుండా మాస్కులు ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవడం లాంటివి క్రమం తప్పకుండా చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం సైతం కరోనా పట్ల ప్రజలను మరింత అప్రమత్తం చేయాలి. ఈ మేరకు విస్తృత ప్రచారం చేయడంతో పాటు పరీక్షల సంఖ్యను పెంచి వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసేలా కార్యాచరణ రూపొందించాలి.
–డాక్టర్ రంజిత్, జనరల్ ఫిజీషియన్, వరంగల్



ఎవరైనా నోటితో విజిల్స్ వేయడం సాధారణమే.. కానీ అదే విజిల్స్‌ను ముక్కుతో వేయగలిగితే..!! ఇదెలా సాధ్యం అంటారా? కెనడాలోని ఒంటారియాకు చెందిన లులు లోటస్ అనే యువతి ఇలా ముక్కుతో ఈలలేస్తూ యావత్ ప్రపంచాన్ని ముక్కునవేలేసుకొనేలా చేస్తోంది!! నోటితో ఈలపాటలు పాడే వారిలాగే ముక్కుతో ఆమె శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించగలదు!! ఈమె విజిల్స్ శబ్దం గరిష్టంగా 44.1 డెసిబెల్స్ వరకు చేరుకుంటుందట!! లులు విజిల్స్ సామర్థ్యాన్ని చూసిన గిన్నిస్‌వారు 'ముక్కుతో అత్యంత శబ్దం చేస్తూ వేసిన విజిల్'గా ఆమె పేరును రికార్డుల్లోకి ఎక్కించేశారు. గొంతు కండరాలను ఉపయోగిస్తూ నిశ్వాస ప్రక్రియను నియంత్రించడంతో ఈ విచిత్రమైన సామర్థ్యాన్ని పెంపొందించుకున్నట్టు లులు తెలిపింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.